అపరాధ పరిశోధన

రు. 3 మార్చి '78

Blank Page

సంపుటి: 25
సంచిక: 2

ఫోన్ నెం.
36959

అపరాధ పరిశోధన

డిటెక్టివ్ కథల మాస పత్రిక

ది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 39 రూపాయలు
చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 250 రూపాయలు.

మార్చి, 1978

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
కంచర్ల రమణ
ఏ. వీ. మోహన్రావ్

మరుపురాని పందెం!

వసుంధర

ఉన్నట్లుండి అన్నాడు ప్రతాప్ "నాకు కొంచెం కళ్ళు తిరుగుతున్నట్లుగా ఉంది. ఇంటికి వెళ్ళిపోతాను...."

శ్యామలరావు ఆశ్చర్యంగా చూశాడు ప్రతాప్ వంక.

అనుమతికోసం ఎదురుచూడకుండానే ప్రతాప్ హడావుడిగా వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నాడు.

మోహనరావు నెమ్మదిగా శ్యామలరావు చెయ్యి నొక్కి "అతను వెళ్ళిపోవడానికి కారణం నాకు తెలుసు. ఆ ఎదుటి గదిలోని దృశ్యమే—" అన్నాడు.

ఆ ఎదుటి గదిలో ఓ రోగికి ఆక్సిజన్ పెడుతున్నారు.

"ఆ రోగి అతనికి బంధువా—" అని శ్యామలరావు అడిగాడు.

"అబ్బే అదేం కాదు. శ్వాస పీల్చుకోవడానికి ఆ రోగి ఎంత అవస్థపడుతున్నాడో చూడండి. అతని డొక్కలెలా ఎగిరిపడుతున్నాయో చూడండి. అటువంటి దృశ్యాలను

ప్రతాప్ చూడలేదు. అందుకే అతను సాధారణంగా ఈ కేజీ హాస్పిటల్లో అడుగెట్టడు—చాలా బలహీనమైన హృదయ మతనిది—" అంటూ మోహనరావు నవ్వాడు.

అతని నవ్వు పూర్తయ్యేసరికి ఆ బలహీనహృదయుడు ప్రతాప్ రోడ్డుమీదకు వచ్చేశాడు. అతని హృదయం ఇంకా వేగంగా కొట్టుకుంటూనే ఉంది. అతని కళ్ళముందు ఆ దృశ్యమింకా మెదుల్తూనే ఉంది అతని శరీరమింకా జలదరిస్తూనే ఉంది.

ఏమిటో ఈ సృష్టి? ఎన్నోరకాల ప్రాణులు—జీవితంలో ఎన్ని అవస్థలు పడుతున్నదో? రోగాలు, పేదరికం, ఆహారపు కొరత, మరణం—ఇవి ప్రాణులకు భయంకర బాహ్య శత్రువులు. కానీ అవికూడా సృష్టిలోని భాగమే మరి—! సృష్టిలోని ఆ భాగాన్ని చూసి తట్టుకోగల మనోబలం సృష్టికర్త తనకెందుకివ్వలేదు?

అతను సిద్ధార్థుడిలా బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా పెరగలేదు. వృద్ధాప్యం, రోగం, మరణం—చిన్ననాటినుంచీ అతను చూస్తూనే ఉన్నాడు. చూసినప్పుడల్లా అతను చలించిపోతూనూ వున్నాడు. ఎటొచ్చీ బుద్ధుడు కాగలగడానికతను సిద్ధార్థుడు కాడు—ప్రతాప్!

అతని ఈ బలహీనపు మనస్తత్వం ఎన్నోసార్లు విమర్శలకు గురయింది. అందరికంటే ఎక్కువగా అతన్ని విమర్శించేవాడు మోహనరావు అని చెప్పవచ్చు.

మోహనరావుకూడా ప్రతాప్ పని చేస్తున్న కాలేజిలోనే లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ప్రతాప్‌తో పోలిస్తే అతనికి మనోనిబ్బరం ఎక్కువనే చెప్పాలి. అతను సాధారణంగా దేనికీ చలించడు. ఈ విషయంలోనే వాళ్ళిద్దరకూ తరచుగా వాదోపవాదాలు జరుగుతూండేవి.

"మనోదౌర్బల్యం మనిషిని అధఃపాతాళానికి తోసే స్తుంది. జీవితంలో సుఖమన్నది లేకుండా చేస్తుంది. ప్రతి పేరయ్య కష్టానికీ జాలిపడుతూ కూర్చుంటే మనం బ్రతికే దెలా?" అంటాడు మోహనరావు.

అయితే ప్రతాప్ వాదన వేరు.

"బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మనో నిబ్బరం కలిగిన మహాత్ముడు—హరిజనుల కష్టాలు చూసి చలించిపోయాడు. అసలు భారతీయుల బానిసత్వం ఆయన్ను కదలించడంవల్లనేకదా—స్వాతంత్ర్య పోరా టాని కాయన నాయకత్వం వహించాడు. కాబట్టి మనో దౌర్బల్యమే ప్రగతికి మూలకారణం. ఎటొచ్చీ మీరు చెప్పినట్లు అది మనిషిని అధఃపాతాళానికి పంపకుండా మాత్రం చూసుకోవాలి—"

"మీరు వాదనను తప్పుదారి పట్టిస్తున్నారు. మన మిప్పుడు మహాత్ముల గురించి మాట్లాడడంలేదు. సామా న్యుల సంగతి మాట్లాడుతున్నాం. మహాత్ముల విషయం వేరు. వాళ్ళు తమ కష్టాలకు చలించరు. ఇతరుల కష్టాలే వాళ్ళను బాధిస్తూంటాయి. అందుకు వాళ్ళ దుర్బల మన స్తత్వమే కారణమనుకుందాము అయినా ఇతరుల కష్టా లను తొలగించడానికి వాళ్ళు చేసే ప్రయత్నాలకు ఎంతో మనోనిబ్బరం అవసరం. అటువంటప్పుడు వాళ్ళని దుర్బల మనస్కులని ఎలా అనగలం?"

"కరెక్టు—" అన్నాడు ప్రతాప్—"మీరు అసలు పాయింటుకొచ్చారు. ఇతరుల కష్టాలు చూసి చలించేవారం దరూ దుర్బల మనస్కులు కారని దీన్నిబట్టి తేలింది...."

తర్వాత ఏం మాట్లాడాలో తెలియక "వాదనలో మీరు

తెలివైనవారని ఒప్పుకొంటాను కానీ మీరు దుర్బల మన స్కులు కాదని మాత్రం ఒప్పుకోను" అని ఊరుకునే వాడు మోహనరావు.

"దుర్బల మనస్కులు వాదనలో నెగ్గలేరండీ" అని నవ్వి "మీరు అనుకునేటంత దుర్బల మనస్కుణ్ణి నేను కాదని మీరు తెలుసుకునే రోజెలాగూ వస్తుంది. కానీ మీరు కోప

గించుకోనంటే ఒక విషయం చెబుతాను. మీరు చాలా దుర్బల మనస్కు లనిపిస్తోంది నాకు—" అన్నాడు ప్రతాప్.

మోహనరావుకి కోపం వచ్చింది. ముఖం ఎర్రబడింది. "పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందంటారే—ఆ సామెత నిజం చేస్తున్నారు—"

ప్రతాప్ నవ్వి "నేను మామూలుగానే నవ్వుతున్నాను. నన్ను మీరు దుర్బల మనస్కుడన్నా నా నవ్వు మారలేదు. కానీ నేను మిమ్మల్నలా అనేసరికి మీ ముఖం ఎర్రబడిపోయింది. మామూలుగా నవ్వలేకపోతున్నారు. మీకు కలిగిన ఆవేశమే అందుక్కారణం. ఆవేశం మనోదౌర్బల్యం వల్ల కలుగుతుంది—ఏమంటారు?" అన్నాడు.

మోహనరావు ఈసారి తమాయించుకున్నాడు. ప్రతాప్ చమత్కారానికి అతనికి నవ్వు కూడా వచ్చింది. అయినా పట్టుదలకొద్దీ "నేను మీకంటే దుర్బలమనస్తత్వం గలవాడినని ఋజువు చేయగలిగినప్పుడు వెంటనే వంద రూపాయలిస్తాను" అన్నాడు మోహనరావు.

"పందెం వేశారు. గుర్తుంచుకోవాలి మరి..." అన్నాడు ప్రతాప్.

2

ఆ విధంగా ఆర్నెల్ల క్రితం పందెం వేసుకున్నారు మిత్రు లిద్దరూ.

ఈ ఆర్నెల్లలో మోహనరావు విషయంలో ఏమీ మార్పు లేదు—అతను బ్రహ్మచారి కాబట్టి.

అయితే ప్రతాప్ విషయంలో మాత్రం ఒక చిన్న మార్పు ఉంది. రెండు నెలల క్రితం అతని భార్య పురిటికి

పుట్టింటికి వెళ్ళింది-అతని జీవితంలోకి కొత్త వెలుగును తీసుకురావడానికి.

భార్య పుట్టింటికి వెళ్ళినప్పట్నించీ ప్రతాప్ కొంచెం దిగులుగా కనిపించేవాడు. అప్పుడప్పుడు మోహనరావు అతని మీద విసుర్లు కూడా విసురుతూండేవాడు "అక్కయ్య గారు వెళ్ళిపోయేక బెంగపడిపోయారు మీరు...." అని. అందుకు ప్రతాప్ వెంటనే అంగీకరించేసేవాడు "అవును-వివాహమయ్యేక ఇంతవరకూ మేమిద్దరమూ ఒకరి నొకరు వదిలి వుండలేదు" అని.

మోహనరావుకు తెలిసినంతవరకూ ఆ విషయం నిజమే. ఇద్దరూ కలసి కాలేజీలో మూడేళ్ళుగా లెక్చరర్స్‌గా పని చేస్తున్నారేమో ప్రతాప్ గురించిన ప్రతి విషయమూ మోహనరావుకు తెలుసునని చెప్పవచ్చును.

ప్రతాప్ దంపతుల దాంపత్యం మోహనరావుకు ముచ్చటగా ఉండేది. ప్రతాప్ భార్య కమల కూడా అరమరికలు లేని మనిషి. అతిధులను నిండు మనస్సుతో ఆప్యాయంగా ఆహ్వానించే ఆమెలో చెప్పుకోదగ్గ కలుపుగోరు తనం వుంది. స్త్రీ పవిత్రతను గుర్తు చేసే ప్రవర్తన ఆమెది. చలాకీగా కబుర్లు చెబుతూండే ఆమెను చూస్తూంటే ఏ అతిథికైనా వెంటనే తన సోదరి గుర్తుకు వచ్చేది.

ఆ దంపతు లిద్దరిదీ ఒక్కటే మాట. ఎన్నడూ దెబ్బలాడుకున్నట్లు కనిపించరు. ఎప్పుడైనా దెబ్బలాడుకున్నా అందులో సీరియస్‌నెస్ వుండదు. ఏదో ఛేంజ్ కోసం సరదాగా దెబ్బలాడుకుంటున్నట్లుంటుంది. వాళ్ళ దెబ్బలాట చూడటానికీ, వినడానికీ కూడా సరదాగా ఉంటుంది.

మొదట్లో మోహనరావుకు దాంపత్యమంటే ఒక రక మైన జుగుప్సా భావ ముండేది. పెళ్ళంటే అదో రకమైన భయం కూడా ఉండేది.

అయితే ప్రతాప్ దంపతులతో పరిచయమైన ఆర్నెల్ల లోనే అతనికి వివాహం మీద మనసు పుట్టింది. దాంపత్య జీవితంలో ఏదో ఆనందముందనీ, వివాహం మనిషిలో ఏదో తెలియని లోటును భర్తీ చేస్తుందనీ అప్పుడే అతనికి అనిపించింది. అదే అతను మంజులను ప్రేమించ డానికి దారి తీసింది.

అప్పుడు మంజుల బియ్యే ఫైనలియ్యర్ చదువుతూం డేది. మోహనరావుకి శిష్యురాలే ఆమె. క్లాసులో ఆమె చాలా తెలివైనది మాత్రమే కాక క్లాసుతో పరీక్ష ప్యాసవ్వా లన్న దీక్ష గల అమ్మాయి. అందుకే తరచుగా లెక్చరర్స్‌ని కలుసుకుని చాలా విషయాలు తెలుసుకుంటూండేది.

చదువు విషయంలో ఆమెకు గల శ్రద్ధకు ముగ్ధుడైన మోహనరావు ఆమెకు సహాయం చేయడంలో చాలా శ్రద్ధ వహించేవాడు. ఆమె కోసం అతను బోలెడు ఎస్సేలు ప్రిపేర్ చేశాడు.

ఇటువంటి విషయాలు ఇతరులు గుర్తించరనుకుంటే అది తెలివి తక్కువే. మోహనరావు మంజులల గురించి కాలేజీలో పుకార్లు కూడా బయల్దేరాయి.

పరీక్షలింక పదిరోజులున్నాయనగా ఓరోజు మంజుల సుడిగాలిలా వచ్చి మోహనరావుని కలుసుకుంది.

"మేస్టారూ! ఇలా అడుగుతున్నందుకు మరోలా అను కోకండి. నేను కొంచెం సూటిగా మాట్లాడే మనిషిని. మీరు నా గురించి చాలా శ్రమ పడుతున్నారు. ఆ శ్రమకు అర్థం ఆపాదించడానికి చాలామంది కుర్రాళ్ళు శ్రమపడుతు

న్నారు. వాళ్ళ శ్రమ కొత్త వార్తలను సృష్టించింది. అనవసరంగా ఒక విద్యార్థినికి సహాయం చేయడానికి శ్రమ పడ్డానని-ఇప్పుడు మీరు బాధపడుతున్నారా!"

మోహనరావు నవ్వేసి "ఈ రోజు నీకు సాయం చేశాను. రేపు ఇంకో పద్మినికో, పద్మరాజుకో సాయం చేస్తాను. అందువల్ల ఇప్పుడు నాకేమీ బాధగా లేదు. కానీ నీ పరీక్ష ఫలితాలు బాగుండకపోతే మాత్రం - నువ్వన్న విధంగానే బాధ పడాల్సి వుంటుంది" అన్నాడు.

మంజుల కళ్ళల్లో నీళ్ళు తిరగ్గా "ఇంత మంచివారు మిమ్మల్ని........" అని మాటలు మింగేసింది.

"అవన్నీ ఆలోచించడానికిది సమయం కాదు. చెడ్డ పేరు నన్నేమీ చేయలేదు. నీకే ఎక్కువ చెరుపు. నువ్వు నా మీద జాలి పడడం అనవసరం, అసంబద్ధంకూడాను. పరీక్షలయ్యేవరకూ ఈ ఆలోచనలు మాత్రం రానీయకు" అన్నాడు మోహనరావు.

అప్పుడు మంజుల వెళ్ళిపోయింది. అప్పుడే అతను మంజులను ప్రేమించడం కూడా ఆరంభమయింది. పరీక్షలైన వెంటనే అతనా విషయం ఆమెకు తెలియబర్చి- "నీకు ఇష్టమైతే మీ పెద్దలతో సంప్రదిస్తాను...." అన్నాడు.

అందమూ, ఉద్యోగమూ వున్న మోహనరావు మంజులకు నచ్చాడు. అయితే ఆమె వెంటనే అతన్ని వివాహం చేసుకునేందుకు వీలు లేకపోయింది. ఆమెకు పెళ్ళికాని అక్కలు ముగ్గురున్నారు. వాళ్ళ వివాహం అయితేగానీ తను వివాహం చేసుకోవడం ఆమెకూ, ఆమె తలిదండ్రులకూ కూడా ఇష్టం లేదు.

అందువల్ల మోహనరావు తన పవిత్రప్రేమ వివాహానికి

దారితీయడానికి కొన్ని ఏళ్ళు ఎదురుచూడవలసి వచ్చింది. ఇప్పుడు అక్కలందరికీ పెళ్ళిళ్ళయిపోయి మంజుల వివాహానికి సిద్ధంగా ఉంది. ఆమె ఆఖరి అక్కకి రెండునెలల క్రితమే వివాహమని తెలిసినప్పుడు మోహనరావు ఎగిరి గంతువేసినంత పని చేయగా—మనోదౌర్బల్యమంటూ ప్రతాప్ ఎగతాళి కూడా చేశాడు

3

ఆ రోజు మోహనరావుకి ఉత్తరం వచ్చింది. రెండ్రోజుల్లో మంజుల వాల్తేర్ వస్తోంది. ఒక ప్రయివేట్ కంపెనీలో ఇంటర్వ్యూ వచ్చిందామెకు. తన ట్రయిన్ అర్ధరాత్రి వస్తుంది కాబట్టి, అతన్ని వచ్చి రిసీవ్ చేసుకోవలసిందని కోరుతూ రాసిందామె.

అప్పటికి మోహనరావు మంజులను చూసి చాలా కాలమయిందేమో-ఆ ఉత్తరం అపరిమితానందాన్ని కలిగించిందతనికి. మంజులను చూడాలని బాగా ఇదిగా వుందతనికి. ఈ ఉత్సాహాన్ని ఒక్కడూ భరించలేక ప్రతాప్ ఇంటికి బయల్దేరాడతను.

అయితే ఇంటికివెళ్ళి ప్రతాప్‌ని చూసేసరికి అతని వుత్సాహమంతా దిగజారిపోయింది.

ప్రతాప్ ముఖం దీనంగావుంది. కళ్లు ఎర్రగా వున్నాయి. గెడ్డం మాసివుంది. మూర్తీభవించిన విషాదంలా వున్నాడతను. అతన్ని చూడగానే మోహనరావు మనసు కీడు శంకించింది—"కొంపదీసి అక్కయ్యగారికి ఏమన్నా ..." అనుకున్నాడతను.

"అలా కూర్చోండి—" అన్నాడు ప్రతాప్ తాపీగా.

"ఏమయింది-అలా వున్నారు?" ఆదుర్దాగా అడిగా డతను.

"ఇంటివాళ్ళబ్బాయి రామం—కారుక్రిందపడి చచ్చి పోయాడు—" అన్నాడు ప్రతాప్. అంటూండగానే అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మాట గాద్గదికమయింది.

"ఓస్ ఇంతేగదా-ఇంకా ఏమో అనుకున్నాను ..." అని చటుక్కున నాలిక్కరుచుకున్నాడు మోహనరావు. రామానికీ, ప్రతాప్‌కీ వున్న అనుబంధం అతనికి తెలియ నిదికాదు. రామానికి పదేళ్ళుంటాయి. అతనికి ప్రతాప్‌వద్ద విపరీతమైన చనువు. ఎప్పుడూ వీళ్ళింట్లోనే వుండేవాడు. చాలామంది రామం, ప్రతాప్ తమ్ముడనుకుని పొరబడే వారు కూడా.

రామంతో మోహనరావుకు కూడా చెప్పుకోదగ్గ చనువూ, పరిచయమూ వున్నాయి. అయినా అతనికి హృదయం కదిలిపోలేదు. అన్యాయంగా యాక్సిడెంట్లో చనిపోయాడే అని బాధమాత్రం కలిగింది. అయినా ప్రతాప్ కింత విచారమెందుకు; వారిద్దరికీ అనుబంధమే కానీ-బంధుత్వమేమీలేదే?

ప్రతాప్ చాలా విచారంలో వున్నాడని గ్రహించిన మోహనరావు నెమ్మదిగా అనునయ వాక్యాలు చెబుతూ— "అయినా అతను మనకేమవుతాడని ఇంత విచారం చెప్పండి-పుట్టినవారైవరైనా చనిపోవలసిందేగదా—కాస్త ముందూ వెనకా తేడా-అంతే!" అన్నాడు.

ప్రతాప్ కళ్ళు తుడుచుకుంటూ—"అదికాదండీ-ఆ తల్లీ తండ్రీ ఇప్పుడు హాస్పిటల్లో వున్నారు. వాళ్ళ దుఃఖం చూస్తూంటే ఎలాంటి వాళ్ళకైనా గుండె నీరైపోతుంది. రామానికి యాక్సిడెంటయిందనీ, హాస్పిటల్లో వున్నాడనీ

విన్నప్పుడు నాకూ అంత దుఃఖం కలగలేదు. ఏదో తెలి యని బాధ మాత్రం కలిగింది. అయితే హాస్పిటల్‌కి నేను వెళ్ళేసరికే రామం చనిపోయాడు. రామం శవాన్నీ, అతని తలిదండ్రుల దుఃఖాన్నీ, అక్కడి వాతావరణాన్నీ, చూస్తూంటే నా గుండె బ్రద్దలై పోయింది. వెంటనే ఇంటి కొచ్చేశాను. ఆ ప్రభావమింకా నామీదనుంచిపోలేదు...." అన్నాడు.

మోహనరావుక్కూడా బాధకలిగింది. తమ కళ్ళముందు తిరిగిన రామం అనే పేరుగల చలాకీ కుర్రవాడు ఇకలేడు. ఏమైపోయాడో, ఎక్కడికిపోయాడో తెలియదు. అసలీ చావు అనేదేమిటో?

తెలిసినవాళ్ళెవరైనా చనిపోయినపుడు — ఇటువంటి వేదాంతం మనస్సులో మెదలడం చాలామందికి మామూలే! మితిమీరిన వుత్సాహంతో వచ్చిన మోహనరావు మనస్సు లోని వుత్సాహం చప్పగా చల్లారిపోయింది. అతను ఎంతో సేపు అక్కడ వుండలేదనడంకంటె—వుండలేక పోయా డంటేనే బాగుంటుంది.

ప్రతాప్ ఇంటిదగ్గర్నుంచి బయటకువచ్చేక రోడ్డుమీద అతనికి అనుకోకుండా రమేష్ కనిపించాడు.

రమేష్, మోహనరావు ఒకే కాలేజీలో చదువుకున్నారు. అప్పట్లో స్నేహితులు. ఆ తర్వాత మళ్ళీ ఇదే కలవడం.

ముందుగా రమేష్ మోహనరావుని గుర్తుపట్టాడు. పరస్పరం గుర్తుపట్టడం జరిగేక-ఓ రెండు నిముషాలసేపు చిన్నతనాన్ని నెమరువేసుకుని-ఆ తర్వాత ప్రస్తుతానికి వచ్చారు.

"నేను మూడు నాల్గేళ్ళుగా-ఈ ఊళ్ళో కాలేజీలో లెక్చరర్‌గా వుంటున్నాను. నువ్వేం చేస్తున్నావ్? ఈ

ఊరొచ్చి ఎన్నాళ్ళయింది?" అన్నాడు మోహనరావు.

"మనది కంపెనీ వుద్యోగం నాలుగు నెల్లయిందీ ఊరొచ్చి—" అన్నాడు రమేష్.

"ఐసీ - అలాగా - పెళ్ళయిందా. పిల్లలా?" అన్నాడు మోహనరావు.

అందుకు సమాధానంగా రమేష్ పెద్ద నవ్వు నవ్వేశాడు. —"ఆ ప్రశ్న నాకు చాలా అవమానంగురూ—పెళ్ళంటే నీబోటిగాళ్ళకిగానీ-నాలాంటివాళ్ళకెందుకూ? అందులోనూ ఈ ఇండియాలో—" అన్నాడు.

మోహనరావుకి అర్థంకాక మాట్లాడలేదు.

ఆ విషయం పసిగట్టిన రమేష్ "నా భాష నీ కర్థం కాలేదనుకుంటాను. మీలాంటివాళ్ళ దృష్టిలో నేను చెడ్డ వాణ్ణి. అఫ్‌కోర్స్-నా దృష్టిలో నేను రైటేననుకో— వయసూ, డబ్బూ వున్నప్పుడు అందినంతవరకూ ఆనందించడం మన ప్రిన్సిపుల్. ఆ ప్రిన్సిపుల్ తూ చా తప్పకుండా ఆచరిస్తున్నాను. పెళ్ళి చేసుకుందామంటే ఒకరూ, ఇద్దరూ సరిపోరు. శ్రీకృష్ణుడిలా రోజుకొకరు కొత్తవాళ్లు కావాలి" అంటూ ఓసారి మోహనరావుకి కన్ను కొట్టాడు.

ఇద్దరూ దార్లో వున్న హోటల్లో అడుగెట్టారు. బిల్లివ్వబోతుండగా మోహనరావు జేబులోంచి మంజుల ఫోటో జారి పడింది. ఆ ఫోటోను చూస్తూనే "వాట్-మంజుల ఫోటో నీ దగ్గర కెలా వచ్చిందీ?" అన్నాడు రమేష్ ఆశ్చర్యంగా.

మోహనరావు అదిరిపడ్డాడు. అక్కడింకేం మాట్లాడకుండా బిల్లు ఇచ్చేసి రోడ్డు మీదకు వచ్చేడు. అక్కడ రమేష్ అతని భుజం తట్టి-"ఏదో అనుకున్నాను. నీదీ పెద్ద చెయ్యేనన్నమాట" అన్నాడు.

"నీ మాటలు నా కర్థం కావడం లేదు. కానీ ఈ ఫోటోలో అమ్మాయి నీకెలా తెలుసు?" అనడిగాడు మోహనరావు. జవాబుగా రమేష్ ఏం చెబుతాడోనని అత నికి భయంగానే ఉంది.

రమేష్ నవ్వేసి—"మా కంపెనీలో ఉద్యోగానికి అప్లై చేసింది. పాత పరిచయముంది కాబట్టి నేను స్పెష ల్‌ఇంట్రస్టు తీసుకుని ఇంటర్వ్యూ వచ్చేలా చేశాను. రెండు మూడ్రోజుల్లో మంజుల ఇక్కడకు రావొచ్చు" అన్నాడు.

"పాతపరిచయమంటే?" సందేహంగా అడిగాడు మోహనరావు.

"ఏమీ తెలియకుండానే ఫోటో జేబులో కొచ్చిందా గురూ" అంటూ రమేష్ ఓసారి నవ్వి "వాళ్ళది మా ఊరేలే-దానికి ముగ్గురక్కలున్నారు. ఒక్కళ్ళదీ గుణం మంచిది కాదు అందుకే ఓ పట్టాన వాళ్ళకు పెళ్ళి సంబం ధాలు కుదర్లేదు. ఇంక మంజుల సంగతంటావా? నాకు బాగా డబ్బుంది కదా—రాత్రి పన్నెండు గంటలకు ఎవరికీ తెలియకుండా మా ఇంటికొచ్చి, నా దగ్గర్నుంచి చాలా డబ్బు సంపాదించిందది. అయితేయేంలే-అదిచ్చే ఆనందం ముందు నేనిచ్చిన డబ్బొక లెక్కలోది కాదు...." అని ఆగి "ఇంతకీ దాన్నె లాడ్జిలో కలుసుకున్నావ్? అప్పు డప్పుడు లాడ్జీల కూడా వెడుతూంటుందిలే అది" అన్నాడు.

కాలికింద భూమి అదిరినట్లయింది మోహనరావుకి.

అతనిలో ఆలోచనాశక్తి నశించింది. జ్ఞానేంద్రియాలు పనిచేయడం మానేశాయి. ఎలాగో తమాయించుకోడానికి ప్రయత్నించాడతను. ఆ సంభాషణ తన కిష్టం లేదన్నట్లుగా మాట మార్చేశాడతను.

కొంతదూరం వచ్చేక "వస్తా గురూ—కారు రిపెయిర్ కిచ్చాను. బహుశా ఈపాటికి బాగయుంటుంది" అని సెలవు తీసుకున్నాడు రమేష్.

ఇల్లు చేరుకున్నాక మోహనరావు పదేపదే ఆలోచించ సాగాడు. తన జీవిత సర్వస్వం అనుకున్న మంజుల ఒట్టి కులట అని తెలిసింది. డబ్బుకోసం శరీరాన్నమ్ముకునే నీచురాలనే గ్రహింపయింది. ఆ నీచురాలికోసం తనిన్నాళ్ళూ తపించిపోయాడు. అదృష్టవశాత్తూ ఈ రోజు రమేష్ కలిశాడు. రమేష్ తనను కలిసి ఉండకపోయి నట్లయితే....

అసలు రమేష్ చెప్పినవి నిజమేనా అన్న అనుమానం హఠాత్తుగా అతనికి కలిగింది. కాలేజీలో చదువుకునే రోజుల్లో ప్రతీ అమ్మాయినీ కులట అనేవాడు రమేష్. అతని తీరే అంత. స్త్రీలను భోగవస్తువులుగా చూడడ మొకటే అతనికి చేతనైనది.

అయితే మంజుల విషయంలో అతనుచెప్పిన దసత్యం కావడానికి వీల్లేదు. అతను ఆమె గురించి చాలా చనువైన పదాలుపయోగించాడు.

అంతలోనే అతనికి అనిపించింది. రమేష్ బుద్ధి మంచిది కాదు. ఒకే ఊరిలో ఉన్నందువల్ల ఆమె గురించి బాగా తెలిసి ఉండాలి. ఆమెకోసం ప్రయత్నించి భంగపడి ఉంటాడు. అందువల్ల కనిపించిన వాళ్ళతో ఇలా చెప్పు కుని మానసికంగా తృప్తిచెందుతున్నాడేమో—

ఈ ఆలోచన మోహనరావుకు కొంచెం సంతృప్తి నివ్వకపోలేదు. కానీ అదతనిలోని అసంతృప్తిని మాత్రం తొలగించలేకపోయింది.

ఏదేమయినా మంజులను కలుసుకుని మాట్లాడాలని నిర్ణయించుకున్నాడు మోహనరావు.

4

అనుకున్న రోజు రాత్రి పన్నెండున్నరకు మంజుల ట్రయిన్ దిగింది. ఆమెతోపాటు ఆమె బాబాయిట—తోడుగా వచ్చాడు. అంతా మోహనరావు రూమ్‌కి చేరుకున్నారు. మోహనరావు దారిలోనే మామూలుగా రమేష్ ప్రస్తావన తీసుకొచ్చాడు. రమేష్ పేరు వింటూనే మంజుల కళ్ళలో నిప్పులు కురిశాయి.

"వాడు మీకెలా తెలుసు మేష్టారూ!" అనడిగింది మంజుల.

"ఊళ్ళో ఆడపిల్లలకు వాణ్ణి చూస్తే చాలా భయం. ఒట్టి రౌడీ వెధవ—" అన్నాడు మంజుల బాబాయి.

ఆ మర్నాడు మధ్యాహ్నం—రమేష్‌కి ఫోన్ చేశాడు మోహనరావు—మంజుల తన బాబాయితో వచ్చిందనీ—ప్రస్తుతం తన ఇంట్లో ఉన్నదనీ!

రమేష్ జవాబులో ఆశ్చర్యం ధ్వనించింది. "బాబాయితో వచ్చిందా. దానికి బాబాయెవడున్నాడు? ఎవడో ప్రియుడయివుంటాడు—ఏమైనా చాలా కాలం తర్వాత వచ్చింది—ఓసారి కలుసుకోవాలనుంది. కారేసుకుని సాయంత్రానికి వస్తాను—" అన్నాడతను.

బాగా ఆలోచిస్తున్నాడు మోహనరావు. రమేష్, మంజులలో ఒకరు అబద్ధం చెబుతున్నారు. అదెవరో ఈ రోజే తేల్చేయాలి.

రమేష్‌కి ఫోన్‌చేసి తన గదికి వెళ్ళేసరికి గదిలో

మంజుల ఒక్కతే ఉంది. ఆమె బాబాయి సినిమాకి వెళ్ళి పోయాడు.

"సాయంత్రం రమేష్ ఇక్కడికి వస్తానన్నాడు—" అన్నాడు మోహనరావు.

మంజుల ఆశ్చర్యంగా—"ఎందుకు? —" అనడిగింది.

"అతను నీ గురించి చాలా అసభ్యంగా మాట్లాడాడు. నీతో వదల్లేదు. నీ అక్కల గురించీ, నీ కుటుంబం గురించీ కూడా చెడ్డగా చెప్పాడు. అంత పచ్చి అబద్ధాలకోరుని నేనెక్కడా చూడలేదు. అవన్నీ అబద్ధాలని అతనిచేత నువ్వు ఒప్పించాలి—"

"రానివ్వండి వెధవని కడిగేస్తాను...." అంది మంజుల.

సాయంత్రం రమేష్ వచ్చాడు కారులో. "మీ ఇంటికి వెళదాం పద—" అన్నాడు మోహనరావు. అతనికి తన గదిలో గొడవ జరగడం ఇష్టం లేదు.

మోహనరావు, రమేష్, మంజుల—కారులో బయల్దేరారు.

రమేష్ ఇల్లు ఊరికి చివరగా ఉంది. కంపెనీవారు అతని హోదాకని కట్టిన ప్రత్యేకమైన బంగళా అది. అటువంటి బంగళాలు అక్కడ మరికొన్ని ఉన్నాయిగానీ విసిరేసినట్లు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా వున్నాయి.

రమేష్ కారు దిగాడు. అతని వెనుకే మంజులా, మోహనరావూ దిగారు.

మాటల్లేకుండానే ముగ్గురూ బంగళాలో అడుగుపెట్టారు. "కాసేపు ఇక్కడ సోఫాలో కూర్చుందామా?" అన్నాడు రమేష్. అంతా కూర్చున్నారు. కాసేపు మౌనం రాజ్యమేలింది.

"నన్ను గురించి ఈయనదగ్గర ఏమిటి కూశావ్?" అంది నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.

రమేష్ ఇద్దరివంకా ప్రశ్నార్థకంగా చూసి "కూయడమేమిటి డార్లింగ్!" అన్నాడు.

అతనలా అనడం తడవుగా మంజుల తిట్టడం మొదలెట్టింది. నీకు చెల్లెళ్ళు లేరా అంది. ఆడదాన్ని గౌరవించడం చేతకాదా అంది. ఆఖరికి నీచుడు, దుర్మార్గుడు లాంటి పదాలు ప్రయోగించింది.

"హద్దు మీరుతున్నావు డార్లింగ్....!" అన్నాడు రమేష్.

"ఎవర్రా నీకు డార్లింగ్....?" అంటూ అరిచింది మంజుల.

మోహనరావు, రమేష్‌వంక చూసి "నిజమే చెబుతోందా ఈమె?" అన్నాడు.

రమేష్ అదోలా నవ్వి "ఎందుకడిగావీ ప్రశ్న?" అన్నాడు.

"నేనీమెను ప్రేమిస్తున్నాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను...." అన్నాడు మోహనరావు గంభీరంగా.

"నాయనా—ఇంతకుమించి కాండిడేట్లు దొరకలేదా నీకు...." అన్నాడు రమేష్.

"లేదు...." అన్నాడు మోహనరావు.

"నీకు చేతకాని పక్షంలో లక్షణమైన పిల్లని నేను వెదికి పెడతాను కానీ ఇలాంటి కక్కుర్తిపనులు చేయకు.

ఒకప్పుడు ఫరవాలేదుకానీ ఇప్పుడు దీనిది చాలా పెద్ద కంపెనీ వ్యవహారం. ఎదురిస్తానన్నా దీనితో పొందు కంగీకరించన్నేను...."

మంజుల రమేష్‌ని తిడుతూ "రండి—మేష్టారూ— మనమిక్కణ్ణించి పోదాం ...." అంది.

మోహనరావు లేచి నిలబడి "నేనిక్కణ్ణించి వెడుతున్నాను. జీవితంలో నేను మళ్ళీ నీ ముఖం చూడను. నీకు వశంకాని ఆడదానిమీద అభాండాలు వేసే అలవాటు చాలా ఏళ్ళుగా ఉంది నీకు. అయితే అలాంటి అభాండాలకు లొంగేవాడిని కాదు నేను. నేను మంజులను ప్రేమించాను. పెళ్ళి చేసుకుంటాను. నీ అబద్ధాల కారణంగా ఈ పెళ్ళి ఆగదు...." అన్నాడు.

మోహనరావు ఈ మాటలు అనడానికి మంజుల రమేష్‌ని తిట్టిన తిట్లూ, మోహనరావుని పొగిడిన పొగడిన పొగడ్తలూ కారణం. ఆ ఆవేశంలో అతనీ మాటలు అన్నాక—"నేనెవరికైనా అన్యాయం జరిగితే సహిస్తాను కానీ—స్నేహితుడి కన్యాయం జరిగితే సహించను. మంజులా నీ నిజస్వరూపం బయటపెట్టు—" అన్నాడు.

జవాబుగా మంజుల రమేష్‌ని మరిన్ని తిట్లు తిట్టింది. మోహనరావు ఆవేశం పరాకాష్ట నందుకోగా—అతను కలగజేసుకుని రమేష్‌ని చెడామడా తిట్టాడు.

రమేష్ అన్నింటినీ నవ్వుతూ విని—"నాతోరా నిజం చెబుతాను" అంటూ పక్కగదిలోకి తీసుకువెళ్ళి ఒక డైరీలాంటి పుస్తకాన్ని మోహనరావు చేతికిచ్చి "ఇది చదవ్వోయి నిజం తెలుస్తుంది" అన్నాడు.

మోహనరావా పుస్తకాన్నందుకుని పేజీలో తిరగేసే లోగా గదితలుపులు మూసుకుంది.

"నేను వేసిన అపనిందను నిజంచేస్తాను" అన్న మాట అతనికి అవతలి నుండి వినబడ్డాయి.

ఆ తర్వాత మంజుల ఆర్తనాదం...."నన్ను రక్షించరూ మేస్టారూ!" అంటూ కేకలూ, తర్వాత పెద్దపెట్టున ఏడుపు రక్షించమనీ, వదిలేయమనీ రమేష్‌కు వేడుకోలు-తిట్లు, శాపనార్థాలూ-ఆ తర్వాత కొద్దిక్షణాల మౌనం....అనంతరం సన్నని ఏడుపు....ఆ తర్వాత తలుపులు తెరుచుకున్నాయి.

మోహనరావు జీవచ్ఛవమయిపోయాడు. జరగబోయే ఒక అన్యాయానికీ అతనికీ ఒకే ఒక తలుపు అడ్డం. పద్మ వ్యూహంనాడు పాండవులకు సైంధవుడిలా ఆ తలుపు అతనికి అడ్డంనిలిచి—అంతా అయిపోయేక తెరుచుకుంది.

ఆవేశం చల్లారేక-స్నేహితుడికి తన ముఖం చూపించడం ఇష్టంలేక కాబోలు-రమేష్ మరోగదిలోకి చరచరా వెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

మానం కోల్పోయిన మంజుల ఏడుస్తోంది. మోహనరావులో ఇప్పుడు ఎవర్నీ ఎదిరించే శక్తిలేదు. హఠాత్తుగా అతను చచ్చుబడిపోయాడు.

"పద పోదాం, మంజులా!" అన్నాడతను.

అప్పటికింకా టైము ఏడవుతుందేమో-అంతే! ఇద్దరూ మాట్లాడకుండా బయటకు వచ్చారు.

మంజుల బట్టలు చాలాచోట్ల చిరిగిపోయాయి. చూడ డానికో బిచ్చగత్తెలా ఉన్నదామె యిప్పుడు.

సుమారు మైలుదూరం నడిచేక వాళ్ళకో రిక్షా కన బడింది. బేరమాడకుండా రిక్షా ఎక్కాడు మోహనరావు మంజులతో సహా.

పక్కనే కూర్చున్న మంజుల అతనికే విధమైన అను భూతినీ యివ్వలేదు. మంజుల అతని మధురమంజుల

కాదు. ఒక పతిత—

రిక్షా ప్రతాప్ ఇల్లు చేరింది. అదృష్టవశాత్తూ ప్రతాప్ ఇంట్లోనే ఉన్నాడు. త్వరత్వరగా మంజులనింట్లో ప్రవేశ పెట్టి రిక్షాఅతనికి అడిగిన డబ్బులిచ్చి-తనూ ఇంట్లో చొర బడ్డాడు మోహనరావు.

ఈ రాత్రికిక్కడే వుంటానని అతననగా అభ్యంతరం లేదని ప్రతాప్ చెప్పాడు.

ప్రతాప్ మౌనంగా ఉన్నాడు. గంభీరంగా ఉన్నాడు. అతని ముఖంలో ఏమీ కుతూహలం లేదు. మోహనరావు ఎందుకు వచ్చాడు? కూడా మంజుల దయనీయ స్థితిలో వచ్చిందేం?—అన్న ప్రశ్నలు అతను వేయలేదు. అయితే తన గదిలోకిపోయి పడుకోబోయేముందు—వాళ్ళిద్దరకూ పడక సదుపాయాలు చూపించడం మాత్రం మరిచిపోలే దతను.

ఆ రాత్రి తెల్లవార్లూ మోహనరావుకు సరిగ్గా నిద్ర పట్ట లేదనే చెప్పాలి. మేష్టారూ, రక్షించరూ? అన్న ఆర్తనాదం అతని చెవుల్లో గింగురుమంటోంది. అక్కడ తనుండి ఏం చేయగలిగాడు?

ఇప్పుడు మంజులను తను వివాహం చేసుకోగలడా? మంజులకు జరిగిన అన్యాయాన్ని అక్కడుండి తనే ఆప లేకపోయినప్పుడు—అందులో ఆమె తప్పేముంది?

5

ఎప్పుడో తెల్లవారుఝామున మోహనరావుకు నిద్రపట్టి నట్లుంది. లేచేసరికి ఎనిమిది దాటింది.

అప్పటికి ప్రతాప్ ఇంకా లేవలేదుకానీ మంజుల పక్క ఖాళీగా ఉంది.

ఆమె మంచంమీద ఓ చీటీ వుంది.

"మేష్టారూ—బాధ్యు లెవరైనా నా జీవితం అన్యాయమైపోయింది. నా కింకా చావాలని లేదు కాబట్టి బ్రతికే ఉంటాను. ఎటొచ్చీ ఈ జన్మకు మీ భార్యనయే అదృష్టానికి మాత్రం నోచుకోలేదు. నా కోసం వెతకొద్దు. —అభాగ్యురాలు మంజుల."

చీటీలోని ఈ వాక్యాలు చదువుకుని "మంజులా!" అంటూ ఏడ్చాడు మోహనరావు. ఏడ్పు మొదలు కాగానే ఇంకా ఎక్కువైంది. వెక్కివెక్కి ఏడుస్తున్నాడతడు.

అప్పుడతని భుజంమీద ఓ చేయి పడింది. అది ప్రతాప్‌ది. "ఏం జరిగింది మోహన్!" అనడిగాడతను.

గద్గద స్వరంతో జరిగింది టూకీగా చెప్పాడు మోహన రావు.

ప్రతాప్ అదోలా నవ్వి—"మీకు మనోబలం ఎక్కువ. మీది దుర్బల మనస్తత్వం కాదు. ఎటువంటి విషయాలూ మిమ్మల్ని కదిలించవు. అయినా ఏడుస్తున్నారు మీరు. నాకు నచ్చలేదు—" అన్నాడు.

మోహనరావుకు దుఃఖంలో కూడా కోపం వచ్చింది—"వేళాకోళానికైనా సమయా సమయాలుంటాయి...." అన్నాడు.

"సమయా సమయాల్చూపి వేళాకోళమాడడానికి నా కంత మనోనిబ్బరంలేదు. అందుకే ఎన్నడూ నేను మనో నిబ్బరం గురించి పందెం కాయలేదు—" అన్నాడు ప్రతాప్.

మోహనరావు ముఖం ఎర్రబడింది. "అవును. పందెం కాశాను. మీకంటే ఎక్కువ మనోనిబ్బరముందని.

ఆ విషయమే ఇప్పుడు ఋజువు కాలేదుగా...." అన్నా డతను కాస్త తీవ్రంగా.

ప్రతాప్ కళ్ళు చెమర్చగా అన్నాడు—"మీరు మంజుల కోసం అనవసరంగా కలవరపడుతున్నారు. ఆమె కొత్తగా మానాన్ని కోల్పోయినదేమీలేదు. ఆమె ఎన్నడూ శీలవతి కాదు...."

మోహనరావు తెల్లబోయాడు. అంతలోనే అతనికి కోపం వచ్చింది. "ఏమిటి మీరనేది?" అన్నాడు.

"నిన్న నేను మీ గదికి వచ్చాను. నీవు ఎక్కిన రిక్షా అప్పుడే వెళ్ళిపోతూండడమూ-మీ గదిలోకి ఒక పురుషుడూ, స్త్రీ వెళ్ళి తలుపులు వేసుకోవడమూ చూశాను. వాళ్ళెవరో తెలుసుకుందామనిపించి గదిదాకా వెళ్ళాను. తలుపు తట్టేలోగా లోపల్నించి మాటలు వినబడ్డాయి.

వాటినిబట్టి, లోపల వున్న స్త్రీ మంజుల అనీ_ఆ పురుషుడామె ప్రియుడనీ అర్థమైంది. అతనామెను శ్చంగా రానికి తొందర పెడుతున్నాడు. మోహనరావు వెనక్కి వచ్చే అవకాశమున్నదనీ, తొందరపడవద్దనీ ఆమె అతన్ని వారిస్తోంది."

మోహనరావు తలను మోకాళ్ళమధ్యకు దూర్చేసుకుని "ప్రతాప్‌గారూ! నా జీవితం అన్యాయమైపోయింది ..." అన్నాడు.

ప్రతాప్ అతన్ని ఓదార్చి, "రండి మీ గదిలో దిగ విడుస్తాను" అన్నాడు.

చంటిపిల్లాడిలా అతన్ననుసరించాడు మోహనరావు.

ఇద్దరూ మోహనరావు గదికి వెళ్ళిన అయిదు నిమిషాలకు కార్లో రమేష్ వచ్చాడు. వస్తూనే మోహనరావుని చూసి "నన్ను క్షమించాలి గురూ!" అన్నాడు రమేష్,

పవిత్ర ప్రేమకూ మంజులకూ నువ్వు ముడిపెట్టేసరికి ఏం చేయాలో తోచక, నిన్నెలా రక్షించాలో తెలియక ఓ చిన్న సైజు త్యాగం చేశాను. ఫలితంగా వీడీవార్డుకెళ్ళి ఇంజక్షన్ చేయించుకు వస్తున్నాను. మంజుల కులట మాత్రమే కాదు. ఆరోగ్యరీత్యా ప్రమాదకరమైనది కూడా. ఇంకా నీ పవిత్ర ప్రేమ మిగిలి ఉంటే దాన్ని ఏ హాస్పిటల్లోనైనా జాయిన్ చేయించి ఆ తర్వాత........"

"థాంక్స్" అన్నాడు ముభావంగా మోహనరావు.

"మోహనరావ్! మీరు నాకిప్పుడు వంద రూపాయలు బాకీ" అన్నాడు ప్రతాప్.

ఆశ్చర్యంగా చూపిన రమేష్‌కి అతను పందెం గురించి వివరించాడు.

"సమయా సమయాలు తెలియవు నీకు" అంటూ మరో సారి విసుక్కున్నాడు మోహనరావు.

"పందేలకు సమయా సమయాలంటూ వేరే వుండవు. ఎప్పుడు నెగ్గితే అప్పుడే సమయం...." అన్నాడు ప్రతాప్ అదోలా.

"ఎలా నెగ్గారో రుజువు చేయండి."

"అటుమొన్న నీవు నా గదికి వచ్చి వెళ్ళాక నాకు టెలిగ్రాం వచ్చింది-నా శ్రీమతి పోయిందని. రాత్రికి రాత్రి బయల్దేరి వెళ్ళాను. మొన్న నా చేతుల్తో స్వయంగా ఆమె చితికి నిప్పంటించి వెంటనే తిరుగు ప్రయాణం కట్టాను. నిన్న ఈ సంగతే చెబుదామని మీ గదికివచ్చాను. నా దుఃఖాన్ని మీతో పంచుకుందామనుకున్నాను కానీ సాధ్య పడలేదు...." ప్రతాప్ మాటలు రాక ఆగిపోయాడు.

తెల్లబోయాడు మోహనరావు "అక్కయ్యగారూ...." అన్నాడు.

"ఇక లేదు. నన్ను పందెం నెగ్గించడం కోసమని వెళ్ళిపోయింది. జీవితంలో ఎందరి కష్టాలకో చలించి పోయి కన్నీళ్ళు పెట్టుకునేవాడ్ని. ఇప్పుడు నాకింత కష్టం కలిగితే-కన్నీళ్ళు కూడా మిగలలేదు...."

మోహనరావు అప్రయత్నంగా జేబులోంచి వంద రూపాయలు తీసి "కాబోయే భార్య కులట అని తెలియడం నా అదృష్టం. దాన్నో కష్టంగా భావించి విలవిల్లాడి పోయాను. కట్టుకున్న అనుకూలవతియైన భార్యను పోగొట్టుకున్న మీరు నా దుఃఖాన్ని అణచడానికి ప్రయత్నించారు. మీరే నెగ్గారు ప్రతాప్!" అన్నాడు.

"ఈ వందరూపాయలూ వద్దంటే నా కమల నాకు తిరిగి వస్తుందా...." అన్నాడు ప్రతాప్ డబ్బు అందుకుంటూ. ఆ తర్వాత అతనక్కడ క్షణం నిలవలేదు.

మర్నాటికిగానీ అర్థం కాలేదు మోహనరావుకి ప్రతాప్ పందెం విషయం గుర్తు చేయడంలో స్వార్థం లేదు. తను విలపిస్తున్నదెంత చిన్న కారణానికో తెలిసిరావడంకోసమే అతనది గుర్తు చేశాడు.

మోహనరావు జీవితంలో మరచిపోలేని పందెమది. □

"అడగాలని వుంది....!!"

"అడగాలని వుంది, నిన్నడగాలని ఉంది..." అంటూ ఒకఅమ్మాయి వెంటబడ్డాడు, ఒక రోడ్ సైడ్ రోమియో.

అంత ఆ అమ్మాయి "ఆ అడిగేదేదో అడిగేస్తే అందుకు బహుమానం ఒకటుంది..." అంది చెప్పు చూపిస్తూ.

అంతే, ఆ రోడ్ సైడ్ రోమియో ఆ మధ్యలో మళ్ళీ కనిపించలేదు.

—టి. వి. సుబ్బారావు, గుంటూరు

ప్రతీకారం

నాగేష్

సూట్‌కేస్ పట్టుకొని స్టేషన్‌లోనికి వచ్చి చుట్టూ ఒకసారి చూచాడు లక్ష్మీనరసింహం.

స్టేషన్ అంతా హౌస్‌ఫుల్ థియేటర్‌లా ప్రయాణీకులతో నిండివుంది. కొంతమంది అటూ, ఇటూ తిరుగుతుంటే, కొంతమంది బెడ్డింగులమీద, బెంచీలమీద కూర్చొనివున్నారు.

"హల్లో! లక్ష్మీనరసింహం" అని వినిపించింది వెనుకనుంచి.

లక్ష్మీనరసింహం ఒకసారి వెనుకకు తిరిగిచూచి, "హల్లో సారథి! ఆ పేరుపెట్టి పిలవవద్దని ఎన్నిసార్లు చెప్పానురా నీకు? పేరు లక్ష్మీనరసింహం అయినా, లక్ష్మి నాకు ఎంత దూరంలో వుందో నీకు తెలుసుగా, ఆ లక్ష్మిని నా చెంతకు తీసుకురావటానికి ఏపనిచేయాలన్నా నాలో

నరసింహం వానరం అయిపోతుందిరా...." అన్నాడు నరసింహం.

"సారీరా బ్రదర్! నీవిలా ప్రతీసారి బాధపడటం బావుండలేదు. ఏదో ఒకనాడు నీకు వుద్యోగం రాకపోదుగా. నీకంత బాధగావుంటే నిన్నిలా పిలవనులే" అన్నాడు సారథి.

"అవును! నీవు ఆఫీసువదిలి ఇలా వూరులవెంట పడ్డావేమిటి?" అన్నాడు నరసింహం.

"ఏముంది! ఆఫీసు పనిమీదనే వచ్చాను. మరి నీవెందుకు వచ్చావు. ఇంటర్వ్యూకా?"

"ఇంటర్వ్యూకేరా! కాని ఏంలాభం. నాలుగు ప్రశ్నలు అడిగి నీవు ఈ జాబ్‌కి పనికిరావన్నారు. డిగ్రీలు వున్నా లాభం లేకపోతోంది. ఎన్నో ఆశలతో ఇంటర్వ్యూలకు హాజరయితే చివరకు నిరాశ మిగులుతుంది" అన్నాడు నరసింహం.

ట్రైన్ నెమ్మదిగా వచ్చి ప్లాట్‌ఫారం మీద ఆగింది. ఎక్కేవారు ఎక్కితే, దిగేవారు దిగుతున్నారు.

"రా! లోపలకు వెళ్ళి మాట్లాడుకుందాం" అంటూ సారథి సూట్‌కేస్‌తో కంపార్టుమెంటులోకి ఎక్కాడు. సారథి వెనుకనే నరసింహం ఎక్కాడు.

"ఇదేమిటిరా! గవర్నమెంటు ఆఫీసులో మేనేజర్‌గా వుంటూ, థర్డ్‌క్లాస్‌లో ఎక్కావు?" అన్నాడు నరసింహం ఆశ్చర్యంగా.

"ఫస్టక్లాస్ రిజర్వేషన్ అయిపోయాయిరా. వెంటనే నేను రేపు ఆఫీసుకు అటెండ్ అవ్వాలి. తప్పదుగా!" అన్నాడు సారథి.

సారథి సిగరెట్ వెలిగించి నరసింహానికి ఒకటి ఆఫర్

చేసి, "ఏ ఆఫీసులో ఇంటర్వ్యూ. ఏమడిగారు?" అన్నాడు కుతూహలంగా.

"మిషన్ గన్ కిరా"

"ఏమిటిరా! నేను అడిగేదేమిటి? నీవు చెప్పేదేమిటి?" అన్నాడు సారథి.

"మిషన్ గన్ అనేది ఒక డిటెక్టివ్ మాసపత్రిక పేరు. దానిలో హత్యలకు, దోపిడీలకు సంబంధించిన కథలు ప్రచురిస్తారట" అన్నాడు నరసింహం సిగరెట్ దమ్ము లాగుతూ.

సిగరెట్ పొగతోబాటు బ్రైన్ కూడ బయలుదేరింది.

"బావుంది! నిన్ను ఎందుకు సెలక్టు చేసుకోలేదు. నీ క్వాలిఫికేషన్స్ బావున్నాయిగా. నీవు ఆ ఆఫీసులో ఏ జాబ్ కి పెట్టావు?"

"టైపిస్టు పోస్టుకి అప్లయిచేసాను. వాళ్ళకు టైపిస్టులు డిగ్రీవాళ్లే అక్కరలేదుట. జనరల్ నాలెడ్జి వుండి టెన్త్ పాస్ అయితే చాలట. నాకు అసలు జనరల్ నాలెడ్జి లేదట" అన్నాడు నరసింహం సిగరెట్ ని క్రిందపడవేసి కసిగా దానిని స్లిప్పర్ తో నలుపుతూ.

"నీకు జనరల్ నాలెడ్జి లేకపోవటమేమిటి? తెల్లవారింది మొదలు లైబ్రరీల వెంట తిరుగుతావు. ఇంతకూ నిన్ను ఇంటర్వ్యూలో ఏమని అడిగారు?"

"అదేరా నేను చేసిన పొరపాటు. వాళ్ళకు జనరల్ నాలెడ్జి అక్కరలేదట. డిటెక్టివ్ సాహిత్య నాలెడ్జి కావాలట, టైపిస్టుకయినా సరే.

వాళ్ళు అడిగినవేమిటో తెలుసా? హత్యాప్రదేశంలో హంతకుని వేలిముద్రలు లేవు. ఎందుచేత....హఠాత్తుగా నిన్నిక్కడే చంపిస్తే మా గురించి చనిపోయేముందు

పోలీసులకు క్లూ అందించాలంటే ఏం చేస్తావు ...కుక్కలు నిన్ను పసిగట్టకుండా తప్పించుకోవాలంటే ఏమి చేస్తావు?

ఇవిరా నన్ను అడిగిన ప్రశ్నలు. అన్నిటికీ కళ్ళు తేల వేసాను. వాళ్ళ ఉద్దేశ్యం నన్ను ఒక హంతకుడిగా జమ

కట్టినట్లున్నారు. డామిట్? వెధవ ఇంటర్వ్యూ. ఇదీను. నన్ను చంపేస్తే దస్తూ క్లూ వదలాలట.

అలా నన్ను చంపేస్తే ఈ నిరుద్యోగ బాధనుంచి

తప్పించినందుకు ఆ హంతకుడికి చేతులెత్తి నమస్కరిస్తానని తెలియదు. వాళ్ళకు కావలసింది టైపిస్టులు కాదురా, పాపిస్టులు" అన్నాడు నరసింహం కోపంగా.

సారథి మౌనంగా నరసింహం ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు. ఏమయినా అంటే ఇంకా మనస్సు పాడు చేసుకుంటాడనే ఉద్దేశ్యంతో.

ట్రైన్ ఏదో స్టేషన్‌లో ఆగింది.

సారథి రెండు కాఫీలు తీసుకొని నరసింహానికి ఒకటి ఇచ్చి, ఇంకొకటి తాను సిప్ చేయసాగాడు.

"పంజాబ్ స్టేట్ లాటరీ టికెట్స్ సార్! మీ అదృష్టాన్ని పరీక్షించుకోండి. రెండు రూపాయలతో ఫస్ట్ప్రైజు అయిదులక్షల రూపాయలు గెలవండి" అంటూ ఒక లాటరీ టికట్లవాడు అరుస్తున్నాడు.

"ఏరా సారథీ! ఒక టికెట్ కొందామా?" అన్నాడు నరసింహం కుతూహలంగా.

"ఛ....ఛ అవంటేనే నాకు అసహ్యం? అంతా దగా. అయినా అంత మందిలో నీకే తగులుతుందని గ్యారంటీ ఏమిటిరా?" అన్నాడు సారథి.

"అది కాదురా! నాకు కొనాలనివుంది. ఉద్యోగం రాక పోయినా ఇది తగిలినా హాయిగా బ్రతకవచ్చు. నిరుద్యోగి మనస్సు కళ్ళెం విడిచిన గుర్రం వంటిదిరా. అది ఎప్పుడూ డబ్బు సంపాదించటంకోసమే చూస్తుంది. టికెట్ ఖరీదు రెండు రూపాయలేగా నీవొక రూపాయి, నేనొక రూపాయి వేసుకొని కొందాము. వస్తే ఫిఫ్టీ, ఫిఫ్టీ...." అన్నాడు నరసింహం తానొక్కడు రెండు రూపాయల టికెట్ కొనలేక.

"సరేరా నీ ఇష్టం! నీవు కొంటానన్నప్పుడు నేను నిరాశ

పరచడం ఎందుకు?" అంటూ సారథి రూపాయి నోటు తీసి నరసింహానికి ఇచ్చాడు.

నరసింహం ఇంకొక రూపాయి తన జేబులోనించి తీసి రెండు రూపాయలు అతనికి ఇచ్చి. ఒక టికెట్ తీసుకున్నాడు.

టికట్ నంబర్ చూచి దానిని సారథికి ఇచ్చాడు.

"నీ దగ్గరే ఉంచరా. నా దగ్గర ఎందుకు?" అన్నాడు సారథి.

"నీ దగ్గరే ఉంచరా. నీది అదృష్ట జాతకం! నీపేరులోనైనా లాటరీ తగలచ్చు. అదీగాక నా దగ్గర అన్నీ కాగితాలే తప్పించి ఇంకొకటి కనిపించవు. కాగితాలతోపాటు కలిసి ఎక్కడయినా పడిపోవచ్చు" అని టిక్కెట్‌ను సారథికి ఇచ్చాడు నరసింహం.

ట్రైన్ గాలితో పందెం వేసినట్లుగా వచ్చి స్టేషన్‌లో ఆగింది.

సారథి, నరసింహం చెరొక దారిని విడిపోయారు.

నరసింహం ఇంటికి వెళ్ళిన వెంటనే నోట్‌బుక్కులో జాగ్రత్తగా లాటరీ నంబరును నోట్ చేశాడు.

2

సూర్యుడు ప్రతిరోజూ డ్యూటీకి ఎటెండు అవుతున్నాడు. షిఫ్టు మారిపోగానే చంద్రుడు డ్యూటీలో జాయిన్ అవుతున్నాడు వరుసగా.

ఒకరోజు నరసింహం లైబ్రరీలో పేపరు చూస్తుంటే పంజాబ్‌స్టేట్ లాటరీ ఫలితాలు కనిపించాయి.

తాను కొన్న టికట్ నెంబరు గుర్తు చేసుకొని, ఆ నంబరు కోసం వెదికాడు.

ఒక్క క్షణం నరసింహం ఊపిరి పీల్చటం మర్చి పోయాడు. ఒకటికి పదిసార్లు ఆ నంబరును చూచాడు.

అదే నంబరు. తాము కొన్న టికట్ నంబరు ఫస్ట్ ప్రైజు అయిదు లక్షలు వచ్చింది.

పేపరును టేబుల్ మీద పడేసి పరుగులాటి నడకతో ఇంటికి చేరుకొని పుస్తకములన్నీ తిరగేసి తాను నోట్ చేసిన పుస్తకం తీసి చూచాడు, అనుమానం తీరక.

అదే నంబరు!

బయట పేపరు ఒకటి కొని, సారథి ఆఫీసుకు చేరుకొని ప్యూను అడ్డగిస్తున్నా ఆగకుండా మేనేజర్ రూమ్ లోకి వెళ్ళాడు ఆనందంగా.

సారథి సీరియస్‌గా దేని గురించో ఆలోచిస్తున్నాడు. సారధి ముందు పంజాబ్‌స్టేట్ లాటరీ ఫలితాలు పడిన పేపరు మడతపెట్టి వుంది. సారథి తదేకంగా దానినే చూస్తున్నాడు.

"సారథీ!" అన్నాడు నరసింహం ఆనందంగా.

"ఆఁ!" అంటూ సారధి తలఎత్తి నరసింహాన్ని చూచాడు.

నరసింహం ముఖంలో ఆనందం నాట్యం చేస్తుంది.

"ఏరా! ఇలా వచ్చావు? ఆఫీసుకు ఎప్పుడూ రాని వాడివి" అన్నాడు నరసింహం చేతిలో పేపరు చూస్తూ.

"ఇంకా ఏరా అంటూ వేమిటిరా! మనం కొన్న టికెట్‌కు ఫస్ట్‌ప్రైజు వచ్చింది" అన్నాడు నరసింహం.

"జోక్ చేస్తున్నావేమిటిరా! ఇదిగో నేను కూడ చూచాను. మన టికెట్ నంబరు కంచుకాగడా వేసి వెది కినా యెక్కడా కనిపించటంలేదు" అన్నాడు సారధి.

"వాట్!" అన్నాడు నరసింహం ఒక్కసారిగా.

"ఔనురా! మనకు తగిలిందని యెలా అనుకుంటు న్నావు?"

"నంబరు నేను నోట్ చేసాను యింటికి వెళ్ళిన తరువాత."

"లేదురా! తప్పు నంబరు నోట్‌చేసి వుంటావు." అన్నాడు సారధి.

"నో....నో. కరక్టు నంబరే! నేనొకసారి దాని నంబరు చూడాలి. టికట్ ఏది?" అన్నాడు నరసింహం కోపంగా. అప్పటివరకు నరసింహం ముఖంలో ఉన్న నరుడు అంతర్ధానమై సింహం ప్రత్యక్షమయింది.

సారధి గొంతులో వెలక్కాయ అడ్డుపడింది.

"అయితే నన్ను నమ్మటం లేదన్నమాట నీవు? సరే, సాయంత్రం అయిదుగంటలకు ఇంటికిరా. నీకు టికట్ చూపిస్తాను." అన్నాడు సారధి కోపంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తూ.

"సరే! అయిదు గంటలకే వస్తాను. టికెట్ వుంచు" అంటూ నరసింహం విసురుగా బయటకు వచ్చి పిచ్చిపట్టినట్లుగా అయిదుగంటలవరకు ఊరంతా తిరిగాడు.

సరిగ్గా అయిదు గంటలకు సారధి దగ్గరకు బయలుదేరాడు.

నరసింహం లోపలకు వచ్చినవెంటనే "ఇదిగోరా మనం కొన్న టిక్కట్. నంబరు జాగ్రత్తగా చూచుకో," అంటూ టికట్‌ను అందించాడు.

నరసింహం టికట్‌ను చేతిలోకి తీసుకొని నంబరు చూశాడు. ఆ నంబరు కాదు. దానికి, దీనికి కొన్నివేల నంబర్ల తేడా వుంది.

సారథిచేసిన మోసం అర్థమయింది.

టికెట్‌ను కోపంగా సారథి మీదకు విసిరి బయటకు వచ్చాడు.

సారథిని గొంతు నులిమి చంపాలన్నంత కసిగావుంది. కాని పోలీసులు, వురికంబం. ఆ వీక్‌నెస్‌యే నన్ను ఈ స్థితికి తీసుకువచ్చాయి, అనుకున్నాడు నరసింహం.

3

నరసింహానికి పిచ్చెత్తినట్లు వుంది.

తానెక్కడా పొరపాటు పడలేదు. ఆ నంబరు బాగా గుర్తు తనకు. అంతా సారథిలోనే వుంది మోసం. ఎప్పటి కయినా సారథిమీద పగ సాధించాలి?

కాని ఎలా! తాను ఉద్యోగం లేక తిరుగుతున్న నిరుద్యోగి. సారథి అధికారం, హోదాలో వున్నాడు. అటువంటి వాడు ఏమిచేసినా చెల్లుతుంది.

ఎలాగయినా సారథిమీద పగ తీర్చుకోవాలి. ఎలా— ఎలా అన్న ఆలోచనలతో నాలుగురోజులు గడిపి చివరికొక నిర్ణయానికివచ్చాడు నరసింహం.

సారథి ఆఫీసుకు వెళ్ళాడు.

సారథి, అయిదులక్షలు ఫస్ట్‌ప్రైజు కొట్టిన వాడిలా హుంషారుగా లేడు. దిగులుగా దేనిగురించో బాధపడు తున్నట్లుగా వున్నాడు. చాలా డల్‌గా కనిపిస్తున్నాడు.

సారథి జాలిగా ఒకసారి నరసింహాన్ని చూచి, అంత లోనే "రా....రా కూర్చో" అన్నాడు ఎదురుగావున్న ఛైర్ చూపిస్తూ.

"థాంక్స్" అంటూ ఛైర్‌లో కూర్చున్నాడు నరసింహం.

ఫ్యాన్‌ను పిలిచి రెండు డ్రింక్స్ తెప్పించి నరసింహా నికి ఒకటి ఆఫర్ చేసి. తానొకటి తీసుకున్నాడు.

ఇంకొక సమయంలో అయితే అయిదు సంవత్స రాలుగా మనలో పెరుగుచున్న స్నేహానికి. నీ మర్యాదకు సంతోషించేవాడినేమో. కాని .. ఇప్పుడు నాలో ప్రతీ కారం. ద్వేషం ప్రజ్వరిల్లుతుంది. అనుకున్నాడు నరసింహం మనస్సులో.

సారథి చిరునవ్వు చూస్తుంటే అగ్నిలో ఆజ్యం పోసి నట్లుగా వుంది నరసింహానికి.

అయిదు లక్షలు దొరికేసరికి ఇన్నాళ్ళ స్నేహాన్ని భద్రంగా సూర్యమండలానికి పంపించాడు వెధవ? అను కున్నాడు కసిగా నరసింహం.

"పనుంటేగాని ఆఫీసుకు రావు. నిన్ను ఈ నాలుగు రోజులలోను కలుసుకోవటాని కుదరలేదు. ఆఫీసువర్కు పెండింగులో వుంది" అన్నాడు సారథి.

"ఏమీలేదురా! వుద్యోగంకోసం కాళ్ళు లాగేలా తిరుగు చున్నాను. నిన్నటి పేపరులో మీ హెడ్ ఆఫీసు జాబ్స్ పడ్డాయి. వాటికి అప్లై చేయాలనుకుంటున్నాను. నీవు ఏమయినా రికమెండేషన్ చేస్తావేమోనని." అన్నాడు నర సింహం.

"ష్యూర్! ఇన్నాళ్ళు రికమెండ్ చేస్తాను ఎవరికయినా అంటే విన్నావు కాదు, ఇప్పటికయినా దారిలోకి వచ్చావు. ఈ వేళ సాయంత్రం నిన్ను మీట్ అయి ఆ జాబ్‌కి అప్లయిచేయమని చెబుదామనుకొంటున్నాను" అన్నాడు సారథి ఉత్సాహంగా. సారథి కళ్ళలో ఒక నూతన వెలుగు కనిపిస్తుంది. అయిదు లక్షలు తీసుకున్నా ఒక జాబ్ ఇప్పి స్తున్నానన్న తృప్తిఏమో అది.

"సరేరా! నేను వస్తాను. తరువాత కలుసుకోవచ్చు" అన్నాడు కుర్చీలోనుండి లేస్తూ నరసింహం.

"ఓ కే! కాని అప్లికేషన్ పెట్టటం మాత్రం మర్చిపోకు." అన్నాడు వెనుకనుంచి సారథి. నరసింహం వస్తూంటే.

నరసింహం జవాబు యివ్వకుండా బయటకు వచ్చేశాడు.

4

ఆ మరునాడు సర్టిఫికేట్స్ పట్టుకొని బయలుదేరాడు నరసింహం ట్రూకాపీలు తీయించటానికి.

దారిలో నాలుగు వైట్ పేపర్సు కొని యోగానంద్ టైపు ఇనిస్టిట్యూట్‌కి బయలుదేరాడు. అందులోనే నరసింహం టైపు నేర్చుకోవటంవలన ట్రూకాపీలు ఫ్రీగా కొట్టుకుంటాడు.

టైపు ఇనిస్టిట్యూట్‌లో అడుగుపెట్టగానే—

"ఏదయినా జాబ్‌కు తిరిగి అప్లై చేస్తున్నావా?" అన్నారు టైపు ఇనిస్టిట్యూట్ మానేజరు వీరేశ్వరరావుగారు.

"ఉద్యోగం వచ్చేవరకు తప్పవు సార్. ఈ పాట్లు" అంటూ కార్బన్‌బాక్స్‌లోని కార్బన్ పేపరు తీసుకొని సర్టిఫికేట్స్ టైపు చేసుకొని, వీరేశలింగంగారికి థాంక్స్ చెప్పి, అవి పట్టుకొని సారథి ఆఫీసుకు బయలుదేరాడు నరసింహం.

నరసింహం వెళ్ళేటప్పటికి సారథి ఏదో ఫైల్స్ చూస్తున్నాడు.

"ఏరా? అప్లికేషన్ పెట్టావా?" అన్నాడు సారథి. నరసింహాన్ని చూడగానే

"ఇంకా పెట్టలేదురా. ఇదిగో ట్రూకాపీలుమీద నీచేత సంతకాలు పెట్టించటానికి వచ్చాను" అని ట్రూకాపీలు, ఒరిజినల్స్ వాడిముందు పెట్టాడు నరసింహం.

"మంచిపని చేసావు. ఇన్నాళ్ళకు నా సంతకాలు నీకు అవుసరమయినవన్నమాట. అయినా నన్ను దగ్గర పెట్టు వూరంతా తిరగటం దేనికి?" అంటూ నరసింహం టైపు చేసిన కాగితాలు, ఒరిజినల్సు వెరిఫై చేసాడు.

సారథి ట్రూకాపీలమీద సంతకాలు చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా ప్రతి అక్షరము కంపైర్ చేస్తాడని వినికిడి.

సారథి వాటిని వెరిఫై చేస్తుంటే, నరసింహం గుండెలు దడదడలాడాయి.

కార్బన్స్ పెట్టితీసిన కాపీలు పేపరు కట్ చేయకుండానే తీసాడు నరసింహం. సారథి వాటిమీద సంతకాలు పెట్టి పేపర్సు కట్ చేసి నరసింహానికి ఇచ్చాడు.

"థాంక్సురా!" అన్నాడు నరసింహం వాటిని తీసు కుంటూ.

"ఈ మాత్రందానికే ఏమిటిరా!అయినా మనలో మనకు ఇటువంటివి ఏమిటి?" అన్నాడు సారథి.

వాటిని తీసుకొని పోస్టాఫీసుకు వెళ్ళి, టైపుచేసిన అప్లి కేషన్ ఫారంమీద సంతకంపెట్టి, వాటికి ట్రూకాపీలు ఎంక్లోజ్‌చేసి పోస్టుచేసి, ఇంటర్వ్యూకోసం ఎడారిలో నీటి కోసం అలమటించే బిడారులలా ఎదురు చూడసాగాడు నరసింహం.

పదిహేను రోజులలో ఇంటర్వ్యూ కార్డు అందింది నరసింహానికి. ఇంటర్వ్యూ కార్డు తీసుకొని సారథిని కలుసుకున్నాడు

ఇంటర్వ్యూ వచ్చినందుకు సారథి సంతోషించాడు,

ఆఫీసు లెటర్‌పాడ్ మీద రికమెండేషన్ లెటర్ వ్రాసి. దాని క్రింద సంతకముచేసి, ఆఫీసు స్టాంపు వేసాడు. రికమెండేషన్ లెటర్‌తోపాటు వంద రూపాయలు కూడ ఖర్చుకు యిచ్చాడు సారథి నరసింహానికి.

వందరూపాయలను వద్దు అనకుండా తీసుకున్నాడు నరసింహం. నాకు రావలసిన రెండున్నర లక్షల రూపాయలలో వందరూపాయలు దక్కింది. అనుకున్నాడా నరసింహం.

5

బొంబాయి ఇంటర్వ్యూకి ఎటెండ్ అయ్యాడు నరసింహం.

అక్కడ నరసింహంతోపాటు ఎంతోమంది ఇంటర్వ్యూకి అటెండ్ అయ్యారు.

ఒక్కొక్కరే లోపలకు వెళ్ళివస్తున్నారు.

వెళ్ళేటప్పుడు ఏమవుతుందో అనుకుంటూ లోపలకు వెడుతున్న వారు, బయటకు వచ్చేటప్పటికి దిగులుగా వస్తున్నారు.

నరసింహం వచ్చేపోయేవారిని చూస్తూ కూర్చున్నాడు.

చివరకు నరసింహం వంతు వచ్చింది.

నరసింహం బిక్కుబిక్కుమంటూ లోపలకు వెళ్ళాడు.

లోపల నలుగురు కూర్చుని వున్నారు,

వారి చేతిలో నరసింహం పంపించిన సర్టిఫికేట్స్ వున్నాయి.

"మీ పేరు?"

"నరసింహం."

"ఏం చదువుకున్నారు? మీ క్వాలిఫికేషన్ ఏమిటి?"

"బి.కాం. పాస్డ్ సార్. టైపురైటింగ్ ఇంగ్లీషు హయ్యరు గ్రేడు షార్టుహేండ్ లోయర్‌గ్రేడు పూర్తి అయినవి సార్?"

"ఐసీ!" అన్నాడు వారిలో ఒకతను.

"మీకు ఇంత బాగా మార్కులు వచ్చినా వుద్యోగం రాకపోవటానికి కారణం?" అన్నాడు వారిలో ఒకతను.

"నా దురదృష్టం సార్." అంటూ సారథి ఇచ్చిన రికమెండిషన్ లెటర్ తీసి, వారి చేతికిచ్చాడు నరసింహం.

"సారధి మీకు తెలుసా?" అన్నాడతను రికమెండేషన్ లెటర్ చూస్తూ.

"మేమిద్దరము క్లోజ్ ఫ్రెండ్సము సార్! ఇద్దరం ఒకరిని విడిచి ఒకరు వుండలేనంత ఫ్రెండ్‌షిప్ మాది."

అతను తల వూపి "మీ సర్టిఫికెట్స్ ఒకసారివ్వండి" అన్నాడు.

ఫైలులో నుంచి సర్టిఫికెట్స్ తీసి అతని చేతిలో పెట్టాడు నరసింహం జరిగేదానిని తలచుకుంటూ.

అతను సర్టిఫికెట్స్, ట్రూకాపీలు వెరిఫై చేసి "వాట్" అన్నాడు ఆశ్చర్యంగా.

మిగిలినవారు అతని వైపు చూచారు.

అతను వాటిని వారికి ఇచ్చాడు.

వారందరూ ఒకరి తరువాత ఒకరు వాటిని చూచారు.

ఒరిజినల్ మార్కుల లిస్టులోని మార్కులు, ట్రూ కాపీలలోని మార్కులు చూచారు.

ట్రూకాపీలలోని క్రింద సంతకం చూచారు.

అక్కడ సారథి సంతకము, ఆఫీసు స్టాంపు వేసి వున్నాయి.

"ఈ ట్రూకాపీల మీద సంతకాలు ఎవరిచేత పెట్టించారు?"

"సారథి చేత."

"మీరు టైపిస్టుగా, వీటిని మీరే టైపు చేశారా?"

"లేదు సార్! అప్లికేషన్ పెట్టటానికి లాస్ట్‌డేట్ అయిపోతుందని సారథి దగ్గర వుండి టైపు చేయించి, రెండు సంతకాలు పెట్టి పోస్టు చేయించాడు" అన్నాడు నరసింహం.

నలుగురు ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నారు.

"ఇక మీరు వెళ్ళవచ్చు" అన్నారు వాళ్ళు.

"నా సర్టిఫికెట్స్ సార్!" అన్నాడు నరసింహం.

"మేము పోస్టులో పంపిస్తాము. అవి పోతాయని మీరేమి బెంగ పెట్టుకోనవసరం లేదు. మీరు వెళ్ళండి." అన్నారు వాళ్ళు.

"బ్రతుకుజీవుడా!" అనుకుంటూ బయటపడ్డాడు నరసింహం.

ఆ సాయంత్రం ఎవరు సెలక్టు అయ్యారో లిస్టు పెట్టారు. అందులో తన పేరుండదని తెలుసు. లిస్టులో మానేజరుగా ఎవరినో సెలక్టు చేసుకున్నారు. కానీ పేపరులో మానేజరు పోస్టు వున్నట్లు ప్రకటించలేదు.

6

ఆ మరునాడు సారథి ఆఫీసుకు వెళ్ళాడు నరసింహం.

"ఏరా! ఇంటర్వ్యూ ఎలా జరిగింది? నిన్ను సెలక్టు చేసుకున్నారనుకుంటాను!" అన్నాడు సారథి ఉత్సాహంగా నరసింహాన్ని చూస్తూ.

"లేదురా! ఎవరినో టైపిస్టుకి సెలక్టు చేసుకుని, ఇంకొకరిని మానేజరుగా సెలక్టు చేసుకున్నారు. అసలు మానే

జరు పోస్టు వున్నట్లు తెలియదుగా మనకు" అన్నాడు నరసింహం.

"వారికి మానేజరు సడన్‌గా కావలసి వుంటాడు. నిన్ను సెలక్టు చేసుకోకపోవడ మేమిటి?" అన్నాడు సారథి సీరియస్‌గా ఆలోచిస్తూ.

నరసింహం మాట్లాడుతూండగానే నరసింహాన్ని ఇంటర్వ్యూ చేసిన నలుగురు ఆఫీసర్లు స్ప్రింగ్‌డోర్ తెరుచుకొని లోపలకు వచ్చారు.

సారథి వాళ్ళను చూచి వినయంగా లేచి నిలబడ్డాడు. సారథితోపాటు నరసింహంకూడా లేచి నిలబడ్డాడు.

వారు లోపలకు వచ్చి చైర్స్‌లో కూర్చొని, ఇద్దరిని మార్చి మార్చి చూడసాగారు.

"మీరు కబురు పెడితే స్టేషనుకు వచ్చేవాడినిగా సార్!" అన్నాడు సారథి, వాళ్ళు అంత సడన్‌గా రావటానికి గల కారణాన్ని ఆలోచిస్తూ.

"ఆ శ్రమ నీకివ్వటం మాకు ఇష్టం లేదు" అన్నాడు వారిలో ఒకతను.

సారథి ఆ మాటలకు ఆశ్చర్యపోయాడు.

ప్యూన్‌ని పిలిచి డ్రింక్స్‌కు ఆర్డరిచ్చాడు సారథి.

"నో! మాకటువంటివి అవుసరం లేదు" అంటూ వారు ప్యూన్‌కు సైగ చేసారు బైటకు వెళ్ళమన్నట్లుగా.

అతనితోపాటు నరసింహం కూడ బయటకు వెళ్ళబోయాడు.

"మిస్టర్! మీరుండండి!" అని కూర్చోమన్నట్లుగా సైగ చేసారు ఇద్దరికి.

వాళ్ళు సూట్‌కేస్‌లో నుంచి చిన్న ఫైలు తీసి దానిలో నుంచి నరసింహం సర్టిఫికెట్లు, ట్రూకాపీలు తీసారు.

వాటితోపాటు సారథి, నరసింహానికి ఇచ్చిన రికమెండేషన్ లెటర్ కూడ తీసారు.

"ఈ ట్రూ కాపీల మీద సంతకం మీదేననుకుంటాం!" అంటూ ట్రూ కాపీలను సారథికి ఇచ్చారు.

సారథి వాటిని తీసుకొని చూచి "ఎస్ సార్! ఈ సంతకములు నేను పెట్టినవే." అన్నాడు.

సారథి చేతికి ఒరిజినల్ మార్కుల లిస్టు ఇచ్చి, ఆ రెండిటిని వెరిఫై చేయమన్నారు.

ఆ రెండిటిని వెరిఫై చేయగానే సారథి ముఖం ఆశ్చర్యంతో పెద్దదైంది.

అనుమానంగా నరసింహం వైపు చూశాడు.

నరసింహం జరిగింది ఏమిటో తెలియక సారథి ముఖంలోకి చూస్తున్నాడు.

"ఒరిజినల్ మార్కుల లిస్టుకన్నా రెట్టింపు మార్కులు ట్రూ కాపీలలో వున్నాయి. అలా ఎందుకు సంతకాలు పెట్టావు వాటి మీద? ట్రూ కాపీలు నీవు వెరిఫై చేయకుండానే సంతకాలు పెట్టావా?" అన్నాడు ఒక ఆఫీసరు.

"నో....సార్. నేను చాలా జాగ్రత్తగా వెరిఫై చేసి సంతకాలు పెట్టాను. ఇది ఎలా జరిగిందో అర్థం కావడం లేదు" అన్నాడు సారథి కంగారుగాను, ఒకవిధమయిన భయంతోను.

"ఎస్! నీకేమి తెలియదు. స్నేహితుడికి జాబ్ రావటం కోసం ట్రూ కాపీలలో ఎక్కువ మార్కులు వేసి గెజిటెడ్ ఆఫీసరుగా క్రింద సంతకాలు పెట్టావు. మేము ఒరిజినల్స్ చూడమని నీకు తెలుసు. కాని నీ పాపం పండి స్టేట్ ఫస్ట్ మార్కులు, నీ రికమెండేషన్ లెటర్ చూడగానే ఒరిజినల్స్ చూడాలనిపించింది. నీవు చేసిన మోసం బయట

పడింది" అన్నాడు ఒక ఆఫీసరు సీరియస్‌గా.

"నో....నో. నాకేమి తెలియదు" అన్నాడు సారథి.

"నీకు తెలియకుండా ఎలా జరిగింది ఇది. జాగ్రత్తగా వెరిఫై చేసానంటున్నావు. మరి అప్పుడు చూడలేదు నీవు. పోనీ దీని మీద రీమైపు చేసివుంటే నీవు సంతకములు పెట్టిన తరువాత టైపు చేసారనుకోవచ్చు. దీనిమీద చిన్న రీటైపు కూడ కనిపించటం లేదు." అన్నారు వాళ్ళు.

"నో సార్! అది ఎలా జరిగిందో నాకు తెలియదు" అన్నాడు సారథి.

"నో! నీవు ఎంత చెప్పినా మేము నమ్మము. నీకు తెలియకుండానే నీ ఫ్రెండ్‌కు రికమెండేషన్ లెటర్ ఇచ్చావు. నీ రికమెండేషన్ లెటర్ చూడగానే ఒరిజినల్స్ చూడమనుకున్నావు. ఇలా ఎన్ని చేశావు? గెజిటెడ్ ఆఫీసరు అయివుండి దొంగ సర్టిఫికెట్స్ సృష్టిస్తున్నావన్న మాట. నీలాంటివారు దేశానికే చీడపురుగులు" అన్నాడు ఆ ఆఫీసరు ఆవేశంగా.

"ఇన్‌స్పెక్టర్!" అన్నాడొక ఆఫీసర్.

అప్పటి వరకు బయట నిలబడి వున్న ఇన్‌స్పెక్టర్ లోపలకు వచ్చి సారథిని అరెస్ట్ చేశాడు.

సారథి చేతి సంకెళ్ళు చూడగానే నరసింహంలో ఆనందం పురకలు వేసింది.

"నా పగ తీరింది. అయిదు లక్షలకు ప్రతీకారం చేతికి సంకెళ్ళు" అనుకున్నాడు కలగా మనస్సులో.

7

కొన్నాళ్ళకు నరసింహం సారథిని చూడటానికి జైలుకు వెళ్ళాడు.

సారథి నరసింహాన్ని చూడగానే కళ్ళనీళ్ళు పెట్టుకొని,

"నరసింహం! నాకు తగిన శాస్తి జరిగిందిరా" అన్నాడు విచారంగా.

"అవును! జరుగుతుంది. ఎందుకు జరగదు? జరిపించింది నేను. ఫలితాన్ని చూపింది నీవు" అనుకున్నాడు నరసింహం.

"ఎలా జరిగిందిరా సారథి? నీవు డూప్లికాపీల మీద జాగ్రత్తగానే వెరిఫై చేసి సంతకాలు పెట్టావు" అన్నాడు నరసింహం.

"అదే తెలియదురా! నాకు తగిన ప్రాయశ్చిత్తం జరిగింది. నీ లాటరీ టికెట్ నీకు ఇవ్వకుండా చేసినందుకు నాకు మంచి ప్రాయశ్చిత్తం జరిగింది."

"అంటే లాటరీ తగిలిందన్న మాట" అన్నాడు నరసింహం.

ఇప్పుడయినా సారథి తన నేరం ఒప్పుకుంటున్నందుకు, ఇప్పుడయినా దానిలో తనకు రావలసిన వాటా ఇస్తాడన్న ఆశ లేదు.

"తగిలిందిరా! కాని ఏం లాభం? నాకు లాటరీలమీద ఇంట్రస్టు లేదని నీకు తెలుసుగా! దానిని ఇంటికి వచ్చిన తరువాత అశ్రద్ధగా ఎక్కడో పారవేశాను. కాని అదే ప్రైజు వచ్చింది. నీకు వచ్చే డబ్బును పాడు చేశాను. నిన్ను వరించే లక్ష్మిని కాలదన్ని వెడలగొట్టాను! అప్పటి నుంచి దాని గురించి బాధపడని క్షణం లేదు. నీవు టికట్ చూపించమంటే పాత టికట్ కొని చూపించాను" అన్నాడు సారథి దిగులుగా.

"అయితే ఆ టికట్ నీ దగ్గర లేదన్నమాట!"

"లేదురా! నా మాట నమ్ము" అన్నాడు సారథి జాలిగా నరసింహాన్ని చూస్తూ.

సారథి మాటలు వినగానే నరసింహం గుండెల్లో అగ్ని పర్వతాలు బ్రద్దలయినట్లు అనిపించింది.

"వస్తానురా, తరువాత కలుసుకోవచ్చు" అంటూ బయటకు వచ్చాడు అక్కడ ఉండలేక నరసింహం.

"సారథియే టికట్ తీసుకొని, తనకు వాటా ఇవ్వాలన్న ఆశతో తగలలేదన్నాడనుకొని ప్రతీకారం తీర్చుకున్నాను. టికట్ పోయిందని ముందు చెప్పినా బావుండును.

వాడిమీద ప్రతీకారం తీర్చుకోవాలనుకొని ముందుగా స్టావు చింపకుండా మార్కుల లిస్టు టైపు చేసి, వెనుక పేపరు మీద కార్బన్ పెట్టి దానిమీద వేస్టు పేపరు పెట్టి ఎక్కువ మార్కులతో టైపు చేశాను. తరువాత చూస్తే ముందు కాపీ క్రిందనే కార్బన్ పెట్టి తీసాననుకుంటారు, కాగితం కట్ చేయకుండా ఉంచటంవలన.

సారథి ముందు కాపీ చూపి అవే మార్కులు కార్బన్ పెట్టి తీసిన కాగితం మీద వుంటాయనుకున్నాడు. అందుకే మొదట కాపీ వెరిఫై చేసి రెండింటి మీద సంతకాలు పెట్టాడు. కాని నేను చేసిన పనివారికి ఎలా చెప్పను" అనుకున్నాడు నరసింహం బాధగా. □□□

పేడ త్రొక్కనేల ?

ఒక పెద్దమనిషి రోడ్డుమీద నడుస్తూ, క్రింద ఏదో కనిపించగానే ఠక్కున ఆగిపోయాడు.

దానిని చేతిలోకి తీసుకొని వాసన చూశాడు.

"ఛీ! పేడ. ఇంకో అడుగు ముందుకు వేస్తే తొక్కేవాడినే" అనుకొంటూ ప్రక్కకు తిరిగి వెళ్ళాడు ఆ పెద్దమనిషి. —రుద్రరవి, సిరిసిల్ల.

స్వార్థానికి బలి!

యస్. గీతారాణి

తోటలో సన్నజాజి పందిరి క్రింద కూర్చున్నాను నేను

నా ఆలోచనలనిండా గౌరి. నాలో ప్రతి అణువణువు గౌరిని యీ లోకంలో వుంచకూడదని ఆలోచిస్తున్నది.

'గౌరి' ఆ పేరును తల్చుకుంటేనే ఆవేశం పొంగ సాగింది నాలో.

నా జీవితాన్ని దుఃఖమయం చేస్తున్నది గౌరి.

నా ప్రాణంలో ప్రాణమయిన నా భర్తను తన వలలో వేసుకొన్నది గౌరి.

మోహన్‌తో నా పెళ్ళి అయిన మర్నాడే నాకు జ్వరం వచ్చేసింది. ఆ జ్వరం టైఫైడ్‌లోకి దించి, నన్ను మంచం మీదకు ఎక్కించింది.

మోహన్ ఇల్లు మా ఇంటికి కొద్దిదూరంలోనే వుంది. అతను లాయర్. నేను క్రైమ్ రచయిత్రిని. డిటెక్టివ్ కధ

లలో కోర్టుసీన్స్ వ్రాయాలన్నా. ఇంకేం కావాలన్నా అతన్ని కలుసుకొని సలహాలు అడిగేదాన్ని.

అలా అతని పరిచయం నన్ను ప్రేమలోకి దింపింది. అతన్ని మా ఇంటికి 'టీ'కి అహ్వానించాక అమ్మ, నాన్న గార్లవల్ల మాకు బంధుత్వం కూడా వున్నట్లు తెలిపింది.

ఇంకేముంది? నా ఆశలు పురివిప్పిన నెమలిలా నాట్యమాడాయి. మోహన్ తల్లితండ్రులు, మా వాళ్ళు మాట్లాడుకొని పదిమంది పెద్దలముందు వైభవంగా వివాహం జరిపించారు.

ఉదయం పెళ్ళయితే సాయంత్రం నాకు తీవ్రమైన జ్వరం వచ్చేసింది. కోటి కోర్కెలతో తొలిరేయి కోసం ఎదురు చూసిన నాకూ, మోహన్‌కు నిరాశ ఎదురయింది.

నా జ్వరం తగ్గిపోవాలని వేయి దేవుళ్ళకు మ్రొక్కుకొన్నాను. కానీ నా జ్వరం టైఫైడ్‌లోకి దించింది. నేను పుట్టింటిలోనే వుండిపోవలసి వచ్చింది.

మోహన్ ప్రతిరోజూ మా ఇంటికి వచ్చి నన్ను చూసి పోయేవాడు.

అతను మా యింటికి వచ్చినప్పుడు గౌరిని చూసాడు. గౌరి అప్సరస కాకపోయినా అందగత్తె! మా వంటమనిషి కూతురు.

గౌరికి స్త్రీకి ప్రాణమైన శీలం బొత్తిగా లేదు. మగవాడిని చూస్తే వళ్ళు తెలియదు దానికి.

నేను ఎప్పుడూ దాని ప్రవర్తనను గురించి ఆలోచించలేదు. కానీ ఎప్పుడయితే నా మోహన్‌పైకి తన వలపుల వల విసిరిందో అప్పుడే ఆలోచించాను. ఆందోళన చెందాను.

అందమైన ఆడది పురుషుని విషయంలో ఒక అడుగు ముందుకు వేస్తే, పురుషుడు మరో అడుగు ముందు కేస్తాడు.

మోహన్ నా చుట్టూ తిరగటానికి బదులు, గౌరి చుట్టూ తిరగటం ప్రారంభించాడు. ఇది సహించలేకపోతున్నది నా హృదయం.

ఒక రోజున ఎవ్వరూ లేని సమయం చూసి, గౌరిని పిలిచాను.

"గౌరీ! సాటి ఆడదాని సంసారంలో నిప్పులు పొయ్యటం నీకు న్యాయం కాదు. భార్యా భర్తలు ఒకరికి ఒకరు పవిత్రంగా దక్కాలి. దయచేసి ఆయన్ను వది లెయ్" అని దైన్యంగా అడిగాను.

గౌరి ముసి ముసిగా నవ్వింది.

"వసంతగారూ! మీ ఆయనను మీరే అదుపులో పెట్టు కోండి" అంది.

"నోరు ముయ్! ఆయన మగవాడు. నువ్వు ఆడదానివి. నువ్వు చెడిపోతే ఈ జన్మలో నీకు పెళ్ళి కాదు" ఆవే శంగా అన్నాను నేను.

"నాకు పెళ్ళి ఎందుకులెండి. పెళ్ళి అయిన మీకన్నా, పెళ్ళికాని నేను అన్ని సుఖాలు అనుభవిస్తున్నాను" గౌరి వెకిలిగా అని వెళ్ళిపోయింది.

దాని మాటలకు మంచంపై వాలిపోయి, భోరున ఏడ్చేశాను. బాగా ఏడవటంతో ఆ సాయంత్రానికి జ్వరం చాలా ఎక్కువై పోయింది.

నాన్నగారు మా ఫ్యామిలీ డాక్టర్ రవికృష్ణకి ఫోన్ చేసి అతన్ని రప్పించారు.

అతనే నాకు ట్రీట్ మెంట్ చేస్తున్నాడు.

నాకు ఇంజెక్షన్ చేసి "దయచేసి మీరు ఎలాంటి ఆవేశానికి గురి కాకండి. ఇలా అయితే మీరు ఆరోగ్యవంతులు కావటం చాలా కష్టం" అని చెప్పాడు.

ఆ మాటలు మంత్రాల్లా పని చేశాయి. ఏ ఆలోచన పెట్టుకోవటం మానేశాను.

రవికృష్ణ చేతి చలువవల్లనో, ఆ దేవుడి దయవల్లనో

నా జ్వరం తగ్గు ముఖం పట్టింది. ఇప్పుడు సంపూర్ణ ఆరోగ్యవంతురాలినై నాను.

ఐతే, నా శరీరం వేడి తగ్గినా లోపల వేడి తగ్గలేదు. గౌరి మీద పగ, కసి, క్రోధం నాలో భగ భగ మండిస్తున్నది.

తొలిసారిగా గౌరిని 'హత్య చెయ్యాలి' అని అనుకొన్నాను. ఆ వూహకు మొదట నా శరీరమంతా వణికి పోయింది. హత్య నేను చెయ్యగలనా? అది నా తరమా? అని అనుకొన్నాను. నేను గౌరిని చంపలేను. కాని గౌరి బ్రతికి వుండకూడదు, గౌరి చనిపోవాలి. ఎలా?

నాకు ఒక్కసారిగా డాక్టర్ రవికృష్ణ గుర్తుకు వచ్చాడు.

2

రవి నా ప్రేమ పూజారి అని ఖచ్చితంగా చెప్పగలను.

అతను ఇంజెక్షన్ చేస్తున్నపుడు నా కళ్ళల్లోకి చూసే చూపులు, నాతో మాట్లాడే మాటల్లో ఏవో అర్థాలు గోచరించేవి.

ఒకరోజున రవి నాకు ఇంజెక్షన్ ఇవ్వటానికి వచ్చాడు. ఆ సమయంలో అమ్మా, నాన్నా లేరు. గౌరి తల్లి వంట గదిలో వుంది. రవి నాకు ఇంజెక్షన్ ఇచ్చేసి, ప్రక్కన వున్న స్టూల్ మీద కూర్చున్నాడు.

"నాన్నగారు బయటికి వెళ్లారు డాక్టర్" అన్నాను, అతను నాన్నగారి కోసం కూర్చున్నాడేమోనని.

"నేను కూర్చున్నది నీ కోసం వసంతా!" అన్నాడు రవి.

నా కళ్ళు ఆశ్చర్యంతో వెడల్పయ్యాయి.

"నా కోసమా?" అని అన్నాను.

"అవును వసంతా! నా మనసు నీ చుట్టే పరిభ్రమిస్తున్నది. ఒక్కసారి నిన్ను...."

"డాక్టర్!" నేను తీవ్ర స్వరాన అరిచాను.

"నేను పెళ్ళి అయినదాన్ని అన్న సంగతి మరిచిపోయారా?" కఠిన స్వరాన అడిగాను.

"నాకు తెలుసు వసంతా! నువ్వు వాసన చూడని పువ్వువు. మోహన్ ఎలాగూ పక్కదార్లు పట్టాడు. అతనికి లేని పవిత్రత నీకెందుకు?" అన్నాడు.

చురుగ్గా చూసాను అతన్ని.

"డాక్టర్! మరోసారి ఈ మాటలు అనకండి. పురుషుడు అపవిత్రుడైతే లోకం ఏమనదు. కాని స్త్రీ అపవిత్రురాలైతే లోకమే కాదు, ఆమె కూడా తనని తను అసహ్యించుకుంటుంది. మోహన్‌ని నేను ప్రేమించి పెళ్ళి చేసుకొన్నాను."

"నేను నిన్ను ప్రాణంగా ప్రేమిస్తున్నాను వసూ! నీ భర్త నీ కోసం ఏమీ చెయ్యలేదు. కాని నేను నీ కోసం నా ప్రాణాలు ఇవ్వటానికి కూడా సిద్ధమే" అన్నాడు.

"సారీ, డాక్టర్! మీరు నన్ను ప్రేమించినట్లే, నేనూ మోహన్ని ప్రేమించాను. మరోసారి మీ ప్రేమ విషయాన్ని నా దగ్గర ఎత్తకండి" నేను ఖచ్చితంగా చెప్పేశాను.

రవి నిరాశగా మెడికల్ కిట్ పట్టుకొని వెళ్ళిపోయాడు. అటు తర్వాత మళ్ళీ ఆ విషయం నా దగ్గర ఎత్తలేదు.

ఈ రోజు నాకు రవి చప్పున గుర్తు వచ్చాడు. అతను నా కోసం ఏమైనా చెయ్యటానికి సిద్ధంగా వున్నాడు.

'రవిని నా పనిముట్టుగా వాడుకొంటే....ఆ పనిముట్టుని గౌరి మీదకు ప్రయోగిస్తే......."

నా ఆలోచనలు పూర్తి కాకముందే, డాక్టర్ రవికృష్ణ వచ్చాడు, మెడికల్ కిట్‌తో.

నా ఆలోచనలను ఆపి, అతన్ని చూసాను. నాకిష్ట మైన వైట్ డ్రస్‌లో అందంగా కనిపించాడు రవి.

"వసూ! మంచులో కూర్చున్నావ్. మంచిది కాదు లోపలకి పద" అతని గొంతులో నాపై ఆరాధన జల్లులు కురుస్తున్నది.

"మీరు వుండగా నాకేం భయం!'' కొంటెగా నవ్వుతూ అన్నాను. రవి ముఖంలో చిత్రమైన వెలుగు కనిపించింది.

నా చూపుల్లో ఏ అర్థముందోగాని నా దగ్గరగా వచ్చి, నా చేతిని పట్టుకొని, తన్మయంగా "వసూ" అని పిలిచాడు.

"వుష్! అమ్మ వుంది లోపల. రేపు నేను మీ హాస్పి టల్‌కి వస్తాను. అన్ని విషయాలు మాట్లాడుకొందాం" నేను నా చేతిని విడిపించుకొని లోపలకి పరిగెట్టాను.

ఆ మర్నాడు మా కారులో రవి హాస్పిటల్‌కి వెళ్ళాను. కంపొండర్‌గాని, మరెవరూ లేరు హాస్పిటల్లో.

రవి నన్ను చూడగానే చిలిపిగా నవ్వి, కుర్చీ చూపిం చాడు.

"రవీ! మీరు నిజంగా నన్ను ప్రేమిస్తున్నారా?" సూటిగా ప్రశ్నించాను.

"ఇలా నా ఒడిలో వాలి చూడు తెలుస్తుంది" అతను అల్లరిగా అన్నాడు.

నేను మౌనంగా ఉండిపోయాను.

రవి నా మౌనాన్ని మరోలా అర్థం చేసుకొన్నాడేమో కుర్చీలోంచి లేచి, నా దగ్గరకివచ్చి, సున్నితంగా నా భుజంపై తన చేతినివేసి నొక్కాడు.

"రవీ! నాకోర్కె ఒకటివుంది. అది తీరిస్తే మీకోర్కె నేను తీరుస్తాను" అన్నాను మెల్లగా.

"చెప్పు వసూ, నీకోసం నా ప్రాణాలు యివ్వటాని కయినా సిద్ధంగా వున్నాను" రవి ఆవేశంగా అన్నాడు.

"నీ ప్రాణం అక్కరలేదు గానీ. మరొకరి ప్రాణం తీస్తే చాలు" అన్నాను.

"వసంతా!" రవి దిమ్మెరపోతూ చూసాడు.

"అదిగో, మీకు నాపై ఎంత ప్రేమ వుందో ఆ ముఖం చూస్తేనే తెల్సిపోతున్నది" నిష్ఠూరంగా అన్నాను.

రవి ఒక్క-క్షణం మౌనంగా వుండిపోయాడు.

"వసూ! నిన్ను పొందటం కోసం ఏమైనా చేస్తాను. ఎవర్ని చంపాలో చెప్పు." అన్నాడు చివరకు.

నేను చూపులు దించేసుకున్నాను.

"నీ భర్తనా చంపాలి!"

"ఛ! ఛ!" నేను బాధగా ముఖం పెట్టాను.

"మరెవర్ని చంపాలి?" వింతగా అడిగాడు.

"గౌరిని!"

"గౌరి నీకేం అపకారం చేసింది?" ఆశ్చర్యపోతూ అడిగాడు.

"ప్లీజ్! నన్ను వివరాలు అడక్కండి. నేను కావాలను కుంటే దాన్ని....దాన్ని చంపెయ్యండి" నేను కసిగా అన్నాను.

రవి ఏం మాట్లాడకుండా నా ముఖంలోకే చూస్తూండి పోయాడు.

"గౌరిని చంపలేరా?" నిరాశగా ప్రశ్నించాను.

"చంపగలను. అయితే ఒక షరత్!"

"ఏమిటా షరత్?"

"నీవు కోరినట్లు గౌరిని ఎలాగో చంపేస్తాను. ఐతే నువ్వు తొలిసారిగా నాకే అంకితం కావాలి. ఆ తరువాతే నిన్ను నీ భర్త తాకాలి!"

"డాక్టర్!" కంపిత స్వరాన పిలిచాను.

"యస్. అలా అయితేనే గౌరిని నేను చంపేది. చెప్పు. నువ్వు నా షరతుకు ఇష్టపడతావా?"

"నాకోర్కె తీర్చాక మీకోర్కె తీరుస్తాను," నేను నెమ్మదిగా అన్నాను.

రవి ఒక్క వుదుటన కుర్చీలోంచి లేచి నా దగ్గరకి వచ్చాడు.

అతని కళ్ళలో నాపై బలీయమైన కోర్కె కదలాడింది.

నేను చురుగ్గా లేచినిలబడి "మాట తప్పకండి. నా కోర్కె తీర్చాకే మీదాన్ని అవుతాను" అని అన్నాను.

అతని ముఖంలో నిరాశ తొంగిచూపింది.

అతికష్టంమీద తననుతను నిగ్రహించుకుంటూ "మాటకు మమతకు కట్టుబడే వాడిని నేను. నీపై మమత చంపుకో లేక చేయరాని పనిచేస్తున్నాను. ఆ పని చేసేదాకా నామాట నిలుపుకుంటాను. త్వరలో గౌరిని పైకి పంపిస్తాను," అన్నాడు.

నేను అందంగానవ్వి, అతని దగ్గర శలవుతీసుకుని ఇంటికి వచ్చాను.

ఇంటికి వచ్చాక. నా ఆనందం వర్ణించ శక్యంకాదు. నా శత్రువు గౌరి త్వరలో నా జీవితంలోంచే కాదు, ఈ లోకంలోంచే శాశ్వతంగా తప్పుకొంటున్నది.

నా మోహన్ నావాడు అవుతాడు. నా అందంతో అతన్ని కట్టి పడెయ్యగలను.

కాని రవి....ఒక సమస్య రూపుమాపి పోతుందను

కొంటే, మరో సమస్య రవి?

రవి దగ్గర అన్నంత సులభంగా అతనికి లొంగిపోగలనా? వూఁహూఁ. అది నావల్లకాదు. నా అవసరం తీరిపోయాక రవినుంచి తప్పించుకోవాలి.

ఇది నా ఆలోచన!

3

ఎవరో నన్ను తట్టి లేపటంతో లేచి కూర్చున్నాను.

ఎదురుగా అమ్మ కనిపించింది.

"వసూ! మన గౌరిని ఎవరో హత్యచేసారట" అమ్మ గాబరాగా చెపుతుంటే, మెరుపులా లేచాను.

"గౌరి చనిపోయిందా?" నా గొంతులో ఆనందం చిందులు వేసింది. నా ముఖంలోకూడా ఆనందచ్ఛాయలు కనిపించాయేమో. అమ్మ నన్ను ఆశ్చర్యంగా చూస్తూ "నీకు బాధగా లేదటే" అంది.

అమ్మకు దొరికి పోతానేమో అనే భయంతో, నిజంగా విచారాన్ని నటిస్తూ "గౌరి ఎలా చనిపోయిందమ్మా" అని ప్రశ్నించాను.

"గౌరి గర్భవతట. ఏ వెధవో దానితో తన అవసరం తీర్చుకొని చంపేసాడు. గుండెల్లో, కడుపులో కత్తి పోట్లు వున్నాయట. దానిశవం దాసన్నపేట వెనకాల సున్నపు గుట్టల దగ్గర దొరికిందట." అమ్మ విచారంగా చెప్పింది.

"గౌరి శవం ఇంటిదగ్గరే వుందా?" చీర కుచ్చెళ్ళు సర్దుకుంటూ అడిగాను.

"లేదు. శవాన్ని పోస్ట్ మార్టం చెయ్యడానికి తీసుకెళ్ళారు. పాపం ఆదెమ్మ ఎంతలాగో ఏడుస్తున్నది

కూతురికోసం. గౌరి చెడిపోయినదయినా, దాని మనసు వెన్నలాంటిది. దాన్ని చంపడానికి ఏ వెధవకు చేతులు వచ్చాయో!" అమ్మ బాధగా అంటూ వంటింటిలోకి వెళ్ళి పోయింది.

అమ్మ వెళ్ళిపోయాక నేను పిచ్చి ఆనందంతో గంతు లేసాను. నా ఒకేఒక్క అడ్డు గౌరి, స్వర్గాన్ని చేరుకుంది.

కాదు....కాదు తను నరకానికి చేరుకొని నాకు బంగారు బాటవేసింది.

సాయంత్రం మోహన్ వచ్చేసరికి అతనికిష్టమయిన లడ్డూ, కీర్ మోన్ తయారు చేయాలనుకున్నాను.

సాయంత్రం మోహన్, మా అత్తగారు వచ్చారు.

నన్ను అత్త యింటికి తీసుకెళ్ళేందుకు, మంచి ముహూర్తాలు చూసుకునేందుకు వచ్చారు.

నేను ఇప్పుడు పూర్తిగా ఆరోగ్యవంతురాలి నవటమే అందుకు కారణం.

అమ్మా, ఆవిడ పదహారవ తారీకున మంచిదని మాట్లాడుకొంటుంటే సిగ్గుతో వంటింటిలోకి పరిగెత్తాను.

అత్తగారికి, అమ్మకు టిఫిన్ ఇచ్చేసి, మళ్ళీ వంటింటి లోకి వెళ్ళి మోహన్‌కోసం లడ్డులూ, కీర్ మోన్ ప్లేటులో పెడుతుంటే, ఎవరివో బలమైన హస్తాలు వెనుకనుండి నన్ను చుట్టేసాయి. ఆ చేతులు మోహన్‌వని పసిగట్టిన నా హృదయం లేడిపిల్లలా గంతులేసింది.

హఠాత్తుగా గౌరి గుర్తుకొచ్చింది.

ఇక మోహన్ నా పాదాక్రాంతుడే అని అనుకున్నాను గర్వంగా.

"వసూ! నాకోసం ఏం చేశావు?" అతను నా చెవిలో గుస గుసగా అన్నాడు.

"గౌరి చనిపోయినందుకుగా నా పార్టీ ఈ స్వీట్స్....
మీకు...."

నేను పొరపాటున నోరు జారేసి, ఆయన ముఖంలోకి భీతిగా చూశాను.

"అబ్బా! స్వీట్సా ఏవీ?" మోహన్ నా చేతిలో ప్లేటు లాక్కొని బయటకి వెళ్ళిపోయాడు.

నేను అలాగే నిలిచిపోయాను.

గౌరిమీద కసితో ఆమె చనిపోయినందుకు పార్టీ ఇస్తున్నానని అనేశాను. ఈ ఒక్క మాటతో మోహన్ నన్ను అనుమానిస్తే? అసలే అతను లాయర్.

ఛ! ఛ! ఈ మాత్రానికే అనుమానిస్తాడా? ఆ ఒక్క మాటతో నేనే గౌరి హత్యకు కారకురాలినని వూహించలేడు అతను.

నన్ను నేనే సమాధాన పరచుకొన్నాను.

4

హాలులో కూర్చొని 'అపరాధ పరిశోధన'లో పడిన నా కథ చదువుతున్నాను.

అంతలో టెలిఫోన్ గణ, గణ మ్రోగింది.

బుక్ సోఫాలో పడేసి, లేచివెళ్ళి రిసీవర్ అందుని "హలో! వసంతా హియర్!" అన్నాను.

"హల్లో, వసూ! అదృష్టవంతుడిని. నువ్వే ఫోన్ తీసావు."

అది రవి గొంతు. అతని కంఠం వినగానే నా గుండెలు దడదడలాడాయి.

"మీరా!" అన్నాను నీరసంగా.

"వసూ! మా నాన్నగారు నిన్న చెప్పారు. నువ్వు పదహారవతారీకున అత్తింటికి వెళుతున్నావని, మోహన్‌తో సంసారిక జీవనాన్ని సాగించబోతున్నావని. నీ మాట ప్రకారం నేను గౌరిని చంపేసాను. పోలీసులు హంతకుడు ఎవరో ఈ జన్మకు కనుక్కోలేరు. తమరి కోర్కె నెరవేరింది. మరి నా కోర్కె నీవు తీర్చాలి. ఈ సాయంత్రం అందంగా అలంకరించుకొని నా దగ్గరికి రా. వస్తావుకదూ. వస్తావులే నాకు తెల్సు!"

రవి నవ్వుతూ ఫోన్ పెట్టేసిన శబ్దమయింది.

నేను శిలాప్రతిమలా అలాగే నిలిచిపోయాను.

ఇప్పుడు ఏం చెయ్యాలి? నా కోర్కె తీర్చిన రవి కోర్కె తీర్చనా?

నేను ఆలోచిస్తున్నంతలో ఎవరిదో హస్తం నా భుజంపై పడింది.

తృళ్ళిపడి చూశాను. యెదురుగా మోహన్ నిలిచి వున్నాడు.

"ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతున్నట్లున్నావు" అన్నాడు నన్ను అల్లుకుపోతూ.

"ఆ....అవును....నా ఫ్రెండ్...." తడబాటుగా అన్నాను.

"టిఫిన్ తెస్తా నుండండి" అని అతడిని విడిపించుకొని వంటింటిలోకి వెళ్ళిపోయి, అమ్మచేత టిఫిన్ పంపించి. స్నానం మిషతో నేను బాత్‌రూమ్‌లో గడిపి, బయటకొచ్చాను. అప్పటికి ఆయన వుండరని నాకు తెలుసు!

నేను వూహించినట్లే మోహన్ అమ్మతో చెప్పి వెళ్ళిపోయాడట.

5

ఆ సాయంత్రం నాకు తలనొప్పిగా వుందని ఓసారి డాక్టర్ దగ్గరికి వెళతానని అమ్మతో చెప్పాను.

తలనొప్పి అనగానే అమ్మ మళ్ళీ ఏ జ్వరం ముంచు కొచ్చేస్తుందో అని భయపడి వెళ్ళమని అంది.

హాస్పిటల్‌లో రవి ఒక్కడే వున్నాడు. నన్ను చూడ గానే వుషారుగా ఈలవేసి, చిన్నగా కన్నుకొట్టి, నా దగ్గరగా వచ్చి, తన రెండు చేతుల్ని నా చుట్టూ అల్ల బోయాడు.

విసురుగా అతని చేతులని తోసివేసి, దూరంగా జరిగాను.

"వసంతా!" రవి వింతగా పిలిచాడు.

"రవీ! నేను పెళ్ళి అయినదాన్ని. నా మీద వ్యామో హాన్ని చంపుకోండి! నాకు పతనమవాలని లేదు. నా భర్తకు నేను పవిత్రంగా దక్కాలి!"

రవి ముఖంలో రంగులు మారిపోయి, ముఖం ఎరుపు రంగుకు తిరిగింది. కళ్ళలో ఎర్రజీరలు కదలాడాయి.

"మరి, నన్నెందుకు పతనం చేసావు?"

"మీరే చేసుకున్నారు!"

"యూ బ్లడీ వుమన్! ఎంత స్వార్థపరురాలివి. నీ అవ సరం తీరిపోయిందని నన్ను తిరస్కరిస్తున్నావు. నీలో మంచీ, పవిత్రత వుండవచ్చు. కానీ నాలో పవిత్రతలేదు. అందమైన ఆడదాన్ని అనుభవించటం నా హాబీ! మునుపు మంచివుండేది. ఆ మంచితనంతోనే నా ఆనందాన్ని తీర్చు కొనేవాడిని. ఇప్పుడు ఆ మంచి నాలో లేదు. ఇప్పుడు నాలో దానవుడు మేల్కొన్నాడు. కాదు, నీవే మేల్కొలి పావు. నేను హంతకుడినయ్యాను. నాలో దయా, దాక్షి

ణ్యాలకిక తావులేదు. నిన్ను అనుభవించి, గౌర్ని చంపినట్లే నిన్నూ చంపి, నా కసి తీర్చుకుంటాను. మరోసారి నువ్వు ఎవరికి దక్కకుండా చేస్తాను."

అంటూ రవి పులిలా నామీదకు ఎగిరిపడ్డాడు.

నేను 'కెవ్వున' అరచి పరుగెట్టబోయాను. కాని రవి కబంధ హస్తాలు నన్ను చుట్టివేసాయి.

అతికష్టంమీద అతన్ని దూరంగాతోసి, పరిగెట్టాను.

రవి తన కాలిని అడ్డుపెట్టాడు. తూలి ముందుకు పడ్డాను.

అతని చేయి బలంగా నా భుజంపై పడింది.

నేను విసురుగా అతని చేతినితోసి, లేచి, మళ్ళీ ముందుకు పరిగెట్టబోయాను.

రవి నా జాకెట్‌నిపట్టి లాగాడు.

సర్రున సగంవరకు చిరిగిపోయింది జాకెట్.

అతను నా మీదకు రాబోతున్నంతలో—

"డాక్టర్!" కఠినంగా మోహన్‌గొంతు వినిపించింది.

రవి అలాగే నిలిచిపోయాడు. మోహన్‌చేతిలో కత్తి తళతళలాడుతున్నది.

"సమయానికి వచ్చావు మోహన్. నీ భార్య హంతకురాలు. గౌరిని హత్య చేయించింది!"

రవి కసిగా అన్నాడు.

నేను మోహన్ కళ్ళలోకి చూసేశక్తిని కోల్పోయి అచేతనంగా నిలబడిపోయాను.

"మై డియర్ డాక్టర్! నాకు అంతా తెలుసు. ఐదు నిమిషాలు ఆగు. పోలీసులు వస్తారు" మోహన్ గంభీరంగా అంటుంటే నేను కంపించిపోయాను.

"చూసావా, వసంతా! నీ భర్త నీ చేతులకు సంకెళ్ళు

బిగించబోతున్నాడు. అలాంటి వాడికోసం నన్ను కాదన్నావు. ఫలితం చూస్తావుగా!" రవి వెటకారంగా అంటుంటే, వెర్రిచూపులు చూస్తుండిపోయాను.

ఐదునిముషాలలో పోలీసులు వచ్చారు. పోలీసులతో మోహన్ ఫ్రెండ్ కూడా వున్నాడు. అయితే బేడీలు రవికి పడ్డాయి.

"ఇనస్పెక్టర్! ఏమిటిది!" రవి పిచ్చిగా అరిచాడు.

"ఏమిటా? అమాయకురాలైన గౌరిని పాడుచేసి, ఆ నిజం ఎవరికీ తెలియనివ్వకుండా ఆమెను హత్య చేసినందుకు. మందులకోసం నీ దగ్గరకు వచ్చిన వసంతా-మోహన్‌గార్ని బలాత్కరించినందుకు, నిన్ను అరెస్టు చేస్తున్నాం!"

"అన్యాయం!" రవి గొంతుచించుకు అరిచాడు.

"షటాప్! లాయరు మోహన్‌గారు, తన మిత్రుడి పాట రికార్డ్ చేసుకొని, మిత్రునితో ఇటుగా వస్తూ, లోపల స్త్రీ ఆర్తనాదం విన్నారు. తన మిత్రుణ్ని పోలీస్‌స్టేషన్‌కు పంపి, నీ మాటలు ఆయన రికార్డ్‌చేసారు. కనుక మర్యాదగా మా వెంట దయచెయ్!" ఇనస్పెక్టర్ కోపంగా అన్నాడు.

అన్నీ వింటున్న నాకు మతిపోతున్నట్లు అయింది.

రవి వెళ్ళిపోతూ, ఒకే ఒకసారి నా కళ్ళలోకి చూసి వెళ్ళిపోయాడు.

ఇనస్పెక్టర్. మోహన్‌కి థేంక్స్ చెప్పుకొని వెళ్ళిపోయాడు, టేప్‌రికార్డ్‌తో. మోహన్ మిత్రుడు వాళ్ళవెంటే నడిచాడు.

"వసూ! నీ స్వార్థం ఎందర్ని బలితీసుకొందో చూశావా?" మోహన్ మెల్లగా అన్నాడు.

కత్తిపోటు తిన్నదానిలా చూసాను.

"ఆ రోజు గౌరి చనిపోయినందుకు 'పార్టీ' అన్నపుడే నాలో అనుమానం వుదయించింది. అయినా నా మనసు నిన్ను దోషిగా ఎంచలేకపోయింది. కానీ ఈరోజు వుదయం నువ్వు స్నానానికి వెళ్ళాక రవి ఫోన్ చేసాడు. నువ్వే అనుకొని, వైట్‌సారీ కట్టుకు రమ్మని అన్నాడు. కొంచెం కష్టంమీద గొంతు మార్చి అలాగే అని ఫోన్ పెట్టేసాను.

"మీరిద్దరూ కల్సి ఏదో చేసారని వూహించి, టేప్ రికార్డ్‌తో నా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళి, వాడితో హాస్పిటల్‌కి కొద్ది దూరంలో కూర్చున్నాను. వాడి పాట టేప్ చేసాను. ఈలోగా నువ్వు హాస్పిటల్ వైపుగా వచ్చావు. వాడితో అటువైపుగావచ్చి లోపల అరుపువిన్నట్లు నటించి, వాడిని పోలీస్ స్టేషన్‌కి పంపించాను. నీకు సంబంధించినవి కాకుండా, రవికి సంబంధించినవి మాత్రమే టేప్‌చేసి, ఇనస్పెక్టర్‌కి అందించాను.

"వసూ! నీ స్వార్థం గౌరిని చంపింది. రవిని జైలుకి పంపింది" ఆయన ఆవేదనగా అంటుంటే, వినలేక పోయాను.

"అఁ, పద వసూ" అంటూ మోహన్ బయటకు నడిచాడు.

నేను షెల్ఫ్‌లో కన్పిస్తున్న 'ఎండ్రినాల్' సీసాతో అతని వెనుక నడిచాను.

చట్టందృష్టిలో నేను దోషిని కాకపోవచ్చు! కాని, నా భర్త దృష్టిలో దోషినే! నా శీలాన్ని ఎరగా చూపి నా స్వార్థాన్ని నెరవేర్చుకొన్న దానినే. ఈ నిజాన్ని మోహన్ తన గుండెల్లో భద్రంగా దాచుకొన్నా, నేను నిర్భయంగా వుండగలనా? అతనితో సుఖజీవనాన్ని సాగించగలనా?

నా భర్త పవిత్రంగా దక్కాలి అని గౌరిని చంపిం

చాను. మరి నేను హంతకురాలినని తెలిసినా అతను నన్ను రక్షించుకొన్నాడు.

రవిని దోషిగా నిలబెడతారు కోర్టులో. ఫలితం! రవి శిక్షను అనుభవిస్తాడు. కానీ అతన్ని హంతకుడిని చేసింది నా స్వార్ధం! నా స్వార్థం గౌరిని, రవిని బలితీసుకొంది.

నాకు ఏ కోర్టు శిక్ష వేయదు. పైగా అంతా నాపై సానుభూతిని చూపిస్తారు. రవిలాంటి రాక్షసుడి చేతిలో పడకుండా బయటపడ్డానని అంటారు. కాని....కాని.... మోహన్ హృదయంలో నా స్థానం ఏమిటి?

నేను ఇంటికి వెళ్ళాక, మోహన్‌తో తలనొప్పిగా వుందని చెప్పి, నా గదిలోకి వెళ్ళి తలుపులు వేసేసుకొన్నాను. 'ఎండ్రినాల్' మూత తెరచి, భగవంతుడిని ఒక సారి మనసారా ప్రార్ధించుకొన్నాను.

'ఎండ్రినాల్' త్రాగి భారంగా కళ్ళు మూసుకొన్నాను.□

"పేరు తెచ్చుకోవాలి!"

పోలీసు తన కొడుకుతో---

"బాబూ! నీవు తండ్రినిమించిన తనయుడుగా పేరు తెచ్చుకోవాలి. ఎలా తెచ్చుకుంటావో చెప్పూ!"

"ఏముంది నాన్నా! నీవు లంచం పుచ్చుకొనేటప్పుడు ఇన్‌స్పెక్టరుకు పట్టిస్తాను. అంతే!" అన్నాడు కొడుకు గొప్పగా.

—టి. యం. సత్యనారాయణరెడ్డి, కడప.

"కలలు కల్లలవుతాయా?"

ఏ. వీ. మోహన్రావు

రాత్రి పదకొండయింది.

సావిత్రమ్మ వీధిలోకి వెళ్ళి చూసింది భర్త సత్యమూర్తి కోసం. అతను వస్తున్న జాడ లేదు. ఇంత రాత్రయినా రాకుండా ఏం చేస్తున్నాడాని ఆలోచిస్తూ తిరిగి లోని కొచ్చింది.

హాల్లో వేసిన మంచాలమీద పెద్దపిల్లలు ముగ్గురూ అడ్డదిడ్డంగా పడి దొర్లుతున్నారు. మగవాళ్ళిద్దరూ మూడంకె వేసున్నారు. ఆడపిల్ల లంగా నడుము దాకా లేచిపోయింది. సావిత్రమ్మ లంగా క్రిందకు లాగి, దుప్పటి కప్పింది.

దేవుడిగదిలోకి వెళ్ళి, వరుసగా గోడకు తగిలించిన పటాలకు వంగి నమస్కరించింది. భర్త కేవిధమైన

ప్రమాదం రాకుండా క్షేమంగా ఇల్లు చేరాలని మనస్సులోనే అర్థించింది భగవంతుణ్ణి. ఆ తర్వాత మెల్లగా పడకగదిలోకి తిరిగొచ్చి మంచంపైన పడుకుంది.

లైటు వెలుగుతూనే వుంది. ఫాన్ గిర్రున తిరుగుతుంది.

సత్యమూర్తి గురించి ఆలోచించసాగింది సావిత్రమ్మ. సులభంగా డబ్బు సంపాదించడం అతనికి హాబీ. ఆ కారణంగా ఏవేవో దొంగ వ్యాపారాలు చేస్తున్నాడని గ్రహించింది. అతనెప్పుడూ తన వ్యాపార వివరాలు భార్యకు చెప్పడు.

అతని భాగస్తుడు భానుమూర్తి. లక్షాధికారి. రెండు సార్లు ఇంటికి వచ్చాడు.

ఈ మధ్య భర్త పరాకుగా వుండటం గమనించింది సావిత్రమ్మ. కాస్త ఆలస్యంగా ఇంటికి రావడం, అయినదానికీ కానిదానికీ పిల్లలపైన విరచుకుపడడం, అడిగిన ప్రతిదానికీ పెడసరంగా జవాబు చెప్పడం, అన్నీ కాస్త విచిత్రంగా కనిపించాయి సావిత్రమ్మకు. పగలంతా అలసిపోయి ఇంటికి వచ్చిన ప్రతి మగాడూ మనస్సు సరిగా లేకుంటే అలానే విసుక్కుంటాడులే అనుకొని తన్ను తాను సర్ది చెప్పుకొంది.

సావిత్రమ్మ తనకు తెలీకుండానే నిద్రలోకి జారిపోయింది....

బూట్ల చప్పుడు వినిపించి కళ్ళుతెరిచి చూసింది సావిత్రమ్మ. సత్యమూర్తి కోటువిప్పి, మంచంమీద వేస్తూ కనిపించాడు.

"మీరా!?" ఆశ్చర్యపోతూ లేచి కూచుంది సావిత్రమ్మ.

"అవును! నేనే! ఎందుకలా ఆశ్చర్యపోతున్నావ్?"

సావిత్రమ్మ మాట్లాడకుండా లేచి, భర్త దగ్గర కంటా వెళ్ళింది. రెండుచేతుల్తో అతని ఆకారాన్ని చేతుల్తో తడుము కొని చూసింది. అతని కళ్ళలోకి సూటిగా చూసింది.

"ఏవిటి సావిత్రీ! అలా పిచ్చిగా చూస్తున్నావ్? ఏమైంది?" అడిగాడు సత్యమూర్తి జేబులోంచి మడత పెట్టిన 'ఛైర్' తీసి టేబుల్‌పైకి గిరవాటువేస్తూ.

"నాకేం కాలేదు! బాగానే వున్నాను. మీకేం కాలేదు కదా?" అడిగింది ఆతృత, ఆరాటం, ఆశ్చర్యం ముప్పిరి గొన్న కంఠంతో.

"నాకేమవుతుంది? హాయిగా వున్నాను." అన్నాడు సత్యమూర్తి.

గోడకున్న గడియారం టంగు, టంగుమంటూ ఐదు సార్లు నిశ్శబ్దాన్ని బ్రద్దలుచేసింది.

"అప్పుడే ఐదయిందా?" అడిగింది సావిత్రమ్మ.

"గడియారం గంటలు కొట్టింది. వినిపించలేదా? లేకుంటే లైటు వెలుగుతూనే వుందిగా. చూసి తెల్సుకో రాదూ?" అన్నాడు విసుగ్గా కోటువిప్పుతూ.

"ఇంతదాకా ఏంచేస్తున్నారు?"

"వీధిలో డాన్సు చేస్తున్నాను."

"అదేం సమాధానమండీ?"

"మరింకేం చెప్పాలి! అవసరమైన పనిలేకుంటే అర్ధ రాత్రిపూట చలిలో తిరుగుతూ వుంటాననుకున్నావా?" అడి గాడు సత్యమూర్తి.

"అంత అవసరమైన పనేమిటండీ! తెల్లారాక చూసు కుంటే పోయేదిగా?" అడిగింది సావిత్రమ్మ.

"అవన్నీ నీకు అర్థంకావు. అనవసరంగా నీ పాడు ప్రశ్నలతో నన్ను విసిగించకు" అన్నాడు సత్యమూర్తి

లుంగీ కట్టుకుంటూ.

"పగలు మీరెంతసేపు తిరిగినా, ఎక్కడ తిరిగినా, ఎలా తిరిగినా నాకు పనిలేదు. కాని రాత్రిళ్ళు...."

"ఎవరితోనన్నా తిరుగుతున్నా ననుకుంటున్నావా

నువ్వు పతివ్రతా శిరోమణివి. అలా ఎవరితోనన్నా ధైర్యం చేసి తిరిగినా, నీకు తెలిస్తే, నువ్వుగనక శపించావంటే వాళ్ళ తలలు వెయ్యి ముక్కలై పగలవూ!" అన్నాడు సత్యమూర్తి.

"మీ వేళాకోళాలు ఎప్పుడూ వుండేవే....అసలు మీరు మీరేనా అని నాకు అనుమానంగా వుంది" అంది సావిత్రమ్మ.

"అదేమిటే! నన్ను దయ్యమనుకుంటున్నావా? కానే కాదు! అక్షరాలా సత్యమూర్తిని, నీ భర్తను" అన్నాడు.

"అదికాదండీ! రాత్రి నాకు కలవచ్చింది. అబ్బ తలచు కుంటేనే భయంగా వుంది" అంది సావిత్రమ్మ కళ్ళు మూసుకుని, చెవులు చేతుల్తో కప్పిపుచ్చుకుంటూ.

"ఎందుకే అంత భయం?"

"అలా వంటింట్లోకి వెళ్దాంరండి. కాపిని కాఫీ కలి పిస్తాను. తాగుదురుగానీ" అంటూ సావిత్రమ్మ నడిచింది.

సత్యమూర్తికూడా ఆమెను అనుసరించాడు.

"ఏమిటే నీ కల? సస్పెన్సుతో ప్రాణం తియ్యక చెప్పు" అన్నాడు డైనింగ్ టేబుల్ముందు కూర్చుంటూ.

"చెప్తానుండండి" అంటూ గ్యాస్‌స్టవ్ వెలిగించి, స్టీల్ గిన్నెతో నీళ్ళుపెట్టి వచ్చి ఎదురుగా కూర్చుంది.

"చెప్పవే త్వరగా!" అన్నాడు సత్యమూర్తి.

"రాత్రి మీకోసం పదకొండింటిదాకా ఎదురుచూశాను. ఆ తర్వాత ఓపికలేక, ఇంట్లోకొచ్చి మంచంపైన కూర్చు న్నాను. నాకు తెలీకుండానే నిద్రపోయాను. ఆ నిద్రలో కల ముంచుకొచ్చింది.

మీరూ మీ స్నేహితుడు భానుమూర్తి మాట్లాడుకుంటూ కనిపించారు. అతను మమ్మల్ని లెఖపుస్తకాలు చూపించ

మని అడిగాడు. అప్పుడుటయమ్, పదకొండున్నరయి నట్లుంది. మీరు ఇంకారాయవలసిన లెఖలు కొన్ని వున్నాయని చెప్పినట్లున్నారు. అతను మండిపడ్డాడు. ఇంతదాకా వ్యాపారం లాభంలో వుందా, నష్టంలో వుందాని అడిగాడు.

మీరు ఎటూ చెప్పలేక కిమ్మనున్నారు. రాసినవరకు లెఖలు చూస్తానని పట్టుపట్టాడు ఆయన. పుస్తకాలు ఇంట్లో వుంచానని చెప్పారు మీరు. అయితే వెళ్దాంపదమని లేచాడు. మీరూ విధిలేక వెంటనడిచారు.

మీ ఆఫీసు క్రింద కారు గారేజీ వుంది. ఆ గారేజిలోకి కారు అతి కష్టంపైన వెళ్తుంది. ఒకవేపు తలుపు సరిగ్గా తెరచేందుకూ్కడా స్థలంలేదు. మీ కారు సింగిల్ డోర్‌ది. భానుమూర్తి ముందు మిమ్మల్ని లోనికి వెళ్ళి తలుపు తెరచుకొని కూర్చోమన్నాడు. మీరువెళ్ళి తలువుతీసి ముందుసీటు మడిచిపెట్టి మెల్లిగా వెళ్ళి వెనకసీట్లో కూర్చున్నారు" అంటూ ఆగింది సావిత్రమ్మ.

"చెప్పు! వింటాను. నీవు కథలింత బాగా అల్లగలవని ఇప్పుడే తెలుసుకున్నాను" అన్నాడు సత్యమూర్తి.

"మీరు కూర్చోగానే సీటు ఎత్తి మామూలుగా వుంచారు. అప్పుడే మీ మెదడులో బహుశా పురుగు తొలచివుంటుంది. భానుమూర్తిని ఇంటికి తీసుకొచ్చినా, చూపించేందుకు లెఖ పుస్తకాలు మీ దగ్గరలేవు. కారణం మీరు అసలు వాటిని తెచ్చిపెట్టలేదు. అతనికి వాట్ని అడిగే అవకాశంగానీ, చూసే వీలుగాని లేకుండా చెయ్యాలనుకున్నారు. అందుకు మార్గం అతన్ని చంపడంతప్ప మీకు వేరే కనుపించలేదు! వెంటనే మెడకున్న సిల్కుపైట ముడివిప్పి చేతికి తీసుకున్నారు. రెండుకొసలు తీసుకొని ఒకదాంట్లో ఒకటి

దూ ముడివేసి, ఉచ్చులా తయారుచేసి, సీటు వెనకగా చేత్తో పట్టుకున్నారు.

అంతలో భానుమూర్తి వచ్చి తలుపు తెరచుకుని డ్రైవింగ్ వీల్ ముందు కూర్చున్నాడు. అతను కారుగేరు, సరిచేసుకొంటూండగా, చీకట్లో చేతిలో వున్న ఉచ్చును అతని మెడకేసి, రెండు కొసలు, రెండు చేతుల్తో పట్టుకుని బిగించి, బలమంతా వుపయోగించి లాగారు.

అనుకోని ప్రమాదానికి ఆశ్చర్యపోయిన మీ స్నేహితుడు భానుమూర్తి, తేరుకుని ప్రతిఘటించటానికి ప్రయత్నించే లోగా అతని ప్రాణాలు పంచభూతాల్లో కలసిపోయాయి. తల వాలిపోయింది....." సావిత్రమ్మ చెప్పటం ఆపి, స్టీల్ డ్రమ్‌లోంచి గ్లాసు నీళ్ళు ముంచుకొని త్రాగుతూ భర్తకేసి చూసింది.

సత్యమూర్తిలో వణుకు పుట్టుకొచ్చింది. తల క్రిందకు దించి, కనుకొనల్తో భార్యను గమనించాడు. భార్య తిరిగి చెప్పసాగింది.

"భానుమూర్తి శవాన్ని ప్రక్కకునెట్టి, సీటు పైకెత్తి మీరు క్రిందకు దిగారు. పొడవుపాటి తాడు తెచ్చి గారేజిలో కారు వెనకవైపు, పైనున్న కొయ్యదూలానికి బిగించారు. భానుమూర్తి సిల్కుటై విప్పారు. అతని మెడకున్న మీటై కూడా విప్పారు. రెండింటినీ జేబులో పెట్టుకొన్నారు.

భానుమూర్తి శవాన్ని మెల్లగా లాక్కొచ్చారు. తాడు సరిచేసి, జేబులోవున్న టైతీసి వ్రేలాడుతున్న తాడుకు కట్టారు. తర్వాత భానుమూర్తి శవాన్ని కూర్చొండబెట్టి అతని మెడకు ఆ టై కట్టారు. అతనికై అతనే ఆత్మహత్య చేసుకున్నట్లుగా సాక్ష్యాలు సృష్టించి, మీరు తిన్నగా

నడిచివస్తున్నారు...." అంటూ ఆగింది సావిత్రమ్మ.

సత్యమూర్తి మాటాపలుకు లేకుండా చూస్తూ కూర్చున్నాడు.

"ఏమిటండీ అలా అయిపోయారు?"

"నీకొచ్చిందా కలా? లేక నిజంగా నువ్వు రాత్రి మా ఆఫీసు దగ్గరకు నాకోసం వచ్చావాని ఆలోచిస్తూవున్నాను."

"ఏం మీరు హత్యచేసారా?" అడిగింది సావిత్రమ్మ భయంగా.

"లేదు."

"అయితే ఎందుకలా అడిగారు?"

"ఊరికే అడిగాను. నీ కల పూర్తయిందా ఇంకా వుందా?" అడిగాడు సత్యమూర్తి.

"లేదు. ఇంకా కొద్దిగావుంది" చెప్పింది సావిత్రమ్మ.

"కానీ పూర్తిచెయ్యి...."

"....అలా మీరు నడిచి వస్తూండగా, వెనుకవేపు నుండి చీకటిని చీల్చుకుంటూ హైడ్‌లైట్లు ధగధగ వెలుగుతుండగా, వచ్చి మీకు కాస్తముందుగా ఆగింది పోలీస్ జీప్. దాన్ని చూడగానే మీరు బిక్కచచ్చిపోయారు. బట్టలు చెమటతో తడిసిపోయాయి.

జీప్‌లోంచి ఇన్‌స్పెక్టర్ దిగాడు. అతనివెంట భానుమూర్తి కుమారుడున్నాడు. ఇన్‌స్పెక్టర్ మిమ్మల్ని భానుమూర్తిగారి గురించి అడిగారు. మీరు తెలీదన్నారు.

అర్ధరాత్రిపూట ఎక్కడ నుండి వస్తున్నారని మిమ్మల్నడిగారు ఇన్‌స్పెక్టర్. సినిమానుంచన్నారు.

గంట మూడయింది అప్పుడు. తన వాచీ మీకు చూపించి ఇంతదాకా సినిమా చూస్తునేవున్నారా అని అడిగాడు ఇన్‌స్పెక్టర్ మిమ్మల్ని. మీరు మాట్లాడలేదు.

అప్పుడు భానుమూర్తిగారబ్బాయి. మీ పాంటుకేసి చూసి, జేబులోంచి వెలికి వచ్చిన వైవు వాళ్ళనాన్నది లాగుందని చెప్పాడు. ఇన్‌స్పెక్టర్ దాన్ని లాగి హైడ్‌లైట్ వెలుగులో ఆ అబ్బాయికి కనుపించేలా పెట్టాడు. దాన్ని చూచి అది వాళ్ళ నాన్నదేనని దృఢంగా చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ మిమ్మల్ని జీపులో ఎక్కించుకుని, కారు గారేజి దగ్గిరకు తీసుకెళ్ళాడు. భానుమూర్తి మెడకు వ్రేలాడుతున్న వైవుని చూశారు. అది మీదేనని ధృవపడింది. మిమ్మల్ని అరెస్టుచేసి తీసికెళ్ళారు. కోర్టులో ప్రవేశ పెట్టారు. మీకు ఉరిశిక్ష పడింది...." అంటూ ఆగింది సావిత్రమ్మ.

సత్యమూర్తి కంగారుగా ముందుగదిలోకి పరుగెత్తి టేబుల్‌పై గిరవాటేసి నవైవు పట్టుకొని వచ్చాడు. అది భానుమూర్తిది.

"నీ కల తగలబడ! నిన్ను చంపితేగాని నా దరిద్రం తీరదు. నీకేదో దివ్యదృష్టి వున్నట్లుంది. నిన్ను యింకా బ్రతకనిస్తే, నన్ను ఉరితీయడం గూడ కలగనేలావున్నావ్" అంటూ ముందుకు దూకి సావిత్రమ్మ జుట్టుపట్టుకున్నాడు.

"వదలండి! వదలండి! నన్ను చంపకండి!" అంటూ అరచింది సావిత్రమ్మ.

పిల్లలు ముగ్గురూ అరుపులకు లేచొచ్చి తండ్రిని కాళ్ళూ చేతులూ పట్టుకున్నారు. వాళ్ళపట్టు వదలించుకుందామని పెనుగులాడాడు సత్యమూర్తి. కాని లాభం లేకపోయింది.

ఇంతలో బూట్లశబ్దం వినిపించింది. "సత్యమూర్తి గారూ! సత్యమూర్తిగారూ" అంటూ కేకలు వినవచ్చాయి.

ఇన్‌స్పెక్టర్ లోనికి వచ్చాడు. సత్యమూర్తిని చూచి విస్తుపోయాడు.

"మిమ్మల్ని అరెస్టు చేసేందుకు వచ్చాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"ఆయన అయితే భానుమూర్తిని చంపేశారా?" అడిగింది సావిత్రమ్మ ఇన్‌స్పెక్టర్‌ను.

"అవునమ్మా!" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

ఆ మాట వినగానే వెనక్కి విరుచుకుపడిపోయింది సావిత్రమ్మ. □□□

ఇంటర్వ్యూకొచ్చిన అస్తిపంజరం!

ఇంటర్వ్యూ చేస్తున్న అధికారి సర్టిఫికేట్సు చెక్ చేస్తూ "కమిన్" అన్నాడు.

అంతలో డోర్ తెరుచుకు లోన ప్రవేశించిన అస్తిపంజరాన్ని చూసి బెదిరిపోయి బెంచిక్రిందకు దూరిపోయాడు ఆ అధికారి.

ఆ అస్తిపంజరం "హీ...హీ...హీ..." అని నవ్వుతూ, మీ టేబుల్ మీద వున్న సర్టిఫికేట్లు నావేనండి! మీరు ఇంటర్వ్యూ చేస్తున్న మధుమూర్తిని నేనేనండి! ఉద్యోగం గురించి తిరిగి తిరిగి ఇలా అయ్యాను!" అన్నాడు.

—కాండ్రేగుల సదానంద, వల్లంపూడి.

పది రోజుల సమాధి!

రమణశ్రీ

నా వరకు నాకు నమ్మకానికి, మూఢనమ్మకానికి నక్కకూ నాగలోకానికీ వున్నంత వ్యత్యాసం వుందని నమ్మకం.

అయితే రాజారెడ్డి మాత్రం ఆ రెంటికీ మధ్య వ్యత్యాసం లేదంటాడు. ఒక వేళ వున్నా అది వ్యత్యాసం కాదు, బలీయమైన నమ్మకమే మూఢనమ్మకం.... అదే ప్రగాఢ నమ్మకం అంటాడు.

రాజారెడ్డి ఫిలాసఫీ ప్రొఫెసర్. నేను మామూలు ఎలిమెంటరీ స్కూలు పంతుల్ని. ఆతనితో ముఖాముఖీ వాదించలేను. కానీ పరోక్షంలో రాజారెడ్డి తరపు వకాల్తా కూడా నేనే పుచ్చుకొని గంటలు గంటలు మాట్లాడగలను.

అయితే ఒకటిమాత్రం నిజం! అపరిమితమైన వాదనా పటిమగల రాజారెడ్డిముందు నా మాటలు వీగిపోవచ్చు

నేమోగానీ, అవి పచ్చినిజాలని మాత్రం నాకు తెలుసు.

మూఢనమ్మకాల వూబిలో దిగబడిన జాతి ఎన్ని తరాలు గడిచినా ఆ వూబిలోంచి పైకి రాలేదు. నిన్నగాక మొన్న అవతరించిన దేశాలు సాంకేతికంగా వూహించలేని అభివృద్ధిని సాధించి వినూత్న మార్గాలద్వారా వినీలాకాశంలోకి చొచ్చుకుపోయి గ్రహాంతర గుట్టుమట్లన్నీ విప్పి చెబుతోంటే, మనవాళ్ళంతా చంద్రునిమీద కనబడే మచ్చను చూపించి 'అదిగో జింక, ఇదిగో లేడి' అంటూంటారు.

అయితే రాజారెడ్డి నా వాదనను నిశితంగా విమర్శిస్తాడు. ఇప్పటికీ పాశ్చాత్యదేశాలు అనుకరించేవి మన సిద్ధాంతాలేనంటాడు. వాళ్ళు పురోగమించే విజ్ఞాన శాస్త్రానికి పునాది మనవాదాలే అంటాడు.

'అంతెందుకు, వేలసంవత్సరాల క్రితమే, సంవత్సరం ముందుగా చంద్రగ్రహణమెప్పుడో, సూర్యగ్రహణమెప్పుడో మన పంచాంగవేత్తలు నిమిషాలతో సహా లెక్కలుగట్టి చెప్పేవారు. అది మాత్రం శాస్త్రీయ విజ్ఞానం కాదా అని ప్రశ్నించేవాడు.

అయితే ఇదంతా నేనెందుకు చెప్పుకొస్తున్నానంటే, శాస్త్రీయ పరిశోధనలయందు దిట్ట అయిన రాజారెడ్డి కూడా మూఢనమ్మకాలకు బానిస. అదే నాకు తల పగలగొట్టుకున్నా విడివడని ముడి.

రాజారెడ్డిదగ్గరనుండి ఈ రోజే లెటరొచ్చింది. 'గిరిపురం'కు ఓ స్వామీజీ వచ్చారట! 'ఆయన దర్శనం చేసుకోవాలి. నాలుగురోజులు సెలవుపెట్టి రెడీగావుండు అక్కడకు వస్తాను. ఇద్దరం కలసి వెళదాం' అని వ్రాశాడు.

రాజారెడ్డి నేను గిరిపురంలోనే పుట్టాము, పెరిగాము

మా స్వగ్రామం పేరునుబట్టి కుగ్రామం అనుకుంటారు. కానీ అది పల్లెకాదు, పెద్దపట్టణంకాదు. కాకపోతే చుట్టు పట్ల కుగ్రామాలకు చిన్న టౌనులాంటిది.

ముఖ్యముగా మా గ్రామంలో మోతుబరులైన రైతులు, బొజ్జలు పెంచిన షావుకార్లు చాలామంది వున్నారు. వాళ్ళు సంపాదించేది పాపపుసొమ్ము కాబట్టి దేముడుపేరు చెప్పి వాళ్ళను తినే దొంగభక్తులుకూడా కొందరున్నారు.

రాజారెడ్డి నమ్మినంతగా నేను సన్యాసుల్ని నమ్మకపోవ డానికి బలీయమైన కారణాలు చాలా వున్నాయి. అందులో ఒకటి. స్వయాన మా బంధువుల యింట్లో జరిగిన సంఘ టన మీ ముందు వుంచుతాను.

అత్తయ్య, మామయ్యలకు కాస్త దైవభీతి హెచ్చుగా వుండేది. పెద్దలు సంపాదించిపెట్టిన ఆస్థిలోనే తృణమో పణమో దానధర్మాలకు వినియోగిస్తూ కాలం గడుపుతుండే వారు.

ఒకరోజు ఒక సన్యాసి వాళ్ళయింటికి వచ్చాడు. అతను పూర్తిగా కాషాయబట్టలు ధరించివున్నాడు. జుట్టు జడలు కట్టి పాదాలవరకు వ్రేలాడుతోంది.

ఒక చేతిలో త్రిశూలం, మరోచేతిలో కమండలం. చంకలో జింకచర్మం. నుదుటన విభూతిరేఖలు. కాళ్ళకు పావుకోళ్ళు. సాక్షాత్తూ పరమేశ్వరుడే కైలాసంనుండి దిగి వచ్చి వీళ్ళను అనుగ్రహించడానికే వీరింటికి వచ్చాడా అన్న ట్లుగా వుంది.

దంపతులిద్దరూ వినయంగా ప్రణమిల్లారు.

'తాను కాలినడకన హిమాలయాలనుండి పర్యటిస్తూ, సంచారం ముగించుకొని తిరిగి బదరీనాథ్ వెళుతున్నాననీ మార్గమధ్యంలో విశ్రాంతికొరకై తానీ గ్రామానికి వచ్చానని

ఒక మూడురోజులపాటు తనకు ఆతిధ్యం కావాలని కోరాడు' స్వామీజీ.



దంపతులు ఆయన కోరికను ఆనందంగా ఆమోదించారు. ఆయనకు పాదపూజలు సల్పి ఘనంగా ఆతిధ్యమిచ్చారు.

మూడవరోజున స్వామీజీ ఫలహారంసేవిస్తూ "మీ ఆతిధ్యానికి ఎంతో సంతృప్తిపొందాను. మీకు ఓ మేలు చేయాలని అనుకొంటున్నాను" అన్నాడు.

"ఈశ్వరానుగ్రహం స్వామీ!" అన్నారిద్దరూ ముక్త కంఠంతో.

"మీ పూర్వీకులు లంకె బిందెలలో నిధిని నిక్షిప్తం చేశారు. ఆ లక్ష్మీకటాక్షం మీకింకా కలగలేదు కాబట్టి మీరా నిధిని కనుక్కో-లేకపోయారు. నేను చెబుతాను. కొద్దిపాటి శాంతముతో ఆ నిధిని స్వాధీనం చేసుకోండి" అన్నారు స్వామీజీ.

ఎంతో సంతోషించారు మా అత్తయ్య, మామయ్యలు.

స్వామీజీ తమ యింట అడుగుపెట్టిన వేళావిశేషమనుకొని ఆయనను పూలమాలలతో ముంచెత్తారు.

నిధికి అవసరమైన పూజాదికాలు నిర్వహించడానికి సన్నాహాలు ప్రారంభించారు. అవసరమైన కార్యక్రమాన్నంతా తమ నేతృత్వంలోనే జరిపించవలసిందని స్వామీజీని ప్రార్థించారు.

స్వామీజీ చిరునవ్వుతో తమ అంగీకారాన్ని తెలియపర్చారు.

చతుర్దశి దాటిన తర్వాత అమావాస్యనాడు అర్ధరాత్రి 12 గంటలకు లక్ష్మీప్రసన్నపూజ, దేవీ ఆవాహన, క్షుద్రశక్తుల తృప్తి నిమిత్తం జంతుబలి జరపవలెనని కార్యక్రమాన్ని రూపొందించారు.

రాత్రి పదకొండు గంటలకల్లా లేచి అభ్యంగస్నానాలు పూర్తిచేసి స్వామీజీ వేసిన ముగ్గుపై కూర్చున్నారు. సరిగ్గా పన్నెండు గంటలకు లక్ష్మీ ప్రసన్నపూజ సమాప్తమయింది.

స్వామీజీ దంపతులకు తీర్థప్రసాదాలు యిచ్చారు. ఆ

తరువాత దేవుని ఆవాహన చేయడంలో మునిగిపోయారు స్వామీజీ.

తీర్థప్రసాదాలు స్వీకరించిన మా అత్తయ్య మామయ్య లకు ఏదో తీయని మత్తు ఆవరించినట్లయింది. స్వామీజీ రైమిక్‌గా పఠిస్తున్న మంత్రాలు లయబద్ధంగా ఆలపిస్తూ కొద్ది నిమిషాలలోనే ఇద్దరూ తన్మయత్వంలో లీనమై పోయారు.

తెల్లవారుజామున నాలుగుగంటలకు తెలివివచ్చింది మా అత్తయ్యకు. చటుక్కున కళ్ళు తెరిచింది. ఎదురుగా స్వామీజీలేరు. ప్రక్కనే జోగుతున్న మామయ్యను కంగా రుగా లేపింది.

ఇంకేముంది, వందతులాల బంగారం, ఎనిమిదివేల రూపాయల రొఖ్ఖం స్వామీజీతోబాటే మాయమై పోయాయి.

అప్పటినుండీ స్వామీజీలంటే నాకు ఎలర్జీ! ఎవరికివారు ఆత్మను దైవంగా భావించి కొద్దిక్షణాలు భగవంతుడ్ని స్మరిస్తేచాలు! అంతే కానీ దైవాన్ని చేరుకోవాలనే తపనలో స్వామీజీల్లాంటి అడ్డదారులు తొక్కడం నా కసహ్యం.

ఏది ఏమైనా రాజారెడ్డి నా ప్రియమిత్రుడు కాబట్టి, అత నికి కంపెనీ ఇవ్వడంకోసమైనా గిరిపురం వెళ్ళక తప్పదు.

2

సరిగ్గా అనుకున్నప్రకారం రాజారెడ్డి వచ్చాడు.

"ఏరా! ఇంత చిక్కిపోయావ్?" ఆత్మీయంగా కౌగలించు కుంటూ అడిగాడు రాజారెడ్డి.

నవ్వాను నేను. అవును మరి! మేము కలుసుకొని రెండు సంవత్సరాలు అవుతుంది. ఆత్మీయుల కళ్ళకు ఎంత

బలిపినా చిక్కినట్లే కన్పిస్తామట!

"రాజూ, నే నెవర్నిరా? బ్రతకలేని బడిపంతుల్ని. బడి పంతులు బలిపివుండటం దేశానికి ప్రమాదంరా!" అన్నాను.

చెళ్ళున వీపుమీద చరిచాడు రాజారెడ్డి.

"ఇంకా నీ చమత్కారాలు తగ్గలేదన్నమాట! వె....వా!" అంటూ నా నవ్వుతో శ్రుతి కలిపాడు.

"గిరిపురం విశేషాలు ఏమిటి?" అడిగాను.

"ఏముందిరా! అంతా బాగానే వుంది. అప్పుడు మనం చదువుకున్న మిడిల్‌స్కూలును ఒక్కసారిగా జూనియర్ కాలేజీ చేస్తారట! ఎన్నికలొస్తున్నాయిగా మరి!" నవ్వాడు.

"మళ్ళీ గిరిపురానికి స్వాములవారి ప్రమాదం వచ్చినట్లుంది" అన్నాను ఓరగా రాజారెడ్డివైపు చూస్తూ.

చురుగ్గా నా వైపు చూశాడు రాజారెడ్డి.

"నీ జీవితంలో ఓ సంఘటన ఎదురయిందని, నీకు ఓ స్వానుభవం జరిగిందని మిగిలిన ప్రపంచాన్నంతా అదే దృష్టితో చూడకు-అంతటా మేడిపండ్ల మయంకాదు మిత్రమా! మన అనుభవం కాదు ముఖ్యం, ప్రపంచానుభవం ముఖ్యం."

"ఆల్‌రైట్ రాజూ! నీ వెనుక రావడమేకదా నీకు కావలపినది. ఓ.కె. లేచి స్నానం చేయి, వేడివేడి భోజనం తయారవుతోంది." అన్నాను. ఆ వాగ్ధాటిని ఆపలేకపోతే గిరిపురం బస్ దాటిపోతుందని అనుభవపూర్వకంగా తెలుసు నాకు.

రాజారెడ్డి మాట్లాడకుండా లేచి బాత్‌రూంలోకి నడిచాడు.

3

మేము గిరిపురం చేరేటప్పటికి పదిగంటలు దాటింది. సరాసరి రాజారెడ్డి వాళ్ళయింటికి వెళ్ళాము. రాజారెడ్డి

తండ్రి వెంకట్రామరెడ్డిగారు సాదరంగా ఆహ్వానించారు నన్ను. వెంకట్రామరెడ్డిగార్కి నేనంటే ఎంతో యిష్టం. పుట్టగానే తల్లిదండ్రుల్ని కోల్పోయిన వాడినవడంవలన కాబోలు నా మీద ఆయనకు జాలికూడా మెండుగానే వుండేది.

స్నానాదికాలు ముగించుకొని భోజనం పూర్తిచేసేటప్పటికి పదకొండుగంటలు కొట్టింది.

అప్పుడే రాజారెడ్డి స్వామీజీ గురించి ప్రస్తావించబోతే 'తెల్లవారిన తర్వాత మాట్లాడుకోవచ్చు. ముందు కాస్త ప్రయాణపు బడలిక తీర్చుకోండి.' అంటూ మందలించారు వెంకట్రామరెడ్డిగారు.

బాలభానుని ఉషఃకిరణాలు మా చెక్కిళ్ళకు గిలిగింతలు పెట్టేవరకు మెలుకువ రాలేదు మాకు. వెంటనే లేచి హడావుడిగా తయారయ్యాము. అప్పటికే వెంకట్రామరెడ్డిగారు పట్టుపీతాంబరాలు ధరించి మా కోసం రెడీగా వున్నారు.

స్వామీజీ రామాలయంలో మకాంచేసివున్నారు. మేము అక్కడకు వెళ్ళేసరికే జనం తీర్థప్రజలావున్నారు. భక్తులు వరుసలో నిల్చుండటానికి వీలుగా చెక్కలతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. బయట కొత్తగా పండ్లు, పూలదుకాణాలు కొబ్బరికాయల దుకాణాలు చాలా వెలిశాయి. దూరంగా ఓ రంగులరాట్నం కూడా బిగిస్తున్నారు.

రామాలయల చేరేసరికి స్వామిజీ గురించి చాలా వివరాలు చెప్పారు వెంకట్రామరెడ్డిగారు.

స్వామీజీ ఎక్కువగా మాట్లాడరట! ఆయన అనుగ్రహించిన వ్యక్తికే అన్ని విషయాలు చెబుతారట! ఆయన వచ్చిన తరువాత వారం రోజుల అనంతరమే ఆయన

దృష్టి రెడ్డిగారిమీద ప్రసరించిందట. రెడ్డిగారి కుటుంబ విషయాలన్నీ పూసగుచ్చినట్లు చెబుతుంటే రెడ్డగారికి పరమశివుడే కైలాసంనుండి దిగివచ్చాడా అనిపించిందట.

ఆ వూరికి పెద్దరెడ్డిగారు వెంకట్రామరెడ్డిగారే। అందుకే అంతా ఆయనను 'పెద్దరెడ్డిగారు'అని సంభోదిస్తుంటారు.

స్వామీజీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరిపించాలని పెద్దరెడ్డిగారు సంకల్పం వెలిబుచ్చారట। దానికి స్వామీజీ ప్రకటిస్తూ రామాలయం ప్రక్కనే వెంకటేశ్వరస్వామి ఆలయం నిర్మిస్తే బావుంటుందని సూచించారట. ప్రస్థుతం దాని తాలూకు విరాళాలు సేకరిస్తున్నారట।

రెడ్డిగార్ని చూడగానే భక్తులు 'పెద్దరెడ్డిగారు వచ్చారంటూ' ప్రక్కకు తొలిగి దారి యిచ్చారు. ముగ్గురం సరాసరి లోపలకు వెళ్ళాము.

ఆలయం మధ్యలో పద్మాసనం వేసుకొని కూర్చొని వున్నారు స్వామీజీ. కండలు తిరిగిన శరీరంతో పచ్చగా మెరిసిపోతున్నారు స్వామీజీ. జుత్తు తెల్లబడి జడలు కట్టుకుపోయింది. జానెడి పొడవున తెల్లటిగడ్డం మెరిసిపోతుంది.

"స్వామిజీ వయస్సు ఎంత వుంటుందంటావ్।" గొణిగాడు రాజారెడ్డి.

"ఆ తెల్లటి జుత్తును కనబడకుండా తీసివేస్తే పాతికేళ్ళ వయస్సంటే నమ్ముతారు" అన్నాను తడుముకోకుండా.

చిన్నగా నవ్వాడు రాజారెడ్డి.

"యు ఆర్ కరెక్టు. కానీ ఆ పాతికకు ముందు ఓ వంద తగిలించాలి" అన్నాడు.

నేను తెల్లబోతూ ఆయనవంక చూశాను.

అర్ధనిమీలతనేత్రాలతో భక్తులకు జ్ఞానోపదేశం చేస్తున్నారు స్వామీజీ.

"మనమంతా ఈ విశాలవిశ్వమనే ఎడారిలో అతి సూక్ష్మాతి సూక్ష్మమైన ఇసుకరేణువులం. విధి అనే గాలి నెటు వీస్తే అటు ఎగిరిపోయే మనకు ఒక అస్థిత్వమంటూ లేదు...." ధారగా కొనసాగుతోంది స్వామీజీ ప్రసంగం.

భక్తులంతా నిర్నిమేష నేత్రాలతో చూస్తూ ఆలకిస్తున్నారు స్వామీజీ ప్రసంగాన్ని. రాజారెడ్డివైపు చూశాను. అతను ఎప్పుడో ఆ ప్రసంగంలో లీనమైపోయి వున్నాడు.

"....మీరు ఏ రూపంలో కొలిచినా భగవంతుడొక్కడే। సృష్టిలయకారకుడైన భగవంతుని శక్త్యానుసారం స్మరించడం మీ కర్తవ్యం" అంటూ ముగించారు స్వామీజీ.

ఓ అరగంటలో దేవాలయమంతా కాళీ అయిపోయింది. స్వామీజీ, మేము ముగ్గురం మిగిలాము.

రెండు క్షణాలు కళ్ళు మూసుకొని తెరిచారు స్వామీజీ.

"నాయనా కృష్ణా, ఇలారా" నావంక చూస్తూ పిలిచారు.

ఆశ్చర్యంలో నా తలమునకలైపోయింది. అప్రయత్నంగా ఆయన వద్దకు నడిచాను.

"ఎలా వుంది నీ మాష్టరుగిరీ వుద్యోగం" అంటూ నా యోగక్షేమాలతో ప్రారంభించి "పదిమందికి విద్యాదాన మొనర్చిన నీ జన్మ చరితార్థమంటూ" ఉద్యోగంలో సాధక బాధలు చర్చించి "నీ నమ్మకం గొప్ప విలువైనది. మూఢ నమ్మకాలతో ఎవర్నీ విశ్వసించకు, నీ మనస్సు నమ్మినదాన్ని తప్పక ఆచరించమంటూ" ముగించారు.

నేను విస్మయంనుండి తేరుకోకుండానే అప్రయత్నంగా స్వామీజీ పాదాలను తాకి దూరంగా వెళ్ళి కూర్చున్నాను.

ఎంతో అభిమానంతో వచ్చిన రాజారెడ్డిని పలుకరించ లేదు. అయితే పెదరెడ్డిగారితో "నీ కుమారుడు నీకు త్వరలో మనమడ్ని ఇవ్వగలడని" చెప్పారు.

జరిగిన యీ ప్రత్యక్షానుభవానికి అనిర్వచనీయమైన అనుభూతిని పొందిన నా మనస్సు మరే విషయంగురించి ఆలోచించలేక పోతోంది. తదేకంగా స్వామీజీని చూస్తూ కూర్చున్నాను.

"స్వామీజీ, ఆలయ నిర్మాణానికి మీ ఆశీర్వాద బలం వల్ల ఇప్పటికి లక్షరూపాయలు సేకరించాము. మీరు స్వీకరించి అనుజ్ఞ ఇస్తే మీ నేతృత్వంలో ఆలయ నిర్మాణం ఆరంభిస్తాము" వినయంగా అన్నారు రెడ్డిగారు.

మళ్ళీ రెండు క్షణాలు కళ్ళు మూసుకొని తెరిచారు స్వామీజీ. ఇప్పుడాయన వదనంలో దివ్యతేజస్సు తాండవిస్తోంది.

"రెడ్డీ. ఇంకా దైవాజ్ఞ కాలేదు. ఈలోగా నేను చేయవలసిన కార్యం ఒకటుంది. దైవప్రసన్నం కొరకు నేను పదిరోజులు సమాధిలోకి వెళ్ళిరావాలి. అందుకు ఏర్పాట్లు చేయండి" అన్నారు స్వామీజీ.

"సమాధిలోపలకా!" ఆశ్చర్యంగా అడిగారు పెదరెడ్డిగారు. మేమూ ఆశ్చర్యంగా చూశాం.

"అవును. దాదాపు 20 అడుగుల లోతులో 4 × 8 అడుగులు ఉండేటట్లుగా ఓ గది నిర్మించండి. నేను వచ్చి ఏకాదశిరోజున సమాధిప్రవేశం చేస్తాను. అనంతరం ప్రవేశ ద్వారాన్ని రాతిపలకతో కప్పివేసి సిమెంట్‌తో తాపడంచేసేయండి. నేను సరిగ్గా మళ్ళీ పంచమిరోజుకు సిద్ధిపొంది సమాధిని చీల్చుకొని వెలుపలకు వస్తాను. అప్పటికి నేను సూచించిన స్థలములో వెంకటేశ్వరస్వామి పద్మావతీ సమేతంగా అవతరిస్తాడు" వివరించారు స్వామీజీ.

అది విని మేము ఆశ్చర్యచకితులమయ్యాము. ఓ మహత్తర సంఘటనను చూడబోతున్నందులకు గర్వించాము.

"అలాగే స్వామీజీ" గొంతు పెగల్చుకొని అన్నారు రెడ్డిగారు.

ఆ తరువాత ఓ పది నిమిషాలు లోకాభిరామాయణం మాట్లాడుకున్నారు స్వామీజీ, రెడ్డిగారూ కలసి. ఆ చర్చలో గూడా వర్తమానకాల పరిస్థితులపై స్వామీజీ చేసిన వ్యాఖ్యలు నన్ను ఆయనకు మరింత చేరువచేశాయి.

అంతా స్వామీజీ దగ్గర సెలవు తీసుకొని యింటికి బయలుదేరాము.

4

స్వామీజీకి సమాధి నిర్మాణం పూర్తయింది.

స్వామీజీ సమాధి ప్రవేశవార్త ప్రజలలో తీవ్ర సంచలమే తెచ్చిందని చెప్పక తప్పదు.

ఏకాదశినాటికి ప్రజలు తండోపతండాలుగా వచ్చారు. ఆ స్థలం పెద్ద తీర్థస్థలి అయిపోయింది. కానుకలతో డిబ్బెనలు నిండుతున్నాయి.

అక్కడి యువ కార్యకర్తల బృందానికి మేమే నాయకులము. నాకు యీ సంఘటన అనిర్వచనీయమైన గొప్ప అనుభూతిని కలిగిస్తోంది. నిజమే! అతీంద్రియ శక్తులు సిద్ధించినవారు కొద్దిమందైనా వుండబట్టే కాలం యీ విధంగానన్నా వుంది.

మా సెలవు మరో పదిహేనురోజులు పొడిగించమంటూ టెలిగ్రామ్స్ యిచ్చాము.

అనుకున్నప్రకారం ముహూర్తమునకు స్వామీజీ విప్రుల వేదఘోషమధ్య, భక్తుల జయజయ ధ్వానాల మధ్య సమాధి ప్రవేశంచేశారు. సమాధిలో ప్రవేశించబోతూ అందరికీ ఆయన దివ్యతేజస్సుతో ఆశీర్వచనములు

అందచేశారు.

ఆయన కనులలో కన్పించిన కాంతి పుంజములు మాలో ఆధ్యాత్మిక చింతను మరింత పెంచాయి.

మాకు ఆయన చివరిసారిగా యిచ్చిన ఆజ్ఞప్రకారం సమాధి ద్వారాన్ని రాతిపలకతో మూసివేసి సిమెంట్‌తో తాపడం చేయించాము.

ఇక స్వామీజీ దీక్ష పూర్తయ్యేవరకు మా నామస్మరణ కార్యక్రమం నిరంతరం కొనసాగవలసినదే. అందుకు తగిన ఏర్పాట్లు ముందే చేయబడ్డాయి. ఈ పదిరోజులూ రాత్రింబవళ్ళు నామస్మరణ నిరంతరం చేయడానికి భక్తులు బృందాలుగా ఏర్పడ్డారు.

దైవ నామస్మరణలో పదిరోజులూ పదిక్షణాల్లా గడచి పోయాయి.

పంచమి వచ్చింది. ఆరోజే స్వామీజీ సమాధిని చీల్చుకొని బయటకురావాలి. మళ్ళీ జనమంతా తరలివచ్చారు. అంతా నామస్మరణచేస్తూ ఉత్కంఠతతో ఎదురుచూస్తున్నారు. ఏక్షణంలో భూ నభోంతరాళాలు దద్దరిల్లే శబ్దం వస్తుందా, దివ్య తేజస్సుతో స్వామీజీ సమాధిని చీల్చుకొని వెలుపలకు వస్తారో అని వేయికళ్ళతో ఎదురు చూడసాగాము.

పంచమి గడిచింది, షష్టి వచ్చింది. మా నిరీక్షణలో మార్పురాలేదు. షష్టి వెళ్ళి సప్తమి వచ్చింది. అప్పటికి మాలో చలనం వచ్చింది.

"ఏంజరిగింది? స్వామీజీ చెప్పినట్లు ఎందుకు జరగ లేదు?" గుసగుసలతో స్థలమంతా అట్టుడికిపోతోంది.

'ఏమన్నా మోసం జరిగిందా?' అకస్మికంగా నాలో అనుమానం పెనుభూతమై కూర్చొంది. మెల్లగా పెదరెడ్డి

గారికి, రాజారెడ్డికి చెప్పాను.

చాలా తర్జన భర్జనలు జరిగినపిదప సమాధిని పగుల గొట్టడానికి తీర్మానించాము.

నిమిషాలలో సమాధి ద్వారం బ్రద్దలుచేశాము.

సమాధిలో తొంగిచూపిన మేము కొద్దిక్షణాలు అప్రతిభుల మయ్యాము.

లోపల స్వామీజీ శవం కుళ్ళిపోయి చూడటానికి భయంకరమైన స్థితిలోవుంది.

స్వామీజీ నిర్యాణానికి అంతా చింతించడం ప్రారంభించారు.

స్వామీజీ శవం ప్రక్కనే పడివున్న ఓ కాగితం నా దృష్టిని ఆకర్షించింది. చటుక్కున ఆ కాగితంతీశాను. ప్రజలంతా నన్నూ. ఆ కాగితాన్ని మార్చి మార్చి చూడసాగారు.

మడతలువిప్పి ఆ కాగితాన్ని బిగ్గరగా చదివాను.

"భక్తాగ్రణ్యులైన పురప్రముఖులకు అభాగ్యుడు వ్రాసుకున్న విన్నపము—

మానవసేవయే మాధవసేవ అన్నారు ఒకప్పుడు. కానీ నేడిప్పుడు మాధవసేవ సాటిమానవుడ్ని షేవ్ చేయడానికే చేయబడుతుంది. నేను మీతోటి మానవుడ్ని, పేద కులస్థుడిని, బీదవాడిని. నాపేరు శంకర్రావ్. మీ వూరిలోని సావిత్రమ్మ కొడుకుని.

అతి కష్టంమీద పూటకూళ్ళతో, రోజుల ఉపవాసాలతో బి.ఎ. పూర్తయిందనిపించాను. పట్టా ఒకచేత, పొట్ట ఒకచేత పట్టుకొని ప్రపంచంలోనికి బయలుదేరాను. పట్టానుచూపి జాలిపడేవారేగానీ, పొట్టకు పట్టెడన్న పెట్టే వారు కన్పించలేదు.

ఉన్న వూరిలోనైనా ఆశ్రయం దొరక్కపోతుందా అని కొండంత ఆశతో వచ్చాను. కిళ్ళీషాపు పెట్టుకొన డానికైనా తలా ఒకచెయ్యి వెయ్యమన్నాను. ఒక వ్యక్తికి ఉపాధి చూపించి పుణ్యం కట్టుకోమన్నాను. ససేమిరా వీల్లేదన్నారు.

అందుకే అవతారం ఎత్తాను. ప్రజలు ఎక్కడ డబ్బులు కురిపిస్తారో తెలుసుకున్నాను. సంపాదించాను.

కానీ ఇది కష్టార్జితంకాదని నాకూ తెలుసు. అందుకే యీ అక్రమ సంపాదనతో మనసున్న నేను మనుగడ సాగించలేను. జీవచ్ఛవంలా బ్రతకలేను.

కానీ బ్రతికుండగా కుటుంబానికి పట్టెడన్నం కూడా పెట్టలేకపోయినా, నా కుటుంబానికి చచ్చిపోతూ సహాయం చేసిపోతున్నాను.

ఇలాంటిపని మరో విద్యావంతుడుచేసే పరిస్థితిరాకుండా కనీసం యీ గ్రామంలో, ఏ గ్రామానికి ఆ గ్రామంలో పెద్దలు నిశ్చయించుకొన్ననాడు మనదేశం నిజంగా రత్న గర్భమవుతుంది.

శెలవ్,
శంకర్రావ్."

ఉత్తరం ముగించేసరికి ఎవరి వదనంలోనూ కత్తి వాటుకు నెత్తురు చుక్కలేదు.

* * *

శంకర్రావ్ ఎంతమంది కళ్ళు తెరిపించాడు!

మళ్ళీ మూడేళ్ళ తరువాత రాజారెడ్డి, నేనూ గిరిపురం వచ్చినప్పుడు "ఒరేయ్ అబ్బాయ్, మనూరిలో నిరుద్యోగి

అంటూ ఎవరూ ఉండకూడదనుకున్నాంరా! ఉద్యోగంరాని వ్యక్తికి ఉన్నవాళ్ళంతా కలిపి తలో చెయ్యివేసి ఏదో ఉపాధి చూపిస్తున్నామురా" అన్నారు పెద్దరెడ్డిగారు నిండుగా నవ్వుతూ.

నా మదిలో శంకర్రావ్ రూపం లీలగా మెరిసి మాయమైంది. □□□

★

కొత్త సైకిలు!

"పాత సైకిల్ కొన్నానని లెటర్ వ్రాసియుంటివి. సైకిల్ కొత్తగా ఉందే?"

"కొన్నది పాతదే. అక్కడనుండి ఇక్కడకు వచ్చేలోపుల ఊడిపోయిన పార్ట్సును కొత్తవి వేసా. అంతే!"

—కె. నాగభూషణ, దేవనహళ్ళి.

మాయమైన బ్లూప్రింట్స్!

ఎల్. రామగోపాల్

కుర్చీలో కూర్చొని, త్రిపాఠివైపు చూశాను. యాభై ఏళ్ళుంటాయి. బట్టతల, రిమ్‌లెస్ కళ్ళజోడు, ఎర్రటి శరీరం. సన్నగా రివటలా వుంటాడు.

ఢిల్లీలోని 'అటామిక్ రీసెర్చి సెంటర్'కు డైరెక్టర్ త్రిపాఠి. త్రిపాఠితో నాకు ఆరు సంవత్సరాల పరిచయం ఉంది.

"మిస్టర్ హరగోపాల్!" పైపు వెల్గించి గంభీరంగా అన్నాడు త్రిపాఠి.

"మీతో అత్యవసరమైన పని వుండి వెంటనే పిలిపించ వలసి వచ్చింది. మీకు ఇప్పుడు అప్పగించబోయే కేసు చాలా విచిత్రమైనది. ఇందులో మీరు చేయవలసింది చాల తక్కువ. కేసు విషయంలో మీకు రొటీన్‌గా కావల

సిన సమాచారం అంతా సేకరించిపెట్టాం. మీరు చేయ వలసిందల్లా ఒక్కటే! ఆ ఆధారాలతో నేరస్థుడెవరో పట్టు కోవాలి. మా డిపార్టుమెంటు ప్రయత్నించి, ప్రయోజనం లేక మిమ్మల్ని పిలిపించవలసివచ్చింది...." చెప్పటం ఆపి నా మొహంలోకి చూశాడు.

"అసలు విషయం ఏమిటో చెప్పండి!" కుర్చీలో వెనక్కు వాలుతూ అడిగాను.

"చెబుతాను, మీకు కేసు గురించి చెప్పేముందు, మా 'రీసెర్చి సెంటర్' గురించి చెప్పవలసింది చాలా వుంది" అంటూ కాలింగ్‌బెల్ నొక్కి ప్యూన్ రాగానే కాఫీకి ఆర్డరిచ్చి చెప్పడం ప్రారంభించాడు.

" 'అటామిక్ రీసెర్చి సెంటర్' అంటే ప్రతి ఒక్కరికి తెల్సు. డిఫెన్స్‌లో అతి ముఖ్యమైన భాగం అని. అన్ని డిఫెన్స్ విభాగాల్లోలాగే, ఇక్కడకూడా సెక్యూరిటీ మెషర్‌మెంట్స్ చాల స్ట్రిక్టుగా ఉంటాయి. ఇక్కడ పని చేసే ప్రతి వ్యక్తికి ప్రత్యేకమైన క్వార్టర్స్ యివ్వబడతాయి.

ఎవరైనా మా ఫ్యాక్టరీ లిమిట్స్ దాటి వెళ్ళాలంటే, ముందుగా సెక్యూరిటీ కౌన్సిల్‌కు తెలియపర్చి వారి అనుమతి పొందాలి. అంటే సామాన్యంగా ఎవరూ బయటకు వెళ్ళకూడదన్నమాట. వాళ్ళకు కావలసిన నిత్యావసర వస్తువులు మొదలు, అన్నిరకాల ఎంటర్‌టైన్‌మెంట్సు ఇక్కడ లభిస్తాయి.

అందువల్ల బయటకుపోయే అవసరం ఎవరికి సామాన్యంగా కలుగదు. ఒకవేళ యెవరైనా అలా వెళ్ళవలసివస్తే అతనిమీద గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం.

ఇకపోతే, మా రీసెర్చ్‌సెంటర్‌లో దాదాపు పది 'మూవీ కెమెరాలు' ఉన్నాయి. ముడిఫిలిమ్ మాకు ప్రభుత్వం అందజేస్తుంది. ఇవన్నీ ఎందుకంటే—సామాన్యంగా ఈ రీసెర్చిసెంటర్‌లో ప్రయోగాలు చేసేటప్పుడు ప్రేలుళ్ళు, ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి.

అందువల్ల ప్రతి డివిజన్‌లో ఎక్స్‌పెరిమెంట్ మొదలు పెట్టగానే మూవీ కెమెరా ఆన్‌చేసి వాళ్ళు దూరంగా వచ్చేస్తారు. ఆ తర్వాత నిర్ణీతమైన సమయం కాగానే వెళ్ళి, ఫిలిమ్ ప్రొజెక్టు జేసి ఆ ఎక్స్‌పెరిమెంట్‌లో జరిగిన రసాయనిక చర్యలు తెలుసుకొని, దానికి సంబంధించిన మిగతా స్టెప్స్ తీసుకుంటారు...."

చెప్పడం ఆపి, ఆరిపోయిన పైప్ తిరిగి వెల్గించుకున్నాడు.

ఇంతలో కాఫీలు వచ్చాయి. కాఫీ త్రాగి సిగరెట్ వెల్గించి, త్రిపాఠివైపు చూశాను ఆసక్తిగా.

"ఈ రీసెర్చిసెంటర్ని మరింత అభివృద్ధిపరచాలనే ఉద్దేశ్యంతో, కొన్ని పద్ధతులు ప్రపోజ్ చేశాను ప్రభుత్వానికి. ప్రభుత్వంకూడా అందుకు అంగీకరించి, ఈ సెంటర్ తాలూకు 'బ్లూప్రింట్స్' పంపవలసిందిగా కోరుతూ, వాటిని పరిశీలించినమీదట తమ నిర్ణయం తెలియపర్చగలమని చెప్పారు.

మేము బ్లూప్రింట్స్ కాగితాల రూపంలో ఉంచం ఎందుకంటే, అవి సులభంగా శతృవుల హస్తగతమయ్యే ప్రమాదం వుంది. అందుకనే వాటిని మైక్రోఫిలిం రూపంతో భద్రపరిచాం....

ఆ బ్లూప్రింట్స్ రేపు ప్రధానికి అందజేయవలసి ఉంది. కాని, అవి ఈ రోజు మాయమయ్యాయి.

ఆశ్చర్యపోయాను.

"అవును. అవి ఈరోజు సాయంత్రమే మాయమయ్యాయి. వెంటనే తగిన జాగ్రత్తలు తీసుకున్నాను."

అని డ్రాయరు సొరుగులోంచి కొన్ని ఫైల్సు తీసి టేబిలు మీద పెట్టాడు.

ఆ బ్లూప్రింట్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీకాంత్ కస్టడీలో ఉంటాయి. అతను వున్న ఆఫీసుగదిలో అతను కాక మరో ముగ్గురు సీనియర్ ఎక్జిక్యూటివ్స్ ఉంటారు" అంటూ ఒక ఫైలు తీశాడు.

"ఇతను జైపాల్‌సింగ్! బెంగాలీ! నలభై ఏళ్ళుంటాయి. బ్రహ్మచారి. మోస్ట్‌సీనియర్ ఎక్జిక్యూటివ్. మంచివాడు, నెమ్మదస్తుడు అనే పేరు ఉంది" అన్నాడు ఫైలు నా ముందుకు నెడుతూ.

మొదటి పేజీలో జైపాల్‌సింగ్ ఫొటో ఉంది. బస్ట్ సైజ్ ఫొటో అది. రింగులు తిరిగిన జుట్టు. విశాలమైన నుదురు. తేనెరంగు కళ్లు. గుబురు మీసాలు. ఆకర్షనీయంగా వున్నాడు.

"ఇతను రామశర్మ! హి యీజ్ ఫ్రం ఆంధ్రా! ముప్ఫై ఏళ్లుంటాయి. ఇతనికీ పెళ్ళి కాలేదు. మనిషి తెలివికలవాడే కాని, యెప్పుడూ ఏదో దిగులుగా, పెసిమిస్ట్‌గా కనిపిస్తాడు."

అతని ఫొటో చూచాను. సాఫీగా పైకి దువ్విన జుట్టు, చిన్నచిన్న కళ్ళు, సన్నటి పొడుగాటి ముక్కు, కోల మొహం....సాధారణంగా వున్నాడు.

"ఈమె మిస్ లీనా! పాతికేళ్లుంటాయి. జన్మస్థలం బొంబాయి. ఏక్టివ్ అండ్ హాండ్‌సమ్ గర్ల్!" ఫొటో నా ముందుకు నెట్టాడు.

ఆమె పెద్ద అందగత్తెకాదు. అయినా ఏదో ఆకర్షణ ఉంది ఆ మొహంలో. బాబ్డు హెయిర్, చిలిపి కళ్లు, చిరునవ్వు పెదాలు....చూచేకొద్దీ ఆకర్షణ పెరుగుతుంది.

ఫైల్సు లోపల పెట్టేసి, బెల్ నొక్కాడు త్రిపాఠి. ప్యూన్ లోపలికి వచ్చాడు. "శ్రీకాంత్‌గార్ని పిలుచుకురా!" ఆజ్ఞాపించాడు.

"మీకేదైనా అవసరం ఉంటుందని, అతన్ని ఆఫీసులోనే ఉండమన్నాను!" చెప్పాడు.

రెండు నిముషాల తర్వాత శ్రీకాంత్ గదిలోకి అడుగు పెట్టి, విష్‌చేసి, ఒక కుర్చీలో కూర్చున్నాడు.

"మిస్టర్ శ్రీకాంత్! ఈరోజు జరిగిందేమిటో వీరికి వివరంగా చెప్పండి!" అన్నాడు త్రిపాఠి వైపు వెల్గించుకోవటంలో మునిగిపోతూ.

శ్రీకాంత్ నిట్టూర్చి, "ఈరోజు ఉదయం మామూలుగా ఆఫీసు రాగానే, నా సేఫ్టీలాకర్ తెరిచినప్పుడు బ్లూప్రింట్స్ అందులో ఉన్నాయి. రేపు ఉదయం వాటిని ప్రధాన మంత్రికి అందజేయాలనే విషయం మరోసారి గుర్తుచేసుకున్నాను.

సాయంత్రం అయిదుగంటలకల్లా అందరూ వెళ్ళిపోతారు. ఆరుగంటలకు మళ్ళీ సెకండ్‌షిఫ్ట్‌వాళ్ళు వస్తారు. నాల్గుగంటల ప్రాంతంలో కాఫీ త్రాగి ఏవో కాగితాలకోసం సేఫ్టీ లాకర్ తెరిచాను. అందులో 'బ్లూప్రింట్స్ లేవు.

మరచిపోయి యెక్కడైనా పెట్టానేమోనని, నా టేబుల్ సొరుగులన్నీ లాగి వెదికాను. దొరకలేదు. వెంటనే ఈ విషయం డైరెక్టరుగార్కి తెలియపర్చాను" చెప్పడం ఆపి త్రిపాఠివైపు చూశాడు శ్రీకాంత్.

త్రిపాఠి తల ఊపి, "ఎస్! హి రిపోర్టెడ్ టు మి! మిస్టర్ హరగోపాల్! ఆ బ్లూప్రింట్స్ మాయం చెయ్యడానికి ముగ్గురికే అవకాశం ఉంది. వాళ్ళు జైపాల్‌సింగ్, రామశర్మ అండ్ లీనా! వీళ్ళు తప్పించి మరెవ్వరూ ఆ

గదిలోకి రారు. కాబట్టి ఆ ముగ్గుర్లో ఎవరో ఈ దొంగతనం చేసివుండాలి!" అన్నాడు త్రిపాఠి.

మౌనంగా తలూపాను.

"అతను నాకు చెప్పినదాన్నిబట్టి, వాళ్ళ ముగ్గుర్లో ప్రతి ఒక్కరూ, ఒకటి రెండుసార్లు సేఫ్టీలాకర్ దగ్గరకు వెళ్ళారు. అయితే అవి ఎలా మాయమయ్యాయన్నది ప్రశ్న కాదు. ఇప్పుడవి వచ్చే మార్గం చూడాలి!" చెప్పాడు త్రిపాఠి.

"మీ రేవో విషయాలు సేకరించామన్నారు!" అడిగాను.

"ఎస్! అదే చెప్పబోతున్నాను. 'బ్లూ ప్రింట్స్' పోయిన సంగతి శ్రీకాంత్ నాకు చెప్పగానే నేను కొన్ని ఏర్పాట్లు చేశాను. ఈ విషయంలో ఎవర్నీ అనుమానించి బెదిరించి నిజం రాబట్టలేం! అంతేకాదు, ఒకవేళ వాళ్ళు నిర్దోషులయితే ఒక ఎఫిషియంట్ ఈ సెంటర్ని వదిలేసే ప్రమాదం వుంది. అందుకే నేనో ఏర్పాటు చేశాను.

మనం అనుమానించాల్సింది ఆ ముగ్గుర్నే కనుక, వెంటనే మూడు మూవీకెమెరాలు తెప్పించి, వాళ్ళు క్వార్టర్స్‌కు వెళ్ళేలోగా, వారి వారి క్వార్టర్స్‌లో రహస్యంగా ఫిక్స్ చేయించాను. అయితే అనుకోకుండా ఫిలిం కొరతవల్ల, ఒక్కొక్కరికి పద్దెనిమిది నిమిషాల ఫిలింకంటె ఎక్కువ కేటాయించలేకపోయాం. అంతేకాదు, మైక్రోఫోన్స్ అమర్చి, వారి మాటలు రికార్డు చెయ్యగలిగాం.

నా అనుమానం ప్రకారం వాళ్ళల్లో ఎవరైనా అవి దొంగిలించి వుంటే క్వార్టర్స్‌కు పోగానే వెంటనే వాటిని దాచే ప్రయత్నమో, లేక ఇంకెవరికైనా అందించే ప్రయత్నమో చేస్తారని ఊహించాను. కాని...."

"ఊఁ కానీ...."

"వాటివల్ల ఎలాంటి ప్రయోజనం కన్పించేలా లేదు. కాని ఎందుకనో. మేము ప్రొజెక్టు చేసిన ఫిల్ములోగాని, టేప్ చేసిన మాటల్లోగాని ఎక్కడో 'క్లూ' ఇమిడి వుందని నాకనిపిస్తుంది. అదేమిటో ఎంత ప్రయత్నించినా అర్థం కాలేదు. అందుకే మిమ్మల్ని పిలిపించాను."

త్రిపాఠి లేచివెళ్ళి గదిలో లైట్లార్పి పక్కనే స్టాండు మీద ప్రొజెక్టర్ ఆన్ చేస్తూ "ఫిలిం ప్రొజెక్టుచేస్తూ, టేప్ విన్పిస్తాను. మీకేదైనా క్లూ దొరుకుతుందేమో చూడండి" అన్నాడు.

సిగరెట్ వెలిగించి ఆసక్తిగా చూడసాగాను.

2

జైపాల్‌సింగ్ గదిలోకి వచ్చాడు.

ఒక్క క్షణం కుర్చీలో కూర్చొని సిగరెట్ వెల్గించి, లేచి నిలబడి షర్టు విప్పి హేంగర్‌కు తగిలించాడు. తెల్లటి ఛాతీమీద నల్లటి వెంట్రుకలు విచిత్రంగా మెరుస్తున్నాయి.

నిముషం తర్వాత తలుపులు గడియపెట్టి వచ్చి, పాంటు విప్పి హేంగర్‌కు తగిలించాడు. అతనిప్పుడు కేవలం కట్ డ్రాయరు మీద వున్నాడు. కెమెరా ఏంగిల్ సరిగాలేక పోవడంవల్ల మోకాళ్ళవరకే కన్పిస్తుంది

కెమెరా మూవ్‌కావడంవల్ల జైపాల్‌సింగ్ మరుగయ్యాడు. చిన్న గది కన్పిస్తుంది ఇప్పుడు. బాత్‌రూం అయివుండాలి. టేప్‌లోంచి లీలగా కూనిరాగం విన్పిస్తుంది.

కొద్దిసేపటి తర్వాత మళ్ళీ జైపాల్‌సింగ్ కన్పించాడు.

గదిలో పచార్లు చేస్తూ, చిటికలు వేస్తూ కూనిరాగాలు తీస్తు న్నాడు. అప్పుడప్పుడూ తల విచిత్రంగా తిప్పుతూ, వింతగా నవ్వుతున్నాడు. అతని వాలకం చూస్తే ఎవరి కైనా అన్పిస్తుంది అతనికి పిచ్చి పట్టిందేమో అని.

చటుక్కున అతను స్టాండ్ మీద టవల్ అందుకొని బాత్ రూంలోకి నడిచాడు. కొద్ది సెకండ్లు గదంతా బోసిగా కన్పించింది.

కెమెరా ఏంగిల్ మళ్ళీ బాత్ రూంలోకి తిరిగింది.

తల విచిత్రంగా వూపుతూ, డాన్స్ చేస్తున్నట్లుగా షవర్ క్రింద స్నానం చేస్తున్నాడు జైపాల్ సింగ్. క్షణం తర్వాత చటుక్కున తల ఎత్తి శ్రీకాంత్! యూ బ్లడీ! నా 'లీనా'కేమైనా జరిగిందా, నీ అంతం చూస్తాను!.... స్వగతంలో అనుకున్నట్లుగా పెద్దగా అన్నాడు.

మళ్ళీ ముందుగది కన్పిస్తుంది. మంచం మీదపడి వున్న ట్రాన్సిస్టర్....సిగరెట్ పాకెట్....మంచంపక్కనే టీపాయ్ మీద పడివున్న స్టీలుగ్లాసు స్పష్టంగా కన్పిస్తు న్నాయి. ఈసారి కెమెరా ఏంగిల్ మారే సరికి స్నానం పూర్తిచేసి, టవల్ తో తుడుచుకుంలూ ముందు గదిలోకి వెళ్ళాడు....టప్.

ఫిలిం అయిపోయింది. తెర తెల్లగా కన్పిస్తుంది.

త్రిపాఠి లేచి వేరే ఫిలిం లోడ్ చేస్తూ, "చూచారుగా! అనుకోకుండా ఫిలిం కొరతవల్ల, అంతకంటె ఎక్కువ స్పేర్ చెయ్యలేకపోయాను. టైం వుండి వుంటే, మరింత ఫిలిం తెప్పించి, ప్రతి ఒక్కరికి ఇంకో గంట స్పేర్ చెయ్యగలిగేవాడిని!" సస్పృహ నిండిన స్వరంతో అన్నాడు.

నేనేం మాట్లాడలేదు.

మళ్ళీ ప్రొజెక్టర్ ఆన్ అయింది.

తలుపులు తెరిచి లోపలకు అడుగుపెట్టి, మళ్ళీ ఒకసారి బయటకు చూచి, లోపల్నించి తలుపులు మూసాడు రామ శర్మ.

మనిషిని చూస్తేనే తెలుస్తుంది నీరసంగా, దిగులుగా వున్నాడని. ఒక్క క్షణం గది మధ్యగా విలబడి సిగరెట్ వెల్గించి, వెళ్ళి మంచం మీద వాలాడు సిగరెట్ తాగుతూ శూన్యంలోకి చూస్తూ పలవరిస్తున్నాడు.... 'నీలూ! నీలూ' అంటూ.

మొదట కెమెరా మాదిరిగానే ఇదికూడా ముందు గదిని, ప్రక్క వున్న బాత్‌రూంని మార్చి మార్చి చూపుతున్నది.

ఇప్పుడు తెరపై బాత్‌రూం కన్పిస్తుంది. అయినా తేపులో మాటలు వినిపిస్తున్నాయి. "నీలూ! వెళ్ళిపోయావు కదూ! వెళ్ళు! అంతకంటె ఇంకేం చెయ్యగలవ్! కొద్ది సేపు మురిపించి, జీవితాంతం ఏడవమని శపించి వెళ్ళి పోయావ్....ప్చ్!" ముద్దు పెట్టుకున్న చప్పుడు. "నీలూ! ఒక్కసారి.... నా దగ్గరకు రావా?....?"

కెమెరా మళ్ళీ గదిలోకి తిరిగింది.

మంచం మీద బోర్లా పడుకుని, దిండుమీద వున్న ఫోటోవైపు చూస్తూ మాట్లాడుతున్నాడు రామశర్మ.

"నీలూ! ఎంత మారిపోయావ్! ఆరోజు....మన తొలి పరిచయంరోజు నేను అన్నం కలిపి నీకు అందిస్తే.... ఎలా సిగ్గుపడ్డావు? ఆ సిగ్గుల్లో మొగ్గలు చూస్తూ, ఆ చిరు నవ్వుల మోమును చూస్తూ, జీవితాంతం హాయిగా గడపా లనుకున్నాను. కాని....ప్చ్...." రెండు చేతులు తలక్రింద పెట్టుకొని పైకి చూడసాగాడు.

"నీలూ! నేను తప్పు చేశాను. అయినా ప్రేమించిన వాడ్ని కనుక అన్నాను. ఆమాత్రం అనే అధికారం నాకు లేదంటావా! ఆ ఒక్క మాటకే అభిమానం.... అనుబంధం అన్నీ త్రెంచుకొని పోయావ్... "

ఇప్పుడు బాత్ రూం కన్పిస్తున్నా మాటలు విన్పిస్తున్నాయి. "నీలూ! నీకేం! హాయిగా పెళ్ళి చేసుకున్నావ్! పోనీలే! నీవైనా సుఖంగా ఉండు. నాకు చనిపోవాలని పిస్తుంది.... కాని, ఎందుకో.... ఏదో ఆశ.... ఏనాటికయినా మళ్ళీ కన్పిస్తావని, నా వైపు ప్రేమగా చూస్తావని.... నీ వాడిలో నన్ను లాలిస్తావని.... నీలూ! ఎంత సంపాదించినా నీవు లేని బ్రతుకెందుకు? చూడు, ఎంత సంపాదించానో.... రక్తం ధారపోసి సంపాదించాను.... ఇంకా నీకు కావాలంటే లక్షలకు లక్షలు సంపాదిస్తాను. ఈ డబ్బంతా ఏం చేసుకోను?"

కెమెరా గదిలోకి తిరిగింది. గది మధ్యగా నిలబడి వున్నాడు ఇప్పుడు రామశర్మ. కాళ్ళ దగ్గర కుప్పలుగా పడివుంది డబ్బు.

ఆశ్చర్యపోయాను అంత డబ్బు చూచి.

"నీలూ! నీవు లేకుండా ఏమీ తినాలని ఉండదు. తిరగాలని ఉండదు. ఎంతకాలం ఇలా బ్రతికేది? ప్లీజ్.... ఒక్కసారి.... నాకోసం రావా? ఈ జన్మంతా నీ కోసం ఎదురు చూస్తూంటాను.... ప్లీజ్.... నీలూ...." టప్... ఫిలిం అయిపోయింది.

చిన్నగా నిట్టూర్చాను. "పూర్ ఫెలో! మానసికంగా చాలా దెబ్బ తిన్నాడు" అన్నాడు త్రిపాఠి మరో ఫిలిం అడ్జెస్టు చేస్తూ.

సిగరెట్ వెలిగించాను. రామశర్మ వాలకం చూస్తే, ఆ

బాధతో అతనెక్కువ కాలం బ్రతకడేమో అన్పించింది.

తిరిగి ప్రొజెక్టర్ ఆన్ అయింది.

లీనా గదిలోకివచ్చి, హేండ్ బ్యాగ్ మంచంమీద విసిరేసి, కుర్చీలో కూర్చుంది. క్షణం తర్వాత అలసటగా కుర్చీలో వెక్కువాలి కళ్ళు మూసుకొని మళ్ళీ తెరిచింది.

చటుక్కున లేచి కూర్చొని, ఏదో ఆలోచిస్తున్నట్లుగా గదంతా ఒకసారిచూచి హేండ్ బ్యాగ్ అందుకుని, లిప్‌స్టిక్ తీసి పెదాలకు రాసుకుంది. క్షణం తర్వాత లిప్‌స్టిక్ పెట్టేసి హేండ్ బ్యాగ్ మంచంమీదకు విసిరింది. అది మంచంమీద పడలేదు. క్రిందపడింది.

లేచివెళ్ళి క్రింద కూర్చొని 'హేండ్ బ్యాగ్' అందుకుంటూ ఓరగా చూచింది. ఆ చూపులు సూటిగా నన్నే చూస్తున్నట్లనిపించాయి. లీనా అందగత్తె! సందేహంలేదు. ఆ చూపులు గిలిగింతలు పెడుతున్నాయి.

కెమెరా తిరిగింది. ఇప్పుడు బాత్‌రూం కన్పిస్తుంది. టేప్ రికార్డర్‌లోంచి ఎలాంటి మాటలు విన్పించడంలేదు. అంటే లీనా మౌనంగా వుందన్నమాట

నిముషం తర్వాత కెమెరా తిరిగి గదిలోకి తిరిగింది....

లీనా కుర్చీలో కూర్చొని వీధిలోకి చూస్తుంది. కొద్దిసేపటి తర్వాత లేచివెళ్ళి తలుపులు వేసింది.

నెమ్మదిగా వెళ్ళి, స్టాండుమీద టవల్, చీర, జాకెట్టు అందుకొని బాత్‌రూంలోకి నడిచింది. కొద్దిసేపు గదంతా ఖాళీగా....నిశ్శబ్దంగా గడిచింది.

ఇప్పుడు తెరమీద బాత్‌రూం కన్పిస్తుంది. చీర విప్పేసింది కాబోలు జాకెట్టూ, లంగా మీద కన్పిస్తుంది లీనా!

తెల్లగా, పుష్టిగా వుంది లీనా. లంగా, జాకెట్టు మధ్య ప్రదేశం తెల్లగా మెరుస్తుంది. అటువైపు తిరిగి, చేతులు

వెనక్కు పెట్టి, జాకెట్టు గుండీలు విప్పుతుంది. చూడకూడని సంఘటన అది. కాని తప్పదు!

ఆ లావణ్యం ఎంతవద్దనుకున్నా ఉద్రేకాన్ని కల్గిస్తుంది. జాకెట్టు విడిచి స్టాండ్ మీద వేసి, షవర్ క్రింద నిలబడింది. వెనుకభాగం వీపుమీద బ్రాసరీ స్పష్టంగా కన్పిస్తుంది....

ముందుగది కన్పిస్తుంది ఇప్పుడు. నీళ్ళు పడుతున్న శబ్దం తప్పితే, ఇంకేమీ విన్పించడం లేదు. కొద్దిసేపటి తర్వాత మళ్ళీ బాత్ రూం కన్పించింది....

సోప్ రాసుకుంటూ స్నానం చేస్తుంది లీనా!....

లీనా స్నానం పూర్తిచేసి, టవల్ అందుకుంది....టప్ ఫిలిమ్ అయిపోయింది.

చిన్నగా నిట్టూర్చి వెనక్కు వాలాను.

త్రిపాఠి ప్రొజెక్టర్ స్టాండ్ పక్కకుపెట్టి, గదిలో లైట్ వెల్గించాడు.

"ఈ కార్యక్రమం అయిపోగానే, వాళ్ళ ముగ్గుర్ని అత్యవసరంగా-ఏవో సంతకాలు చెయ్యాలని పిలిపించి. వెంటనే ఆ కెమెరాలు తెప్పించి, మైక్రోఫోన్స్ తీయించాను" చెప్పాడు త్రిపాఠి కుర్చీలో కూర్చుంటూ.

చిరునవ్వుతో చూచాను త్రిపాఠివైపు.

"ముగ్గుర్నీ గమనించారుకదా! ఏదైనా 'క్లూ' దొరికిందా?" ఆసక్తిగా అడిగాడు త్రిపాఠి.

తల ఊపాను నవ్వుతూ.

"ఎవరు?" ఆసక్తిగా అడిగాడు.

చెప్పసాగాను.

3

"ఇక్కడ కాస్త వాస్తవికదృష్టి కల్గివుండాలి. జైపాల్

పింగ్ ప్రవర్తనచూచి, పిచ్చివాడైనా అనుకోవచ్చు. లేదా అతి తెలివిగా ప్రవర్తిస్తున్నాడనైనా అనుకోవచ్చు.

కాని వాస్తవం ఏమిటంటే—మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు తనకు తెలియకుండానే చాల విచిత్రంగా ప్రవర్తిస్తాడు. ఎవ్వరూ లేరనే అభిప్రాయంకల్గితే, డాన్సులుచేసే వాళ్ళు చాలామంది వుంటారు. అది సహజం. కాబట్టి ఇందులో జైపాల్‌పింగ్‌ను తొలగించవచ్చు.

ఇక రామశర్మ. అతని మాటలు, చేష్టలు చూస్తే ఎవ్వరికైనా అనుమానం కల్గుతుంది. కాని అది నిజంకాదు.

మీరు చెప్పినదాన్నిబట్టి మొదట్నించి అతను దిగులుతోనే ఉన్నాడు. దానికి కారణం ఏమిటో మనకు తెల్సింది. ఎవ్వరూ లేనప్పుడు—పెద్దగా ఏడవడం....బాధను వెళ్ళబోసుకోవడం చాలమందికి అలవాటే....కాబట్టి రామశర్మను కూడా ఇందులోంచి తొలగించవచ్చు.

ఇక లీనా! కొన్నికొన్ని సందర్భాలలో, ఆమె మనవైపు సూటిగా చూచినట్లుగా తెలుస్తుంది. అంటె అర్థం ఏమిటో తెలుసా?

ఆమె మనవైపు చూచిందంటె—కెమెరావైపు చూచిందన్నమాట. అంటె తన గదిలో కెమెరా ఉందనే విషయం ఆమె గ్రహించింది. అందుకే, దాని 'ఏంగిల్' ఎంతవరకో చూడాలనే అభిలాషతో, హాండ్‌బ్యాగ్ క్రిందపడేపి, క్రిందకు వంగి కెమెరావైపు చూచింది.

తర్వాత ఏమీ తెలియనట్లుగానే స్నానానికి బయలుదేరింది.

ఇక్కడే అసలు 'క్లూ' దొరికింది. సామాన్యంగా స్త్రీలు స్నానం చేసేటప్పుడు లంగాతో చేస్తారు. లేదా నగ్నంగా చేస్తారు. కాని, 'బ్రాసరీ' వేసుకొని ఎవ్వరూ స్నానం

చెయ్యరు. కాని లీనా బ్రాసరీ విప్పలేదంటే-ఆ బ్లూప్రింట్ ఆమె బ్రాసరీలో ఉండివుండాలి.

ఇక్కడొక విషయం అడగవచ్చు మీరు. బ్రాసరీ విప్పితే తన వీపుభాగం అంతా కెమెరాలో పడుతుందని 'బ్రా' విప్పలేదేమో! అని మీరు అనవచ్చు.

కాని నిజంగా అలాచేస్తే మనం చూస్తామని సిగ్గుపడి ఉంటే, అసలు స్నానానికి వెళ్ళదు. కాని మనకెలాంటి అనుమానం కలుగకూడదనే, స్నానానికి వెళ్ళింది. ఇది అతి జాగ్రత్త. ఇందులో చేసిన పొరపాటే 'బ్రా'తో స్నానం చెయ్యడం. మీరు వెళ్ళి లీనాను చెక్ చెయ్యండి. బ్లూప్రింట్స్ ఆమె బ్రాసరీలో దొరకవచ్చు. లేదా, ఈపాటికి గదిలో మరెక్కడైనా దాచి వుండవచ్చు" అని లేచి నిలబడ్డాను.

త్రిపాఠి కళ్ళు ఆనందంతో మెరిశాయి. "థాంక్యూ మిస్టర్ హరిగోపాల్! మీ అనుమానం అబద్ధం కాదని నా నమ్మకం!" అన్నాడు ఆనందంతో.

"దట్సాల్‌రైట్! బ్లూప్రింట్స్ దొరకగానే, నాకు తెలియపర్చండి!" చకచక బైటకు నడిచాను.

హోటల్ గదికి వచ్చిన అర్ధగంట తర్వాత త్రిపాఠినుంచి నాకు టెలిఫోన్ వచ్చింది. లీనా బ్రాసరీలోనే బ్లూప్రింట్స్ దొరికాయని చెప్పాడు.

నవ్వుతూ టెలిఫోన్ పెట్టేసాను. నా లాజిక్‌కు నవ్వొచ్చింది. నేనెప్పుడూ బనియన్‌తో స్నానం చెయ్యలేదు. స్త్రీలుకూడ అంతే! అదే 'క్లూ'. □□□

పట్టికొట్టిన పథకం!

అజీజ్

"మీకోసం, అంబికా మిల్స్ యజమాని పురుషోత్తమ రావుగారు వచ్చేరు. అర్జంటుగా మాట్లాడాలిట." అన్నాడు సార్జంట్ డేవిడ్.

నా కనుబొమలు ముడివడ్డాయి. పురుషోత్తమరావు వంటి పారిశ్రామిక వేత్త, ప్రత్యేకంగా నన్ను కలుసుకో డానికి రావడమా!

ఫైల్ పక్కన పెట్టి "పంపించు" అన్నాను.

సార్జంట్ వెళ్ళిన రెండు నిమిషాలకి, స్ప్రింగ్‌డోర్ కిర్రుమంది. లోన అడుగుపెట్టేడు పురుషోత్తమరావు. దాదాపు ఏభై ఏళ్ళుంటాయతనికి. బట్టతల. సామాన్యమైన ఒడ్డూ, పొడుగు.

"గుడ్‌మార్నింగ్! వెల్‌కమ్ ప్లీజ్!" అన్నాను సాదరంగా.

"గుడ్‌మార్నింగ్ మిస్టర్ రాజారెడ్డీ! గ్లాడ్ టు మీట్ యూ!" అంటూ కరచాలనం చేసి, ఎదురుగావున్న కుర్చీలో చతికిలబడ్డాడు.

"మీరిక్కడికి స్వయంగా వచ్చేరంటే ఏదో ముఖ్య విషయమే అయుంటుంది!" అన్నాను.

ఆయన నవ్వేడు నిర్జీవంగా. కళ్ళల్లో ఏదో వేదన తొణికిసలాడుతోంది. దానికి పేదా, గొప్పా అనే తారతమ్యం వుండదుకదా!

కోటు జేబులోకి చెయ్యి పోనిచ్చి, ఓ గులాబీ రంగు కవరు తీసేడాయన ఆ కవరుకి అన్నివైపులా సీలువేసు వుంది లక్కతో!

"ఇన్‌స్పెక్టర్! నేనిప్పుడు చెప్పబోయే విషయాలన్నీ విపులంగా ఇందులో, రాసి ఉన్నాయి. పూర్తి ఆయురారోగ్యాలతో, ఎవ్వరి వత్తిడీ, ప్రోద్బలమూ లేకుండా నేనే స్వయంగా రాసేను.

మీరు దీన్ని సాధ్యమైనంత జాగ్రత్తగా, దాచిపెట్టాలి. ఎవ్వరికీ చెప్పకూడదు. తెరిచి చూడకూడదు. దీన్ని తెరిచే అవసరం మీకెప్పుడొస్తుందో తెలుసా? నా హత్య తరవాత!"

కళ్ళు విప్పార్చేను, ఆశ్చర్యంతో.

"నా హత్య గురించి, నేనింత నిదానంగా చెబుతున్నానేమిటా అని, ఆశ్చర్యపోతున్నారా? ఔను. నా భార్య ద్వారా నేను త్వరలో చంపబడతాను. నా హత్యానంతరం మీరామెని హంతకిగా నిరూపించలేరు.

అందుకే, మీ సౌలభ్యం కోసమే, ఈ కవర్లో వివరా

లన్నీ స్పష్టంగా రాసి వుంచేను." అన్నాడు పురుషో_త్తమ రావు పేలవంగా నవ్వుతూ.

"మీమీద హత్యాప్రయత్నం జరగబోతుందని మాకు తెలిశాకకూడా మీ హత్యే ఎలా జరుగుతుందనుకుంటు న్నారు? మేము జరగనిస్తామా? ఎట్టి పరిస్థితిలోనూ జరగ నివ్వం?" అన్నాను దృఢంగా.

"నా హత్యని మీరుగానీ, నేనుగానీ ఆపలేము ఇన్ స్పెక్టర్! ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎన్ని కట్టుదిట్టాలు చేసుకున్నా అది దుస్సాధ్యం!"

"ఎందుకు?"

"ఎందుకంటే, నేను వంశ పారంపర్యంగా ఒక విచిత్రమైన జబ్బుతో బాధపడుతున్నాను. ఆ రోగాన్నే, నా భార్య, నా హత్యాయుధంగా వాడబోతోంది!"

"ఏమిటా వ్యాధి?"

"హెమోఫిలియా!"

నా కనుబొమలు ముడిపడ్డాయి, "అటువంటి జబ్బు గురించి నేవింతవరకూ వినడం జరగలేదు. దయచేసి కాస్త విపులంగా చెప్పండి."

"వైద్యశాస్త్రంలో, హెమోఫిలియా అని పిలవబడే ఈ జబ్బు, లక్షమందిలో ఏ ఒక్కరికోగానీ వుండదు. అందుకే సామాన్యులకు దీనిగురించి అంతగా తెలీదు.

ఈ వ్యాధివున్న వ్యక్తి శరీరంమీద ఏ చిన్న గాయమైనా, సూదిమొనంత గీరుకుపోయినా, రక్తం వరదలై పారుతుంది. ఏ గాయాలనైతే మీరు అతి సామాన్యంగా పరిగణిస్తారో, అవే వారికి ప్రాణాంతకంగా పరిణమిస్తాయి.

ఉదాహరణకి, నేను కూర్చున్న ఈ కుర్చీలో, ఏదైనా మేకుమొన బైటికి వచ్చి ఉందనుకోండి. నేను కూర్చుంటున్నప్పుడో, లేస్తున్నప్పుడో అది నా శరీరంలో గుచ్చుకుందనుకోండి. ఆ పిసరంత గాయమే, ఇప్పుడు నా ప్రాణాలు తియ్యవచ్చు!

ఆ రక్తస్రావాన్ని ఆపడం అంత సులభసాధ్యంకాదు. గాయంమీద తడిబట్టతో ఎంత బిగించి కట్టినా ఆగదు.

అనుభవజ్ఞుడైన వైద్యనిపుణుడి సహాయం తక్షణం లభిస్తే గానీ అరడజను రక్తపు సీసాలతో రెండు రోజులు పోరాడితేగానీ, నన్ను మృత్యువు బారినుంచి కాపాడలేరు!

ఈ విచిత్రమైన జబ్బు మనిషికి వంశానుక్రమంగా సంక్రమిస్తుందే తప్ప, మధ్యలో వచ్చేదికాదు. దీన్ని అందించేది కన్నతల్లే! గమ్మత్తేమిటంటే, ఆ తల్లి కడుపున పుట్టిన మగపిల్లలకే ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఆడ పిల్లలకి రాదు. జబ్బు అందించేది తల్లే అయినా, ఆ తల్లికి ఈ జబ్బుండదు!

అంటే, వంశ పరంపరగా, మగపిల్లలే ఈ వ్యాధికి గురవుతారన్నమాట. యిరోపా ఖండపు కొన్ని రాజ వంశాల్లో ఈ వ్యాధి అనువంశికంగా వుండేదన్న సంగతి జగద్విదితమే!

మాటవరసకి, హెమోఫిలియా వ్యాధిగ్రస్థుడు ఒక మామూలు యువతిని పెళ్ళాడాడనుకోండి. అతనిద్వారా, ఆ మహిళ ఆ వ్యాధి లక్షణాన్ని తన సంతానానికి సంక్రమింపజేస్తుంది.

వారికి పుట్టే ఆడపిల్లలకి ఆ వ్యాధి రాదుగానీ, ఆ వ్యాధిని సంక్రమింపజేసే లక్షణం వారిలో వుంటుంది. ఎందుకో తెలుసా? స్త్రీలలో ఎక్స్ ఎక్స్ క్రోమోజోముల జంటవుంటుంది.పురుషుల్లో ఎక్స్‌వై క్రోమోజోముల జంట వుంటుంది.

హెమోఫిలియా వ్యాధి, ఎక్స్ క్రోమోజోము ద్వారా రిసెసివ్ లక్షణంగా పురుషులకు సంక్రమిస్తుంది. అందుకే స్త్రీల కీ జబ్బుండదు!

హెమోఫిలియా రోగుల్లో ప్లేట్లెట సంఖ్య సామాన్యం గానే వుంటుంది గనక, రక్తస్రావం-బ్లీడింగ్ టైమ్

మామూలుగా వుంటుంది. కాని, రక్తం గడ్డకట్టే-క్లాటింగ్ టైమ్ చాలా ఆలస్యంగా వుంటుంది.

అందుకే, మామూలుగా పదినిమిషాల్లో గడ్డకట్టవలసిన రక్తం, ఆ వ్యాధిగ్రస్థుల్లో పదిగంటలైనా గడ్డకట్టదు....

మీరిప్పుడు స్పష్టంగా గ్రహించివుంటారు. ఆ వ్యాధి వల్ల నన్ను చంపడం ఎంత సులభమో!" అన్నాడు పురుషోత్తమరావు.

సాలోచనగా తలూపేను. "జీవితంలో ప్రతిమనిషికీ చిన్నచిన్న గాయాలూ, దెబ్బలూ తగలడం పరిపాటి. అటువంటి ఏ చిన్న సంఘటనకీ గురికాకుండా మీరిన్నేళ్ళు ఎలా జీవించగలిగేరు?"

పురుషోత్తమరావు నవ్వి—"ముందే చెప్పాను. ఈ వ్యాధి నాకు వంశానుక్రమంగా వచ్చిందని. అందుకే బాల్యంనించీ నన్ను నేను ఎలా కాపాడుకోవాలో, మా పెద్దలు నాకు తర్ఫీదు ఇచ్చేరు.

ఉదాహరణకి, నేను దువ్వెనతో తల దువ్వుకోను. దానికి బదులు మెత్తని బ్రష్ ఉపయోగిస్తాను. గోళ్ళు తియ్యడానికి బ్లేడు ఉపయోగించను, దానికి బదులు ఫైల్ వాడతాను. మోలలు దిగగొట్టిన బూట్సుగానీ, చెప్పులు గానీ వాడను. రబ్బరుతోనూ, స్పాంజితోనూ ప్రత్యేకంగా తయారైన బూట్సు వాడతాను.

గాజు గ్లాసుల్లోనూ, ప్లేట్స్‌లోనూ ఏమీ తీసుకోను. భోజనం చేసేటప్పుడు ఫోర్కులు ఉపయోగించను. చివరికి, గెడ్డంకూడా రేజర్‌తోగానీ, కత్తితోగానీ గీసుకోను. హేర్ రిమూవర్ వాడతాను.

పై జాగ్రత్తలు పాటిస్తూ మా తాతగారు అరవై ఏళ్ళు జీవించేరు. నాన్నగారు ఏభై ఏళ్ళు బ్రతికేరు. ఇప్పుడు

నేను నలభై ఐదేళ్ళనించీ సురక్షితంగా వున్నాను" అన్నాడు పురుషోత్తమరావు.

సాలోచనగా తలూపేను. "ఇప్పుడు చెప్పండి. మీ భార్య మిమ్మల్ని చంపాలనుకోడానికి కారణాలేమిటి?"

"నా వయసును దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడామెకు ఎన్నేళ్ళుంటాయో అంచనాకట్టండి చూద్దాం?" ఎదురు ప్రశ్నవేసేడు పురుషోత్తమరావు.

క్షణం ఆలోచించి, "బహుశా ముప్పైఐదు నలభై ఏళ్ళుండొచ్చు!" అన్నాను.

ఆయన నవ్వి—"మీ అంచనా తప్పింది. ఇప్పుడామెకి పాతికేళ్ళే!" అన్నాడు.

"ఆవిడ మీకన్నా ఇరవై ఏళ్ళు చిన్నదా? అంటే, రెండో భార్యో. మూడో భార్యో అనుకోవచ్చా?"

అతను నిట్టూర్చి—"ఔను. మూడో భార్య! బుద్ధి గడ్డితినీ, ఖర్మకాలీ కట్టుకున్నాను. కారణం లేకపోలేదు. గత ఇద్దరు భార్యలద్వారా నాకు సంతానం కలగలేదు. ఈమె ద్వారానైనా ఓ నలుసు పుడుతుందేమోనన్న ఆశతో గోతిలో పడ్డాను. నా అజ్ఞానం తెలిసి వచ్చేసరికి ఆలస మైపోయింది!

ఈమధ్య ఆమె జీవితంలో ఓయువకుడు ప్రవేశించేడు. అతని పేరు పవన్‌కుమార్. క్లబ్బులో పరిచయమయ్యే డుట. అన్నట్టు నా భార్యపేరు చెప్పలేదుకదూ? భాను రేఖ!

మొదట వాళ్ళమధ్య. ఏదో గౌరవప్రదమైన మామూలు స్నేహమే అయుంటుందని భ్రమిసేను. అతను తరచూ మా యింటికి వస్తూపోతుండేవాడు.

రానురాను వాళ్ళ ప్రవర్తనలో ఏదో అసహజత్వం

ద్యోతకమవసాగింది. ఏమిటో చూద్దామని, వాళ్ళ కను మానం రాకుండా దూరంగావుండి గమనించేను. నా సందేహమే సరైనదని ధృవపడింది।"

"అటువంటి నమ్మకద్రోహిని, విడాకులద్వారా మీ జీవితంనించి విడదీయవచ్చుగా?''

''వేరొకరైతే మీ సూచన పాటించేవారే. మా పెద్దలు తరతరాలుగా, ఎంతో జాగ్రత్తగా వంశ గౌరవాన్ని కాపాడుతూ వచ్చేరు. వారి దృష్టిలో, తృణప్రాయమైన ప్రాణాలకన్నా వంశ ప్రతిష్ట ఎంతో ప్రముఖమైనది.

అటువంటిది, ఇప్పుడు నేనా పాతకికోసం కోర్టు కెక్కితే, సంఘంలో మళ్ళీ తలెత్తుకు తిరగ్గలనా? ఈ బలహీనతే నన్ను ఏ చర్యా తీసుకోనివ్వకుండా ఇంత కాలం ఆపింది.

ఇప్పుడా పాతకి, నన్నే తుదముట్టించాలని పథకాలల్లు తోంది. అదృష్టవశాత్తూ రెండుమూడుసార్లు మృత్యువును వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను. ఇలా ఎంతకాలం తప్పించుకోగల్ను? ఏదో ఒకరోజు నా మరణం ఖాయం।

నా హత్య ఎంత నేర్పుగా జరపబడుతుందంటే, పోలీసులకది హత్య అనే అనుమానం ఈషణ్మాత్రం రాదు. ఒకవేళ వచ్చినా, హత్య వాళ్ళే చేశారని నిరూపించలేరు.

నేను త్వరగా చస్తే, నా అపార ఆస్తిపాస్తుల్ని హస్తగతం చేసుకుని, బాహాటంగా స్వర్గసుఖాలనుభవించాలని వారి ఆశ।"

"మీమీద హత్యాప్రయత్నాలు జరిగేయని చెప్పేరు. అవి ఎలా జరిగేయో, వాటినించి మీరెలా తప్పించుకున్నారో కాస్త వివరించండి."

"ఇతర్ల దృష్టిలో ఆ సంఘటనలకి అట్టే ప్రాధాన్యత వుండదు.

కాని, ఆ చిన్న ఘటనలే నాకు ప్రాణాంతకం కాగలవని ఎవ్వరూ వూహించలేరు.

ఓ సాయంత్రంవేళ, బీచికె శ్తున్నాననీ, నన్నూ వెంట రమ్మనీ కోరింది భానురేఖ, సరేనన్నాను పోర్టికోలో ఆగివున్న మా షెవర్లెట్ కారెక్కాం.

ఎన్నడూలేనిది ఆరోజు తానే కారు నడుపుతానని, డ్రైవింగ్ సీట్లో కూర్చుంది. ఆమె అటు ఇంజన్ స్టార్ట్ జే స్తుండగా, అనుకోకుండా నా దృష్టి విండ్ స్క్రీన్‌మీద పడింది. అప్పుడు గమనించేను. దానిచుట్టూ వుండే రబ్బరు పెంచ్ వదులు జెయ్యబడున్నట్టు.

వెంటనే భానురేఖను ఇంజన్ ఆఫ్ జెయ్యమని చెప్పి, నౌఖర్ని కేకేసేను. 'ఎందుకండీ?' అంది.

'ఏంలేదు. విండ్‌స్క్రీన్ సరిగ్గా తుడవనట్టున్నాడు. క్లీన్ జేయించాలి' అంటూ కారుదిగేను.

నౌఖరు వచ్చేక, వాడికి విండ్‌స్క్రీన్ తుడవమని పురమాయించేను. వాడు కండువాతో దాన్ని తుడవడానికి చెయ్యి వేశాడోలేదో, 'తడాక్'మనే చప్పుడుతో అది ముక్కలై, అంతక్రితం నేను కార్లో కూర్చున్నచోట పడింది.

భానురేఖ పథకం ఏమిటో మీకు బోధపడిందా? నన్ను కార్లో షికారుకు తీసికె శ్తున్నట్టు తీసికెళ్ళి. దార్లో ఎక్కడో సడన్‌బ్రేక్ వేసేది. ఆ కుదుపుతో విండ్‌స్క్రీన్ పగిలి, గాజు ముక్కలు నామీదపడి, అక్కడక్కడా గీరుకు పోయేవి.

ఆ మామూలు గాయాలే, నా ప్రాణాలుతీసేవి. ముందు వేసుకున్న పథకం ప్రకారమే. ఆ విండ్‌స్క్రీన్ పెంచ్ వదులు జెయ్యబడిందని దీనితో స్పష్టమవడం లేదూ?

ఒకరాత్రి ఎన్నడూలేంది, నామీద వల్లమాలిన వాంఛ ఒలకబోస్తూ, మీదికొరిగి, మెడచుట్టూ చేతులువేసింది. దీన్ని మీరు ప్రేమే అనవచ్చు.

అంతలో నాదృష్టి, ఆమె కుడిచేతికి మెరుస్తున్న బంగారు కంకణంమీద పడింది. ఆ కంకణాన్ని బిగదీపే హుక్ తెరుచుకునుంది. అది ఏక్షణంలోనైనా, నా శరీరానికి గుచ్చుకోవచ్చు.

నేను మెరుపులా ఆమెని నానించి దూరంగా తోసేశాను. ఆ సంఘటన తరవాత మళ్ళీ ఆమె నా పడగ్గదిలోకి రావడంగానీ, అటువంటి కల్లి బొల్లి ప్రేమ ఒలక బోయడంగానీ చెయ్యలేదు।

మా పెళ్ళైన కొత్తలోనే, నేనామెకి నా జబ్బుగురించీ, తీసుకుంటున్న జాగ్రత్తలగురించీ క్షుణ్ణంగా వివరించేను. ఆమెను గోళ్ళు పెంచుకోవద్దనీ పడగ్గదిలో నా పక్కన వున్నప్పుడు, శరీరానికి గుచ్చుకోగల మొనదేలిన ఆభరణా లేవీ ధరించకూడదనీ మరీ మరీ చెప్పేను. ఐనా ఆ రోజు, హుక్ బిగించకుండా కంకణం ధరించి నామీద చేతులు వేసిందంటే అర్థం ఏమిటి?

సరే, ఆ తరవాత జరిగిన మరో ప్రమాదకరమైన సంఘటన వినండి. పిల్లీ, కుక్కలవంటి పెంపుడు జంతు వుల్ని పెంచడం మా ఇంటా వంటాలేదు. కారణం, ఆ జంతువుల పంజాలకి మొనదేలిన గోళ్ళుంటాయి.

ఒక్కోసారి అవి ప్రేమకొద్దీ యజమానుల్ని పంజా లతో కొడుతూ ఆడుకుంటూంటాయి. మాకు వంశాను

క్రమంగా వస్తున్న ఆ జబ్బు దృష్ట్యా అటువంటి జంతువుల్ని ఇంట్లో పెంచకూడదనే నియమంవుంది.

పెళ్ళైన కొత్తలో ఈ సంగతి భాసురేఖకి చెప్పేను కూడా. ఐనా, ఆమె కొద్దిరోజులక్రితం ఓ బొచ్చు పిల్లిని తెచ్చుకుంది పెంపకానికి. అందుకు నా తీవ్రమైన అసమ్మతిని తెల్పితే ఏమందో తెలుసా?

'నాకు పిల్లలే పుట్టివుంటే, వాళ్ళతో ఆడుకుంటూ ఇంట్లో కాలక్షేపం జేసేదాన్ని. ఆ భాగ్యం నాకెలాగూలేదని తెలిసిపోయింది. కనీసం ఇలాగనైనా, ఆ లోటు తీర్చుకోనివ్వండి' అంటూ దెప్పి పొడిచింది. దాంతో నా నోరు పెగల్లేదంటే నమ్మండి.

ఓ రాత్రివేళ, నేను ఈజీచైర్లో జేరగిలబడి ఏదో పుస్తకం చదువుతున్నాను. అలా చదువుతూనే మగత నిదరలోకి జారుకున్నాను. నా రెండుచేతులూ కుర్చీ కిరువైపులా వేళాడుతున్నాయి.

కాసేపటికి, వేళ్ళకేదో తగులుతున్నట్టు స్ఫురించి, చటుక్కున కళ్ళుతెరిచి చూసేను. ఇంకేముంది, ఆ పిల్లికూన నా వేళ్ళని పంజాతో స్పృశిస్తూ, నాలికతో నాకుతూ ఆడుకుంటోంది. మెరుపులా ఒక్క విసురు విసిరేను దాన్ని.

ఖర్మకాలి, దాని పళ్ళూ గోళ్ళూ నా శరీరంలో దిగపడుంటే నా గతేమయ్యేదో మీరే ఊహించుకోవాలి!" అన్నాడు.

సిగిరెట్ అంటించి, కాసేపు తీవ్రంగా ఆలోచించేను.

"మీ కేసు చాలా జటిలంగానూ, తీవ్రంగానూ వుంది. ఆల్‌రైట్! మీ రిక్కడికివచ్చి, చాలా మంచిపనిజేశారు. వాళ్ళు నిజంగా మిమ్మల్ని అలా హతమార్చివుంటే, అది

హత్య అని ఎవ్వరికీ, ఎలాటి అనుమానమూ వచ్చేదికాదు.

ఉన్నతాధికార్లతో సంప్రదించి, మీ రక్షణకోసం ఎటు వంటి కట్టుదిట్టాలు ఏర్పాటు జెయ్యాలో నిర్ణయిస్తాను. మీరు నిశ్చింతగా వుండండి."

"థాంక్స్!" అంటూ లేచాడు పురుషోత్తమరావు.

2

మర్నాడు ఉదయం, నేను ఆఫీసులో అడుగుపెట్టిన పావుగంటకే, టేబిల్‌మీది ఫోన్ గణగణమంది.

రిసీవర్ అందుకున్నాను. "ఎస్, ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి హియర్!"

"నేను గాంధీ హాస్పిటల్‌నించి మాట్లాడుతున్నాను. కొన్ని గంటలక్రితం పురుషోత్తమరావుగార్ని హాస్పిటల్లో చేర్చాం! ఇప్పుడాయన పరిస్థితి చాలా విషమించింది. నేనాయన ఫామిలీ డాక్టర్ని.

మిమ్మల్ని చివరిసారి చూడాలని కోరుతున్నారాయన. వెంటనే బైలుదేరి రండి." వినిపించింది అవతలినించి.

నాకు మతిపోయినంత పనైంది క్షణంపాటు. "ఆల్‌రైట్! ఇప్పుడే వస్తున్నాను." అంటూ రిసీవర్ దించాను.

ఆయన నన్ను కలుసుకుని ఇంకా ఇరవై నాలుగ్గంటలు కూడా కాకముందే, ఇలా జరుగుతుందని నేనూహించలేదు. జీపెక్కి హుటాహుటిన బైలుదేరాను హాస్పిటల్‌కి.

స్పెషల్ వార్డ్‌లో, బెడ్‌మీద వెల్లకిలా పడున్నాడు పురుషోత్తమరావు. స్టాండుకి బ్లడ్‌బాటిల్ వేలాడుతోంది. పక్కనే ఆయన భార్య భానురేఖ నిల్చునుంది.

నన్ను చూడగానే డాక్టర్ పెదవి విరిచి, "యూ ఆర్ టూ లేట్ ఇన్‌స్పెక్టర్!" అన్నాడు.

"పోయారా?" అడిగాను ఆశ్చర్యంగా.

డాక్టర్ తలూపి, "మూడునిమిషాల క్రితం! మా శాయ శక్తులా ప్రయత్నించాం! లాభంలేకపోయింది" అన్నాడు.

భానురేఖవైపు చూసాను. మరో ఆడదైతే ఆపాటికి గుండెలు బాదుకుంటూ రోదించేది. ఆమె మొహం నిదర లేమివల్ల వాడినట్టుందేకాని, శోకమనేది ఏ కోశానా కనిపించడం లేదు!

డాక్టర్ నా భుజం తట్టి, "ఇలా రండి!" అంటూ పక్క గదిలోకి తీసికెళ్ళాడు. జేబులోంచి ఓ చీటీతీసి, "చివరిఘడియల్లో ఆయన మీకి సందేశం ఇవ్వమని ఏదో గొణిగాడు. నేను వెంటనే కాగితంమీద రాసుకున్నాను ఆ మాటలు!" అన్నాడు దాన్ని అందిస్తూ.

రెండే రెండు పంక్తులు రాసున్నాయందులో, 'ఇన్ స్పెక్టర్! నన్ను నిరాశపర్చకండి. మీ కర్తవ్యాన్ని నెరవేర్చండి. అప్పుడే నా ఆత్మకు శాంతి!'

సాలోచనగా తలూపుతూ, "ఎలా జరిగిందీ సంఘటన?" అడిగాను డాక్టర్ని.

"రాత్రి రెండు గంటల ప్రాంతంలో జరిగిందిట! మిసెస్ పురుషోత్తమరావుగారు నాకు ఫోన్ చేయగానే, హుటాహుటిన వెళ్ళాను వాళ్ళింటికి. అప్పటికే ఆయన గాయాల్లోంచి చాలావరకు రక్తం కారిపోయింది.

ఆయనే చెప్పారు నాకు, ఏం జరిగిందో! ఆ భార్యాభర్త లిద్దరికీ విడిగా పడగ్గదులున్నాయి. ఆ రెండు గదులకీ మధ్య ఓ తలుపుంది. దాని సగభాగంలో అద్దాలు బిగించి వున్నాయి. ఆయన పడగ్గదిలోపల ఓ ఈజీ ఛేర్ వుంటుంది. దాని ముందు, కాళ్ళు పెట్టుకోడానికి మఖ్ మల్ తో తయారైన ఓ ముక్కాలిపీట ఉంటుంది.

రాత్రి ఒంటిగంట ప్రాంతంలో, ఆయన భార్య గది లోంచి ఎవ్వరో గట్టిగా అరిచినట్టు వినిపించి, ఆయన నిదర మేల్కొన్నారుట. వెంటనే, మంచం తలవైపున్న రీడింగ్ లాంప్ వెలిగించాలని స్విచ్ వత్తితే బల్బు వెలగలేదుట!

మామూలుగా గదిలో వెలిగించే లైటు స్విచ్ దూరాన గోడలో వున్నందుకు, ఆ కేక ఏమిటో కనుక్కొందామన్న తొందర్లో, మంచం దిగి, అలవాటు ప్రకారం చీకట్లో తడుముకుంటూ తలుపువైపు వెళ్ళారుట.

తలుపుని సమీపిస్తుండగా, కాళ్ళకి ముక్కాలిపీట అడ్డు పడి, అమాంతం తలుపుమీద పడ్డారుట. ఇంకేముంది. దానికి బిగించి వున్న అద్దాలు ముక్కలై ఆయన చేతులకి గాయా లేర్పడ్డాయి. రక్తం వరదలైంది!

ఇక్కడ రెండు విషయాలు మనం గమనించాలి. కేక విని కళ్ళు తెరిచిన పురుషోత్తమరావుగారు, రీడింగ్ లాంప్ వెలిగించబోతే అది ఎందుకు వెలగలేదు? ఎక్కడో, ఈజీ ఛేర్ ముందుండవలసిన ముక్కాలిపీట తలుపుదగ్గరికెలా వచ్చింది? దాని మూలంగానే ఆయన ఈ ప్రమాదానికి గురయ్యారన్నది నిస్సందేహం!" అన్నాడు డాక్టర్.

ఆయన సూచించిన ఆ రెండు క్లూస్ చాలు, ఆ కేసు పరిశోధించడానికి. పురుషోత్తమరావు చివరికోరిక తీర్చే వరకూ నాకు నిదరపట్టదు!

3

శవాన్ని మార్చ్యురీ జరిపించి, డాక్టర్స్ రిపోర్ట్లూ అవీ తీసుకునేసరికి సాయంత్రమైంది. భానురేఖని కలుసుకుని, అసలు రహస్యం కక్కించాలి. జీపులో బైలుదేరాను వాళ్ళింటికి.

హాలు మధ్య సోఫాలో కూర్చునుంది భానురేఖ. ఆమె వదనంలో అదే నిశ్చలత. మార్పల్లా, ఇప్పుడు కాస్త స్నానం అదీచేసి, ఫ్రెష్‌గా కనిపిస్తోంది.

సోఫాలో చతికిలబడి, "మీ భర్త మరణం మీమీద ఎటువంటి ప్రభావమూ వెయ్యనట్టుంది!" అన్నాను అర్థవంతంగా నవ్వుతూ.

ఆమె తలూపి, "ఔను! ఒక జడపదార్థంగా మారిన మనసుమీద ఇటువంటి సంఘటనలు ఏం ప్రభావం వేస్తాయి చెప్పండి? నేనీ ఇంట్లో ఊపిరున్న ఓ మట్టి బొమ్మని!

మాది చాలా పేద కుటుంబం. పేద కుటుంబం గనకే నాలుగు పదులు దాటిన వ్యక్తికి నన్ను కట్టబెట్టేడు నాన్న.

అంతా, ఈశ్వర మహిమ అనుకునేరు, కాదు, ఐశ్వర్య మహిమ! నాఖర్మ అంతేనని , ఆ మూడు ముళ్ళేవో వేయించుకున్నాను, కిమ్మనకుండా. ఆ ముళ్ళే, తరవాత నా కంఠానికి యమపాశాలవుతాయని నేననుకోలేదు. మా వారికి వంశానుక్రమంగా ఓ భయంకరమైన జబ్బుందని ఆ తరవాతే తెలిసింది వాకు. ఆ జబ్బునించి ఆయన తనని రక్షించుకునే పద్ధతులూ, అలవాట్లూ అవీ నా పాలిట పెద్ద తల నొప్పిగా పరిణమించేయి.

అంతటితో సరిపడితే బావుండు. ఆయనకి మరో జబ్బు కూడా ఉందని చాలా ఆలస్యంగా తెలిసింది, అదే, అనుమానపు జబ్బు. ఆయనకి నా మీద ఎక్కడలేని అనుమానం. వయసున్న మగాళ్ళతో మాట్లాడకూడదనీ, కన్నెత్తి చూడకూడదనీ ఆంక్షలు.

అంతెందుకు, పెళ్ళయిన కొత్తలో ఇంట్లో వున్న కుర్ర నౌఖర్లని మాన్పించి, వృద్ధుల్ని పెట్టుకున్నారంటే ఆ అనుమానం ఎంత తీవ్రమైనదో మీరే వూహించుకోవాలి.

ఈ చర్యలవల్ల కాలక్రమేణా, ఆయనపట్ల నాకు గౌరవాభిమానాలు సన్నగిల్లి జుగుప్సా, అసహ్యమూ చోటు జేసుకున్నాయి. తిరుగుబాటుకోసం మనసు తీవ్రంగా ప్రేరేపించేది. ఆ ప్రేరణ ఫలితమే, నేను క్లబ్బుల్ని ఆశ్రయించడం!

అక్కడ పరిచయమయ్యేడు పవన్‌కుమార్, నా దీన స్థితిపట్ల అతను చూపే సానుభూతే, నన్నతని దగ్గరగా తీసికెళ్ళింది. ఈ విషయంలో ఆయనతో అనేకసార్లు తగాదా పడ్డాను కూడా.

నాలో తిరుగుపాటుతత్వం ప్రారంభమైందని ఆయన పసిగట్టి వుంటారు. అందుకే తోక ముడిచి వూరుకున్నారు. నేను నిర్భయంగా పవన్‌కుమార్ని ఇంటికి ఆహ్వానించే దాన్ని. మామధ్య గౌరవప్రదమైన నిష్కల్మష స్నేహం తప్ప మరో హేయమైన భావంలేదని మీరు గమనించాలి.

మీరిప్పుడిక్కడి కెందుకొచ్చారో నాకు తెలుసు. ఏదో పథకం వేసి, నేనే మావార్ని చంపేనని మీ అనుమానం! ఔనా?"

కుండ బద్దలు కొట్టినట్టు ఆమె అలా మాట్లాడుతోంటే గుడ్లప్పగించి చూడ్డంతప్ప, నా బుర్ర పనిజెయ్యడం మానేసింది కాసేపు.

"అనుమానం సంగతి తరవాత చెబుతానుగానీ, ముందు మీ భర్త మరణానికి దారితీసిన సంఘటన గురించి వివరంగా చెప్పండి" అన్నాను.

"రాత్రి నిదరలో వున్న నాకు హఠాత్తుగా పెద్దచప్పుడు వినిపించి మేల్కొని లైటువేసి చూస్తే, ఆయన గదికీ నా గదికీ నడుమ వున్న తలుపు కొద్దిగా తెరిచివుంది. దాని మధ్య వుండే అద్దాలు తునాతునకలై వున్నాయి. ఆయన

కిందపడి మూలుగుతున్నారు.

పరిగెత్తికెళ్ళి చూస్తే. రక్తం వరదలై కారుతోంది. వెంటనే డాక్టర్‌కి ఫోన్ చేశాను."

"నిదరలో మీరేదైనా పీడ కల చూసి కేక పెట్టారా?"

"ఏమో తెలీదు."

"ఓసారి నాకా గది చూపిస్తారా?"

ఆమె లేచి "రండి!" అంటూ మెట్లవైపు నడిచింది. ఇద్దరం మెట్లెక్కి పైకి వెళ్ళాం.

పురుషోత్తమరావు పడగ్గది ఇంకా అలాగే వుంది. నేల మీద మెత్తని తివాచీ. రెండు పడగ్గదులకీ మధ్య తలుపు. పగిలిన అద్దాలు ఇంకా తలుపులో అక్కడక్కడా మిగిలు న్నాయి. తలుపుకి చాలాదూరంలో వుంది వాలు కుర్చీ. దాని ముందు మఖమల్ ముక్కాలి పీట.

"రాత్రి ఆ కుర్చీముందుండాల్సిన ముక్కాలిపీట, తలుపు దగ్గర పడుందిట. చీకట్లో అది అడ్డు పడటంవల్లే. ఆయన తలుపు మీద పడ్డారుట. కుర్చీముందుండవలసిన వస్తువు అక్కడికెలా వెళ్ళిందంటారు?" అడిగేను.

"బహుశా ఆయన పడుకోడానికి లేచేటప్పుడు దాన్ని పక్కకి తన్నారేమో!"

అలా జరగడానికి వీలుందా? చూద్దామని కుర్చీలో కూర్చుని కాలితో ఆ ముక్కాలిపీటని తలుపు వైపు తోసేను. గజం కూడా జరగ లేదు. మరోసారి ప్రయ త్నించేను. లాభం లేకపోయింది.

నేల మీద తివాసీ పరుచుండగా అది జరగడం అసం భవం! నేల నున్నగా వుండి వుంటే జరిగేదేమో. ఆ

ప్రయోగంతో భానురేఖ జవాబు సరికాదని తేలిపోయింది.

సాలోచనగా తలూపుతూ, మంచం తలవైపు బిగించి ఉన్న రీడింగ్‌లాంప్ వైపు చూసేను దాని బల్బు చిన్న ప్లాటినమ్ షెడ్ కింద బిగించి ఉంది. దాని కిందనే స్విచ్ వుంది. అటువెళ్ళి ఆ స్విచ్ వత్తేను. బల్బు వెలగ లేదు.

దాన్ని తాకి చూసేను. హోల్డర్లో బల్బు కాస్త లూజుగా వున్నట్టు తోచింది. కొద్దిగా తిప్పి బిగించేను. వెంటనే వెలిగింది.

భానురేఖవైపు తీక్షణంగా చూసేను.

"రాత్రి ఆయన స్విచ్ వత్తితే వెలక్కూడదని నేనే ఆ బల్బును లూజ్ చేశాననుకుంటున్నారా? ఆగండి" అంటూ బైటకెళ్ళి పనిమనిషిని కేకేసింది భానురేఖ.

ఆమె రాగానే "నువ్వు మామూలుగా తుడిచేలా ఆ రీడింగ్‌లాంప్ తుడువు" అంది.

పనిమనిషి డస్టింగ్ క్లాత్ అందుకుని, వెలుగుతున్న లైటార్పి ఎడంచేత్తో షెడ్ పట్టుకుని గుడ్డతో బల్బు తుడిచింది.

నేను స్విచ్ వత్తేను.

బల్బ్ వెలగలేదు.

"చూశారా! పనిమనిషి అలా తుడుస్తున్నప్పుడే బల్బు కాస్త వదులయి, కనెక్షన్ లూజ్ అవుతుంది. బహుశా ఈ కారణంవల్లే రాత్రి ఆయన స్విచ్ వత్తినప్పుడు లైటు వెలిగుండదు."

నవ్వేను. "ఇలా జరుగుతుందని మీకెలా తెలుసు? ఎప్పుడైనా మీరు ప్రాక్టికల్ జేశారా?"

భానురేఖ నిట్టూర్చింది. "నేనేం చెప్పినా మీరిప్పుడు నమ్మే స్థితిలో లేరు. ఎందుకంటే పరిస్థితులన్నీ నాకు వ్యతిరేకంగా సృష్టించబడున్నాయి. సరే, కానివ్వండి!

ఆయన చచ్చిసాధించేడు. బ్రతికుండగా నన్నూ, పవన్‌కుమార్నీ వేధించలేకపోయాననే అక్కసుతో, మా జీవితాలు ఎలాగైనాసరే నరకప్రాయం జెయ్యాలని, ఇటువంటి అద్భుత పధకం అల్లి కక్ష సాధించేడు.

మా మీద అనుమానం కలిగేలా పరిస్థితులు సృష్టించి ఆయన ఆత్మహత్య జేసుకున్నాడంటే నమ్మేదెవ్వడు? సరే, మీకింకా అనుమానాలేవైనా మిగులుంటే, పనిమనిషిని ఒంటరిగా అడిగి తెలుసుకోండి. నేనా పక్క గదిలో వుంటాను!" అంటూ తన పడగ్గదివైపు వెళ్ళింది భానురేఖ.

పనిమనిషి వైపు తిరిగేను. "రోజూ నువ్వే ఈ గది శుభ్రం జేస్తావా?"

"ఔనండి."

"ఆ లాంప్ రోజూ తుడుస్తావా?"

"ఔనండి."

"ఇప్పుడు తుడిచినట్టే, జాగ్రత్తగా తుడుస్తావా?"

ఆమె కాసేపు తటపటాయించి,

"తొందర్లో అప్పుడప్పుడూ గబగబా తుడిచిపోతానండి. ఎవ్వరైనా చూస్తుంటే మాత్రం కాస్త నెమ్మదిగా తుడుస్తాను."

"సరే, వెళ్ళి మీ అమ్మగార్ని పంపించు!" అన్నాను.

పనిమనిషి భానురేఖ పడగ్గదివైపు వెళ్ళి. తలుపు తెరిచి. లోనికెళ్ళి. తిరిగి తలుపు దగ్గరగా వేసింది.

సిగరెట్ అంటించి. తీవ్రంగా ఆలోచిస్తూ అక్కడే నిల్చున్నాను.

ఐదు నిముషాలైనా భానురేఖ రాలేదు. అనుమానంతో. ఆమె గదివైపు నడిచేను. పగిలిన అద్దాలగుండా ఆ గదిలో కనిపించిన దృశ్యం నన్ను చకితుణ్ణి జేసింది!

విశాలమైన ఆ గదిలో. అటువైపు గోడవారగా వున్న పందిరి మంచందగ్గర. భానురేఖా. పనిమనిషీ యెందుకో పెనుగులాడుతున్నారు. ఆమె చేతిలోంచి పనిమనిషి ఏదో లాక్కోడానికి ప్రయత్నిస్తోంది!

మెరుపులా తలుపు తెరిచి. లోని కురికేను. భానురేఖ చేతిలో ఉన్నది మామూలు వస్తువుకాదు. పిస్తోలు! దాంతో ఆమె ఆత్మహత్యకు తలపడుతోంటే. సమయానికి పని మనిషి వచ్చి. ఆపడానికి ప్రయత్నిస్తోంది.

నేను చొరవజేసి. బలవంతంగా భానురేఖ చేతిలోంచి పిస్తోలు లాక్కున్నాను. నన్ను చూడగానే ఆమె చేతుల్లో ముఖం కప్పుకుని వెక్కివెక్కి ఏడవసాగింది.

"ఇక్కడ యింత ప్రమాదం జరుగుతోంటే. నన్నెందుకు పిలవలేదు?" తీక్షణంగా చూసేను పని మనిషిని.

"రెండుసార్లు కేకేశానండి! మీరు వినిపించుకోలేదు" అంది పనిమనిషి తన తప్పేమీ లేదన్నట్లుగా.

భానురేఖ నుద్దేశించి. "ఎందుకు పాల్పడ్డారీ పనికి?" అడిగేను.

"ఇంతకంటే, ఇప్పుడు నాకు వేరేమార్గం ఏముందని? ఆయన మరణంతో నాకెలాటి ప్రమేయం లేదని మిమ్మ ల్నెలా నమ్మించను? మీ అనుమానెలెలా తొలగించను?"

"సరే, కాసేపలా కూర్చోండి. మీ ఎక్సైటేట్‌మెంట్ తగ్గేక నిదానంగా మాట్లాడుకుందాం" అంటూ ఆమెని సోఫాలో కూర్చోబెట్టి, తలుపులు దగ్గరగా వేసి తిరిగి పురుషోత్తమరావు గదిలోకి వచ్చేను.

సిగరెట్ అంటించి, తీవ్రంగా ఆలోచిస్తూ గదిలో పచార్లు చెయ్యసాగేను. అంతవరకూ జరిగిన సంఘటనల్ని వరసగా పేరుస్తూ మరోసారి పరిశీలించేను.

అంధకారంలో ఆశాకిరణంలా తళుక్కుమంది ఓ ఆలోచన। భానురేఖ పడగ్గదిలో వాళ్ళిద్దరూ పెనుగులాడు తుండగా, నన్ను రెండుసార్లు కేకేశానంది పనిమనిషి. నాకు వినిపించలేదు.

మరి నిదరలో ఉన్న పురుషోత్తమరావుకి, రాత్రి ఆ గదిలోంచి కేక ఎలా వినిపించింది? పైగా అప్పుడు రెండు గదుల నడుమ వున్న ఆ తలుపులో అద్దాలు బిగించబడు న్నాయి।

అనుమానం తీర్చుకోడానికి పనిమనిషిని రెండుసార్లు కేకేశాను. అవతలినుండి సమాధానం రాలేదు. రెండు గదులు చాలా విశాలంగాను, బాగా ఎడంగాను వున్నాయి.

దీన్నిబట్టి, అతను చెప్పిందంతా అబద్ధమనీ, భార్యమీద అనుమానం రేకెత్తించడానికే, ఆ పథకంవేసి ఆత్మహత్య జేసుకున్నాడనీ స్పష్టమౌతోంది।

భార్య జీవితంలో పరపురుషుడు ప్రవేశించేసరికి, అతనిలోని సుపీరియారిటీ కాంప్లెక్స్ దెబ్బతిని, ఆ స్థానే ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ జనించింది.

దాంతో, అతను మానసిక రుగ్మతకి గురయ్యేడు. ఆ రుగ్మతవల్లే అతనికి తనమీదా, భార్యమీదా జీవితం మీదా. చివరికి లోకంమీదా రోతపుట్టింది!

ప్రతీకారం ఎలా తీర్చుకోవాలా అని పథకాలు అల్ల సాగేడు. ఆ ప్రయత్నంమీదే మొదట నన్ను కలుసుకుని, భార్యమీద అవీ ఇవీ కల్పించి నా దృష్టిలో ఆమెని చెడుగా చిత్రించేడు.

తరవాత, రాత్రి తానే రీడింగ్‌లాంప్ బల్బును హోల్డర్‌లో వదులుజేసి, ముక్కాలిపీటని తలుపుదగ్గర పడేసి, చేతులతో అద్దాలు పగలగొట్టి గాయాలేర్పరచు కున్నాడు.

'శభాష్ మిస్టర్ పురుషోత్తమరావ్! తెలివంటే నీదే! భార్య బ్రతుకు నరకం జేద్దామని ఇంత అద్భుతంగా అల్లిన నీ పథకం, అతి చిన్న పాయింటుతో పల్టీకొట్టింది. నీ చివరికోరిక తీర్చలేకపోతున్నందుకు చింతిస్తున్నాను' అనుకుంటూ భానురేఖ గదివైపు నడిచేను.

శబ్దంవిని, సజల నయనాలతో తలెత్తింది. "నన్ను మీ వెంట తీసికెళ్తారా?" అడిగింది నిర్లిప్తంగా.

పనిమనిషి ఆవిడను కనిపెట్టుకుని అక్కడనే నిలబడి వుంది.

"నో! ఆ అవసరం ఇకలేదు. మీరు నిర్దోషి అని రుజువయింది. వస్తా! విష్‌యూ బెస్టాఫ్ న్యూ లైఫ్!" అంటూ తలుపువైపు అడుగులువేశాను. □□□

కిలాడీలకు కిలాడీ!

యస్. యస్. శాస్త్రి

పాంటు జేబులో చేతులు పెట్టుకుని, తాపీగా నడుస్తు న్నాను బీచ్ రోడ్డుమీద.

టైము సాయంత్రం అయిదయి వుంటుందేమో.

సముద్రపు కెరటాలు అంతెత్తున విరుచుకు పడుతో న్నాయ్. రోడ్డు నిర్మానుష్యంగావుంది.

కనుచూపుమేరలో జనం ఎవ్వరూలేరు. కారణం ఈ ప్రదేశంలో సముద్రపు కెరటాలు చాలా ముందుకు వస్తాం టాయి. ఇసుకప్రదేశం గూడా తక్కువ. అందుకే ఇక్కడ జనం అంత కనుపించరు.

చల్లని సముద్రపుగాలి మెల్లగావీస్తూ ఆహ్లాదం కల్గిస్తోంది.

అపుడపుడూ తీరంమీద దుముకుతున్న కెరటాలవైపు చూస్తూ అడుగులు వేస్తున్నాను.

అలాంటి సమయంలో ఓ కారు నన్ను దాటుకుని ముందుకుపోయింది.

కొంతదూరంపోయిన ఆ కారు టక్కున ఆగింది. మరుక్షణం ఓ వ్యక్తి పరుగెత్తుకువచ్చి, కారు ఫ్రంట్ డోరు గభాలునలాగి, లోనున్న శాల్తీని బయటకులాగాడు. ఆ క్షణంలోనే మరొకడువచ్చి మొదటివాడితో కల్సేడు.

క్షణంలో పరిస్థితి అర్థమైంది నాకు.మరేం ఆలోచించక రేసు గుర్రంలా ముందుకు దౌడుతీసేను అరుస్తూ.

ఆ యిద్దరు రౌడీలు చటుక్కున తలలు తిప్పి చూసేరు నా వైపు. ఆ కారులో వున్న వ్యక్తి గట్టి పిండంలా వున్నాడు. అదే అదననుకుని 'హేండ్ స్టిక్'తో ఒకడి బుర్ర మీద సరిగమలు పల్కించేడు. ఈలోపల నేనా రెండోవాడిమీద పడ్డాను. ఆయనగూడా చేతికర్ర తిప్పసాగాడు గిరగిరా అభిమన్యుడిలా.

నిజానికా యిద్దరు చిన్నసైజు ఏనుగుల్లా వున్నారు, నే నొచ్చేనని భయపడి ఆయన కర్రసాము ఎక్కువవటంతో మాకో సలాంకొట్టి, కాళ్ళకు బుద్ధి చెప్పారు.

నేనూ వెంటపడబోయేను.

"ఆగు బాబూ!" అంటూ వారించేడా వ్యక్తి. అప్పుడు చూసేనతన్ని తీరిగ్గా.

నలభై కి పైనే వుంటుందతని వయస్సు. ఖరీదైన బట్టలు వేసుకొనున్నాడు. ముఖంలో గంభీరత వున్నా కళ్ళల్లో ఏదో వెలితి కన్పిస్తోంది.

ఆయన గూడా నన్ను పరీక్షగా చూసేడు.

కొద్దిగా చిరిగి మాసిన బట్టలు. సెంటిమీటరు పొడవు పెరిగిన గెడ్డం. కాళ్ళకి చెప్పలున్నా వాటిల్లో ఒకదానిపట్టీ మరో జోడుది. జిడ్డోడుతున్న ముఖంలో దీనత్వం. ఇది

నా అవతారం.

ఆయన చిరునవ్వు నవ్వాడు.

"ఎవరు బాబూ నువ్వు?"

"ఒంటరిని. అంతేకాదు, మనదేశంలో డిగ్రీలు వుండి వుద్యోగాల్లేక రోడ్డునపడ్డ ఎందర్లోనో నేనూ ఒకణ్ని? నా పేరు సతీష్" తాపీగా అన్నాను.

ఆయన నవ్వి, అన్నాడు

"డబ్బుండీ మనస్సుకు తృప్తి, శాంతిలేనివాణ్ని నేను. నన్ను విశ్వనాథం అంటారు."

నేను కొద్ది ఆశ్చర్యంగా చూపి అన్నాను.

"అద్సరే....మీరలా కారు ఆపకపోతే ఈ విపత్తు సంభవించేది కాదేమో. ఎందుకలా ఆపేరు కారుని?"

"ఎవడో రోడ్డుమీద పడుంటే పాపం అని ఆపేను. కాని వెధవలిలా మోసం చేస్తారనుకోలేదు. మంచిగా అడిగితే ఏమేనా ఇచ్చేవాణ్నేమో! మిస్టర్ సతీష్! నేనెన్నడూ మంచిని గౌరవిస్తాను." అన్నాడాయన కొద్ది ఆవేశంగా.

ఓక్షణం తోచనట్టుండిపోయి ఏదో అనబోయేను. కాని వెంటనే అన్నాడాయన.

"సతీష్! నేనిలాటి నిర్జనప్రదేశాలకి రావటం ఆశ్చర్యం అన్పిస్తోందిగదూ నీకు!"

ఆశ్చర్యంగా చూసేను ఆయనను.

ఆయన నవ్వి, "సతీష్! నువ్వు ఇక్కడికి మనశ్శాంతి కోసం వస్తూంటావుగదూ!" అన్నాడు.

"....ఆ....ఆ" అన్నాను వెంటనే. ఆయన ఆవేదనగా చూసాడు.

"సతీష్....నేనూ.... అందుకే వస్తుంటానీ ప్రశాంత వాతావరణానికి. ఆ మనశ్శాంతి కరవయింది నాకు....!"

"అంటే....?" అర్థంకానట్టు చూసేను.

"అవును. ఒంటరిని, నా భార్యెప్పుడో చనిపోయింది. నా కెంతో డబ్బుంది. అనుక్షణం డబ్బు, ఆస్తి అంటూ

పీక్కుతినే ఓ తాగుబోతు తమ్ముడు, బావ వున్నారు. అను క్షణం నాకు మనశ్శాంతి దూరంచేస్తూ. నా చావుకోసం అర్రులు చాచి చూస్తుంటారు గద్దల్లా. అలాటప్పుడు నాకు మనశ్శాంతి ఏదీ?" విశ్వనాధంగారి గొంతు జీరబోయింది.

నేనాయన్ను జాలిగా చూసి, "క్షమించండి! మీ బాధ నర్థం చేసుకోలేకపోయేను. సరే ఇకనాకు శలవిప్పించండి!" అన్నాను.

"ఎక్కడికి....?"

"హు...." నవ్వేను. మంచికీ ప్రపంచంలో చోటెక్కడ....? అందుకే...."

ఆయన నవ్వి, "సతీష్! అక్కడే పొరపడుతున్నావ్. మంచే గెలుస్తుంది చివరకు. చెడుదెన్నడూ తాత్కాలిక గెలుపే. నీ మంచితనమే నీ జీవితాన్ని చిగిరింపచేస్తోంది." అన్నారు నన్ను ఆప్యాయంగా చూస్తూ.

"సార్! .... ఏమిటి మీరనేది....?" తికమకగా చూసాను.

"నువ్వు నాతో రాబోతున్నావ్....!?" అన్నాడు ఆయన చిన్నగా నవ్వుతూ.

2

బూట్స్ లేసులు ముడిపెట్టుకుంటూ తాపీగా చూసాను తల తిప్పి—

ఆ విశాలమైన హాల్లో ఓ సోఫాలో విశ్వనాధంగారి తమ్ముడు పురుషోత్తం కూర్చునున్నాడు తాగుతూ. అతని చూపులు నావేపేవున్నాయి తినేసేలా.

నేనీ ఇంటికి వచ్చినపుడు పురుషోత్తం నానా హంగామా, శివతాండవం చేసేడు. కాని విశ్వనాధంగారి తీక్షణ మాటలతో శాంతించేడు.

మరో సోఫాలో కూర్చుని చక, చకా చుట్ట తాగేస్తోన్న విశ్వనాధంగారి బావ నాగరాజు మొదటినుండి స్తబ్దుగా వున్నాడు.

లేసులు ముడివేసుకోవటం పూర్తి చేసుకుని చక, చక నడిచేను విశ్వనాధంగారి గదిలోకి.

"ఏం సతీష్! ఇలా వచ్చేవు?" విశ్వనాధంగారు నవ్వుతూ అడిగేరు.

ఆయన ముఖంలో పూర్వం వున్న వెలితి, ఆవేదన లేవు ఇపుడు. కారణం, నేనేనని నాకు తెల్సు.

"ఏంలేదు. సాయంత్రం నాల్గున్నర అయింది. బీచ్ వేపు వస్తారనీ...." అన్నాను.

ఆయన రిలీఫ్‌గా నవ్వేపి. "సతీష్! నాకివాళ రావా లన్పించటంలేదు. నువ్వు వెళ్ళు...." అన్నారు.

"అదేం... మీరు...." అర్ధోక్తితో ఆపేను.

"సతీష్! పూర్వం మనశ్శాంతికోసం బీచికి వెళ్ళేవాణ్ని. కాని ఇపుడా తృప్తి ఇంట్లో నీవల్లే లభిస్తోంటే ఇక వేరే చోటికి వెళ్ళటం దేనికి?" అన్నారు ఆప్యాయంగా చూస్తూ.

నవ్వేపి, బయటకు నడిచేను. కారులో కూర్చుని స్టార్ట్ చేసేను.

కారు మెల్లగా బీచ్ రోడ్ వేపు దారితీసింది.

బీచ్‌వద్ద కారు ఆపి కిందకు దిగేను. ఇసుకలో గంతు లేస్తున్న పిల్లలు, కూర్చునున్న జంటలు కన్పించేరు.

తాపీగా సిగరెట్ తీపి నోట్లో పెట్టుకుని వెల్గించుకో బోతుండగా ఓ పన్నెండేళ్ళ కుర్రాడు పరుగెత్తుకుని వచ్చేడు.

"ఏంకావాలి బాబూ" నవ్వుతూ అడిగేను.

ఆ కుర్రాడు జేబులోంచి ఓ చిన్న కాగితం తీసి అందించి."సార్....! ఈ అడ్రస్‌వున్న ఇంటికి మిమ్మల్ని రమ్మని ఓ 'అమ్మాయి' చెప్పింది," చెప్పాడు.

"ఎక్కడ కన్పించింది?" అన్నాను.

"కారులో వెళ్తూ ఇచ్చేరు....నే వెళ్ళిపోతాను." ఆ కుర్రాడు పరుగెత్తబోయేడు. చటుక్కున వాడి రెక్క పుచ్చుకున్నాను.

బితుగ్గా చూసేడా కుర్రాడు.

నవ్వి. జేబులోంచి ఓ రూపాయి తీసి ఇచ్చేను.

"ఊ....ఇప్పుడు చెప్పు? నాతో ఇలా చెప్పమని ఈ చీటి ఇచ్చి పంపింది ఆడదా. మగాడా?" తీక్షణంగా చూసేను.

"మగ అతనేనండి...." ఆ కుర్రాడు వెంటనే చెప్పేడు.

"సరే నువ్వు వెళ్ళు....!" అన్నాను సాలోచనగా.

ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు.

రెండు క్షణాలు ఆలోచించి, కాగితంలోని అడ్రసు మరోసారి చూచుకుని, కారు ఎక్కాను. రివ్వున సాగింది కారు.

ఇందాక వెల్గించబోయిన సిగరెట్టు వెల్గించే నిపుడు.

మరో అయిదు నిమషాలకి కారుని ఓ చిన్న ఇంటికి దూరంగా ఆపబోయి, ఆ ప్రయత్నం విరమించుకుని, సరాసరి ఆ యింటిముందే ఆపేను.

నా కందిన ఎడ్రసు గల యిల్లు అదే! ఆ కాలనీ అంత మంచిదికాదు. జేబులో తడుపుకున్నాను. పిస్తోలు గట్టిగా తగిలింది, అది సైలెన్సరు.

ఆ చుట్టుపక్కల ఎవరూ లేరు.

శత్రువుల అతి తెలివికి నవ్వుకుంటూ, పిస్టల్ తీసుకు చేత్తో పట్టుకుని, బూట్స్ స్పాంజ్ మీద వేస్తున్నట్టు వేస్తు నడుస్తూ తలుపులవద్దకు చేరుకున్నాను.

ఓ క్షణం ఆలోచించి "టక్ ....టక్ ...." మని తట్టేను తలుపుల్ని. యెటువంటి రెస్పాన్స్ లేదు లోనుంచి.

ఓ క్షణం ఆగి, మెల్లిగా తలుపులు తోస్తూ అలాగే సాష్టాంగ నమస్కారం పెడుతున్నట్టు ముందుకుపడి, పిస్తో లున్న చేయి ముందుకు చాచేను.

మరుక్షణం "స్....స్ ..." మన్న రెండు ధ్వనులు అక్కడి నిశ్శబ్దాన్ని చీల్చేసాయి. వాటిలో ఒక ధ్వని శూన్యంలోకి పోయింది. కాని మరో ధ్వని అంతమవ డంతో "హా" మన్న మూల్గు "కిళింగ్" అన్న మరో ధ్వని వెలువడ్డాయి.

విజయగర్వంతో నవ్వుకుంటూ లేచి నిలబడ్డాను.

గదిమధ్య ఓ వ్యక్తి పడున్నాడు జబ్బ పట్టుకుని. ఓ పక్కన పడివుంది అతడి పిస్తోలు. వాడివద్దకు నడిచేను. దున్నలా వున్నాడు వాడు.

"నువు కిరాయి వెధవ్వని నాకు తెల్సుగానీ, నిన్నీపనికి నియమించిందెవరు?" తీక్షణంగా అడిగేను.

జవాబులేదు.

"పోన్లే, అదెవరో నాకు తెల్సు! గాని ఒకటి గుర్తుం చుకో! నీకు బహూకరించింది అతి చిన్న శిక్ష. మరోసారి నా వెంటపడితే ప్రాణాలు తీస్తాను!" అని చకచక బయ టకు నడిచేను.

3

'హోటల్ మయూర' ముందు కారాపాను.

కారునుండి దిగి, గబగబ లోనికి నడిచేను.

డైనింగ్ హాల్లో ఓ పక్క పురుషోత్తం కూచున్నాడు. సరాసరి అక్కడకు నడిచి ఎదురుగా వున్న కుర్చీలో కూచున్నాను.

తెరుచుకునున్న పురుషోత్తం నోరింకా మూసుకోలేదు.

"ముందు నోరు మూయండి. లేపోతే ఈగలు పోగలవు" సిగరెట్ పాకెట్ తీస్తూ అన్నాను.

"నువ్వా....!"

"చావలేదు....పైగా మీ'వాణ్ని' చావుదెబ్బ కొట్టి వచ్చేను. ముందు వెళ్ళి వాడికి ఫస్టెయిడ్ చేయించు...." తాపీగా అన్నాను.

పురుషోత్తం కళ్ళు అగ్నిగోళాలయ్యాయి.

"షటప్... య్యూ ఆరె...."

"....యముడు టు యు...."సన్నగా నవ్వేను.

"మిష్టర్ సతీష్! నేననుమానిస్తూనే వున్నాను. చెప్పు ఎ...."

"షటప్ యు బాబూన్! ఇకముందిటువంటి పిచ్చి ప్రయత్నాలు చేయక. నేనెలాగూ మొండిఘటాన్ని. నన్ను తక్కువ అంచనా వెయ్యకు...." చటుక్కున లేచి నిలబడ్డాడు.

"సార్....!" తిరిగి చూసేను సర్వరు!

"చూడు! నాకేంవద్దు గానీ, ఇదిగో ఈయన మూర్ఛలో వున్నాడు. పట్టిలేపు" అని పురుషోత్తాన్ని చూపి, నడిచేను బయటికి.

రివ్వున సాగుతున్న కారుని బంగళాముందు బ్రేకువేసి పోర్టికోలోకి తిప్పి ఆపేను.

హాల్లోని సోఫాలో విశ్వనాధంగారు కనిపించేరు కూర్చుని.

ఆయన ఎదుటనున్న సోఫాలో కూర్చున్నాడు.

మేడమీద. మెట్లు ఎక్కగానేవున్న స్తంభం వారనుండి నాగరాజు గమనిస్తున్నాడని. మాటువేసి మాటలు విన టంలో ఆతను ఎక్స్‌పర్టని నాకు తెల్సు.

"విశ్వనాధంగారూ! ఓ విషయం చెప్పాలనుకుంటు న్నాను" అన్నాను.

"ఏమిటి బాబు నువ్వనేది." ఆయనన్నాడు తికమకగా చూస్తూ. గంభీరంగా అన్నాను.

"నా మీద ఇప్పటికి మూడు హత్యాప్రయత్నాలు జరి గేయి. మొదటి రెండు కాకతాళీయంగా జరిగినవేమో నను కున్నాను. కాని. మూడోప్రయత్నంలో ఋజువయ్యింది నన్నెవరో చంపజూస్తున్నారని" అన్నాను.

విశ్వనాధంగారు ఉలిక్కిపడ్డాడు.

"సతీష్! నేననుకుంటూనేవున్నాను. ఆ పన్లు...." గాభరాగా అనబోయేరు.

"....విశ్వనాధంగారూ! నా గురించి నాకే విధమయిన బాధలేదు. కాని....కాని మీ గురించే నా భయమంతా! మిమ్మల్నుగూడా హత్యచేయాలని చూస్తున్నారు శత్రువులు" అన్నాను గాభరాగా చూస్తూ.

ఆయన నిట్టూర్చేరు.

"సతీష్! నా గురించి ఆలోచించేవాడివి నువొక్కడివే అని తెల్సు. నీకేవిధమయిన ప్రమాదం తటస్థించటం నేను

సహించలేను. ఎడారిలో తిరుగాడే మనిషికి నీరు ఇచ్చి నట్లుగా నాకు మనశ్శాంతినందించేవు. ఆలోచించాలి.... ఏదో నిర్ణయం...." ఆయన ఏదో గొణుక్కున్నారు ఆలోచిస్తూ.

సాలోచనగా లేచి నిలబడ్డాను.

4

"వ్వాట్! పురుషోత్తం. నా తమ్ముడు హత్యచేయ బడ్డాడా?" నమ్మనట్టు చూసేరు విశ్వనాథంగారు.

నేను ఆశ్చర్యంగా చూసేను.

ఇన్స్పెక్టర్ వినోద్ అదోలా చూసేడు విశ్వనాథంగారి వేపు.

"అవును మీ తమ్ముడు పురుషోత్తంగారే. పక్క వీధిలోనే చంపబడ్డారు. ఆయన కారుడ్రైరుని హంతకుడు ముందు షూట్ చేసివుంటాడు సైలెన్సర్‌తో. తర్వాత ఆయన్ను షూట్ చేసేడు. ఈ వార్త ఇంత ఉదయం తెలియచేయటం బాధగావున్నా తప్పదుగా. బైదిబై, రండి శవంవద్దకు వెళ్దాం!" అన్నాడు.

ముగ్గురం జీపు ఎక్కాం.

త్రోవలో ఇన్స్పెక్టర్ చెప్పాడు. ఎవరో ఫోన్ చేసి చెప్పారుట, రోడ్డుమీద కారులో శవం వుందని. ఆ శవం పురుషోత్తంగారిదని తెల్సినవారెవరో చెప్పేరుట.

మేమక్కడికి చేరుకునేసరికి 'తతంగాలు' చకచక సాగుతున్నాయి.

అన్ని ముగిసి, శవాన్ని పోస్ట్మార్టమ్‌కు పంపేంత వరకు ఇన్స్పెక్టర్ వినోద్ ఎటువంటి ప్రశ్నలు వేయలేదు. తన సూదంటు చూపుల్తో ప్రతిఅణువుని పరికిస్తూ వుండి

పోయేడు. ఉన్నట్టుండి ఓ వస్తువు ఏరి జేబులో వేసుకోటం నేనొక్కడ్నే గమనించేను.

విశ్వనాథంగారిలో ఏ భావమూ కదలలేదు. మవునంగా వున్నారాయన.

ఇంటికి వచ్చేం అందరం.

తరువాత మామీద కురిపించేడు ప్రశ్నలవర్షాన్ని ఇన్స్పెక్టర్.

"విశ్వనాథంగారూ! చెప్పండి. నేను మీ తమ్ముడు చని పోయారని చెప్పినపుడు మీరు చాలా ఆశ్చర్యపోయారు కారణం?"

"ఇన్స్పెక్టర్! నా తమ్ముడు తాగుబోతు....దుష్టుడు.... మరెన్నోకూడా. ఒకర్ని చంపాలనుకునే వాడు తానే చంప బడితే ఆశ్చర్యకరమే అనుకుంటాను...."

ఇన్స్పెక్టర్ వినోద్ కొద్ది ఆశ్చర్యంగా చూసేడు.

"బై దిబై ....నిన్నరాత్రి పురుషోత్తంగారు ఎన్ని గంటల వరకు ఇంట్లో వున్నారు?" అడిగేడు.

"రాత్రి ఏడు గంటలకి ఇంటినుండి బయలుదేరేరు" అన్నాడు.

"ఆయన రాత్రంతా రానందుకు మీకేమి అన్పించలేదా?" అన్నాడినస్పెక్టర్.

విశ్వనాథంగారు నవ్వి. "వాడికి సాధారణంగా రాత్రిళ్ళు ఇంట్లో గడపకపోవటం అలవాటే!" అన్నారు.

"మీ బావ నాగరాజుగారు ఎక్కడున్నారు నిన్నరాత్రి?"

"అతను క్లబ్బులవెంట తిరిగి రాత్రి ఏ పదకొండుకో వస్తూంటాడింటికి" అన్నారు విశ్వనాథంగారు.

"నాగరాజుగారూ! మీరెన్ని గంటలకి వచ్చేరింటికి....?" అక్కడేవున్న నాగరాజుని అడిగేడినస్పెక్టర్.

"నేను పదిన్నర వరకు క్లబ్బులోనే గడిపేను." అన్నాడు నాగరాజు.

"డియర్ ఇన్‌స్పెక్టర్! పురుషోత్తానికి చాలామంది శత్రువులుండటానికి అవకాశం వుంది...." అన్నారు విశ్వనాథంగారు.

ఇన్‌స్పెక్టర్ నవ్వి, వూరుకున్నాడు.

"ఇన్‌స్పెక్టర్ పురుషోత్తంగారెన్ని గంటలకి చంప బడ్డారు?" అడిగేను నేను.

"డాక్టర్ రిపోర్టు అందితేగాని చెప్పటం కష్టం!" అని విశ్వనాథంగారివేపు చూసి.

"విశ్వనాథంగారూ! మీ ఆస్తిగురించి చెప్పగలరా?" టక్కున అడిగేడు.

"సారీ! ఈ ఆస్తంతా నా కష్టార్జితం. ఇంతకన్నా నేనేం చెప్పలేను."

ఆశగా చూసిన నాగరాజు పళ్ళు నూరుకోవటం గమనించేను.

ఇనస్పెక్టరు వినోద్ 'వస్తా'నని చెప్పి. వెళ్ళిపోయేడు.

మిగతా ఆ రోజంతా స్తబ్దుగా గడిచింది.

ఆ సాయంకాలం కారుతీసుకుని బయలుదేరేను.

కారుని 'హోటల్ మయూర' ముందు ఆపి నడిచేను. అన్నివైపులకు జాగ్రత్తగా చూసుకుంటూ నడిచేను.

మరో నిమిషానికి రూమ్‌నంబర్ ముప్ఫయిలో వున్నాను.

5

రేడియండైల్ వాచ్‌లో టైం చూసుకున్నాను.

పెద్దముల్లు పన్నెండుమీద చిన్నముల్లు పదకొండుమీద కనుపించేయి. అంతా చీకటి. సూది పడితే విన్పించేంత నిశ్శబ్దం!

పాంటు జేబులోంచి గ్లవ్స్ తీసి చేతులకి తొడుక్కున్నాను.

తరువాత లేచి నా బెడ్ తలగడ కిందవున్న ఒక వస్తువుని బయటకు తీసాను.

ఆ వస్తువు కత్తి. అంత చీకటిలోనూ మెరుస్తూ కన్పించింది.

నవ్వుకుని, పిల్లిలా నడిచేను బయటికి. ఇంట్లో నాగరాజు లేడు. బహుశా, యేక్లబ్బులోనో పడివుంటాడు తాగి.

నెమ్మదిగా నడిచి, ఓ గదిముందాగేను. అది విశ్వనాథంగారి గది.

తలుపులు తోసేను. తెరుచుకున్నాయి. లోన కడుగు పెట్టి తలుపులు చేరేసి తడిమి స్విచ్ నొక్కేను. బల్బు వెలిగి గదంతా వెలుగుతో నిండింది.

పడుకునున్న విశ్వనాథంగారు ఉలిక్కిపడి లేచేడు.

నన్ను చూచి ఆశ్చర్యపోయి, నవ్వేరు ఆప్యాయంగా.

"సతీష్! నువ్వా! ఇంత రాత్రప్పుడు...." అన్నారాశ్చర్యంగా.

తాపీగా నవ్వాను.

"విశ్వనాథంగారూ! అదలా వుంచండి. ఆస్తంతా నా పేర వ్రాయించేరుగదూ," అన్నాను.

ఆయన మనస్ఫూర్తిగా నవ్వేరు.

"అవును సతీష్! నాకు మిగిలిన ఆత్మీయుడివి నువ్వే. ఇక నా మిగిలిన జీవితం ప్రశాంతంగా గడపదల్చేను. అందుకే బిజినెస్, అన్ని బాధ్యతలు నీ కప్పగించేను.

ఇంకా రేపు చెప్దామనుకుంటున్నానే. నీకెలా తెల్సిందీ విషయం....?" అన్నారు ఆప్యాయంగా చూస్తూ.

పక, పక నవ్వేను.

"డియర్ విశ్వనాధం! దట్సాల్....అదే....అందుకే ఇంతవరకు అతి కష్టంమీద, జాగ్రత్తగా గడుపుతూ వచ్చేను. ఇంతటితో సాధించేను...." తాపీగా అన్నాను.

ఉలిక్కిపడ్డారు విశ్వనాధంగారు. తికమకగా చూసేరు.

"సతీష్! ఏవిఁటి నువ్వనేది? అసలేమిటిదంతా?"

"అదే....ఇదంతా నాటకం....నేనంతా బూటకం.... ప్లాన్!....ప్రీ ప్లాన్!!" కనుబొమ ఎగురువేసేను నవ్వుతూ.

పిచ్చివాడిలా చూసేరు విశ్వనాధంగారు.

జేబులోంచి కత్తితీసి పట్టుకున్నాను.

"పూర్....విశ్వనాధం? అంతా చెప్తాను విను. లేకపోతే చచ్చి దెయ్యం అవగలవ్. నీ తమ్ముడు పురుషోత్తం, బావ నాగరాజు గుంటనక్కల్లా ప్రయత్నించేరు. కాని ఏమి ఫలించలేకపోయింది.

అలాటప్పుడు నాగరాజుకి అమోఘమైన ప్లాన్ తట్టింది. ఈ వయసులో నీకు కావాల్సింది....ఒకరి ప్రేమ,ఓదార్పు, మనశ్శాంతి!

అది గ్రహించేడు నాగరాజు. 'చెడు'తో నీదగ్గర ఏవీ సాధించలేనని తెల్సుకున్నాడు. అప్పుడే నన్ను నియమించేడు. దాని సారాంశమే ఆ రోజు రౌడీలు మీ వద్దకు రావటం, నేను వారితో తలపడినట్టు నటించటమూను అఫ్ కోర్స్! ఆ రౌడీలు అంతా ఆ 'నాటకం'లో ఓ చాప్టరు.

నా పరిస్థితి. మాటల్తోను మిమ్మల్ని ఆకర్షించేను. మీ చుట్టూ మీక్కావాల్సిన ప్రేమ, ఆప్యాయత అనే 'విష వలయం' నిర్మించేను. అనుకున్నట్టే మీరు చిక్కుకున్నారు.

అయితే నా రాక పురుషోత్తానికి సహించలేదు. రోజు రోజుకు మీకు నాపై అభిమానం పెరుగుతూండటం గ్రహించి, భయంతో నన్ను చంపించటానికి ప్రయత్నించాడు. కాని నేను తక్కువ రకం గాదు. నేనో ఘరానా కిలాడీని. అందుకే అతని ప్రయత్నాలు ఫలించలేదు...." ఆగి చూసేను.

విశ్వనాథంగారు మతిలేనివాడిలా చూస్తున్నాడు.

నిశ్శబ్దంగా నవ్వాను.

"....మిమ్మల్ని హత్యచేసినా, ఆస్తి తనకు దక్కే అవకాశం లేదనుకున్నాడు నాగరాజు. నన్ను నియమించేడు. అతని ప్లాన్ నిజంగా ఫలించింది. హోటల్ మయూర రూం నెంబరు ముప్ఫయ్‌లో నాగరాజుని కలిసేవాణ్ని. ప్లాన్ గురించి మాట్టాడుకునేవాళ్ళం. పాకం ముదిరాక నాగరాజు పురుషోత్తాన్ని హత్యచేసేడు. ఆ తరవాత మీ రనుకున్నట్టే ఆస్తి నా పేర వ్రాసేసేరు యెందుకైనా మంచిదని. నన్ను పూర్తిగా నమ్మేరు....కాదు....నేనే నమ్మించేను. మీరు లాయర్‌ను కలవటం అంతా నేనో కంట కన్పెడుతూనే వున్నాను. కానీ...."

పకపక నవ్వేను.

"....ముందే అన్నాను. నేనోఘరానా వెధవనని. నన్ను నమ్మటమే నాగరాజు చేసిన తప్పు. పురుషోత్తాన్ని హత్య

చేసేడు నాగరాజు. కాని అతడికి తెలీకుండా 'నాగరాజు' అని పేరున్న అతని సిగర్ లైటర్ హత్యాప్రదేశంలో వుంచేను. దాన్నే వశం చేసుకున్నా డినస్పెక్టరు. మరి కొంత పరిశోధనలో అతనే హంతకుడని తేలుతుంది.

ఇపుడు నేను మిమ్మల్ని చంపేస్తున్నాను. నామీద ఎవరకు ఆవంత అనుమానం రాదు. కారణం. మీకు నేనేమీ కాను. మిమ్మల్ని చంపినా ఆస్తి నా కెలాగూ రాదు. మీరు నాకే ఆస్తి వ్రాపినట్టు ఇంకా వెల్లడి అవలేదు. ఈ విషయం నాగరాజుకూ్కడా తెలీదింకా. మిమ్మల్ని హత్య చేయాల్సిన అవసరం అతనికే వుంది.

అంతే కాదు. ఈ కత్తిపిడిమీద వేలిముద్రలున్నయ్. అవి నాగరాజువి. ఈ దెబ్బతో అతను జైలుపాలవుతాడు. నాకే అడ్డు వుండదు ఆస్తంతా నాదే...."

వికటంగా నవ్వుతూ ముందుకు కదిలేను.

"నయవంచకుడా...." అరవబోయారు విశ్వనాథం గారు.

గట్టిగా నవ్వుతూ చేతిలోని కత్తి ఎత్తేను.

"ఢాం....!" అన్న శబ్దంతో గది ప్రతిధ్వనించింది.

బాధగా చేయి పట్టుకుని చూసేను.

అప్పుడే తలుపులు తోసుకుని లోనికి ప్రవేశించేరు పోలీసులు.

ఓ చేతిలో పిస్తోలు, మరో చేతిలో టేప్ రికార్డర్‌తో గంభీరంగా నవ్వుతూ మంచంకిందనుండి పైకి వచ్చేడు ఇన్‌స్పెక్టర్ వినోద్.

పిచ్చి ఎ_త్తినట్టయింది నాకు.

"ఏవిఁటిదంతా?" మతిపోయినట్టు అడిగేను.

"ప్లాన్....ప్రీ ప్లాన్" మెల్లగా నవ్వేడినస్పెక్టరు.

విశ్వనాథంగారివేపు చూసేను. ఆ కళ్ళల్లో ఎప్పటిలాగే వెలితి, ఆవేదన.

"మిస్టర్ సతీష్! మీరుంచిన నాగరాజు సిగర్ లైటర్ మాత్రమేగాదు. హత్య పది పదకొండు మధ్య జరిగింది. అయితే పదిగంటల ప్రాంతంలో నాగరాజు క్లబ్బునుండి మెల్లగా బయటపడ్డం ఓ సర్వరు గమనించేడు. మరో అర గంట తర్వాత తిరిగి అతను రావటం చూసి ఆశ్చర్య పోయేడు.

నాగరాజు పురుషోత్తాన్ని హత్యచేసి అతని శవాన్ని, అతని కారుతోపాటు ఓ వీధిలో వదిలేసి వెళ్ళిపోయేడు. మరో విషయం. ఆ వీధిలో ఓచోట 'బురద' వుంది. ఇప్పటికి ఆ బురద అతని జోళ్ళకుంది. బై దిబై.... అతన్ని ముందే బంధించేము. ఆ సాయంత్రమే నువ్వు యెప్పటిలా నాగరాజుని రూం నెం. ముప్ఫయ్‌లో కల్సేవు. అదే జరిగుండకపోతే నీ ప్లాన్ ఫలించేదేమో?...." అని విశ్వనాథంగారివేపు చూసేడు ఇన్‌స్పెక్టరు.

"....సతీష్! నువ్వు వెళ్ళిన కొద్దిసేపటికే నాకు ఫోన్ వచ్చింది. ఢిల్లీనుండి ఏదో పనిమీద ఇక్కడకు వచ్చిన నా స్నేహితుడు సురేంద్రనాథ్ ఫోన్ చేసేడు. తను హోటల్ మయూరలో ముప్ఫయొకటో నెంబరు రూంలో బసచేసే నని, వెంటనే రమ్మని ఫోన్ చేసేడు. నేను వెంటనే బయలుదేరేను.

అయితే పొరపాటున ముప్పయ్యొకటో రూంకు బదులు ముప్పయ్ రూం ముందాగేను. తలుపు తట్టబోతుండగా పకపక నవ్వు విన్పించింది గట్టిగా. ఆశ్చర్యపోయేను. ఆ గొంతు సీదన్పించింది. ఆశ్చర్యం తీరక కీ హోల్‌లోంచి చూసేను. లోపల నువ్వు. నాగరాజు తాగుతూ...." విశ్వనాధంగా రేదో అంటున్నారింకా.

"... మిస్టర్ సతీష్! లాయరువద్దకు పోవటం....ఆస్తి ....అంతా మా నాటకం. అనుకున్నట్టే నువ్వు మా వల్లో పడ్డావ్. నాగరాజు నిన్ను నమ్మి నియమించేడు. కాని చివరలో అతన్ని మోసంచేసి, జైలుపాలుచేసి, ఆస్తి దక్కించుకుందామనుకున్నావు. కానీ...."

ఇన్‌స్పెక్టర్ వినోద్ సంకెళ్ళు బయటికి తీసి నా చేతులకి తగిలించేడు.

నడవబోయేను.

"బాబూ సతీష్....!"

వెనక్కి తిరిగి చూసేను విశ్వనాధంగారివేపు. ఆయన కళ్ళలోని కన్నీరు చూసి విచలితుణ్నయేను.

మొదటిసారిగా 'ప్రేమ' అంటే ఏమిటో తెల్సింది.

"సతీష్? మొదట నువ్వు నన్ను కల్సినపుడు అన్నాను గుర్తుందా? మంచే ఏదయినా సాధిస్తుందని. గాని తప్పు నీదికాదు, పాపిష్టి డబ్బుది...." ఆయన కళ్ళనుండి జల జల నీళ్ళు రాలేయి.

"ప్లీజ్....కమాన్!...." ఇన్‌స్పెక్టర్ వినోద్ బయటికి నడిచేడు.

వెనుకనే నడిచేను ఏదో గొణుక్కుంటూ. □□□

సీరియల్

(గతసంచిక తరువాయి)

"ప్రేమ. నాన్నా-అదే ప్రేమంటే! ప్రేమ ప్రతిఫలాన్ని కోరదు. ప్రతీకారాన్ని అనుకోదు. తన కుపకారంచేసినా అపకారంచేసినా తను ప్రేమించినవాళ్ళకు మేలు చేయడమే ప్రేమికుల లక్షణం...." అంది వసంత.

"అయితే నేను నిన్ను ప్రేమిస్తున్నట్లంగీకరించావు గదా. నాకు బాధ కలిగించకుండా ఉండడంకోసం నువ్వు

మోహనరావుని మరిచిపోవాలి...." అన్నాడు బంగారయ్య.

వసంత నవ్వింది—"నేను మోహనరావుని పెళ్ళాడితే నీకు బాధ కలుగుతుందనుకోవడం నీ భ్రమ. పెళ్ళివల్ల కలిగే కష్టనష్టాలు పూర్తిగానావే. నేను మోహనరావునీ, అతని ఇంటి వాతావరణాన్నీ ప్రేమిస్తున్నాను. అతని ప్రవర్తనతో నాకు సంబంధంలేదు. అతనిగురించి నాకు తెలియని వివరాలులేవు. నా ప్రేమబలం ముందతని ప్రవర్తన ఏనాటికైనా తలవంచక తప్పదు—" దృఢంగా అందామె.

"నువ్వేమంటున్నావో నీకు తెలుసా?"

"మితిమీరిన శృంగారాభిలాషకూడా ఒక మానసిక వ్యాధి నాన్నా. ఎంతోమంది మానసికంగాచేసే వ్యభిచారాన్ని మోహనరావు శారీరకంగా చేస్తున్నాడు. ఏ వ్యాధికైనా తప్పకుండా మందుంటుంది. నేనతన్ని బాగుచేయగలను. అతని ప్రవర్తనకు సంబంధించినంతవరకూ-నాకు జాలి తప్ప మరేమీలేదు. అతన్ని నేను ప్రేమిస్తున్నాను. ఎటొచ్చీ కేవలం అతన్ని బాగుచేయాలనే ఉద్దేశ్యంతో మాత్రం పెళ్ళి చేసుకోవడంలేదు...." అంది వసంత.

బంగారయ్య మాట్లాడలేదు.

కారు కాసేపట్లో బంగారయ్య ఇంటి ముందాగింది.

25

"మిస్టర్ మోహనరావ్—" అన్నాడు బంగారయ్య.

ఎన్నడూలేని ఈ కొత్తరకం పిలుపు మోహనరావు నాశ్చర్యపరిచింది. అతను విచిత్రంగా ఆయనవంక చూపి —"నన్నెందుకు పిలిచారు?"—అన్నాడు.

"పెళ్ళిమీద నీ అభిప్రాయమేమిటి?"

"బోరు...."

"అయితే పెళ్ళిచేసుకునే ఉద్దేశ్యముందా నీకు?"

"ఒకప్పుడుండేదికాదు. కానీ తప్పదేమోననిపిస్తోం దిప్పుడు—"

"ఎందుకుతప్పదు. నీలాంటివాడు పెళ్ళిచేసుకుంటే అది ఒక ఆడపిల్ల గొంతుకోయడమేనని తెలుసుగా...."

"తెలియదు-నేను పెళ్ళిచేసుకుంటే ఒక ఆడపిల్ల గొంతుకోయడమని మీరంటున్నారు. అయితే నన్ను మనసారా ప్రేమించిన ఒక ఆడపిల్ల - నాగురించిన పూర్తి నిజాలను తెలుసుకున్నాక కూడా నన్ను పెళ్ళిచేసుకోవాలను కుంటే అదామె గొంతుకోయడ మెలాగవుతుంది?"

"చాలా బాగా మాట్లాడేనని అనుకుంటున్నావు కానీ— ఆ పిల్ల ఇంకా అభంశుభం తెలియని అమాయకురాలు. అందువల్ల అలా అనుకుంటూండవచ్చును...."

"ఎందుకీ ముసుగులో గుద్దులాట బంగారయ్యగారూ— మీ అమ్మాయి వసంత నన్ను ప్రేమించింది. పెళ్ళిచేసు కుంటానంటోంది. నేనెలాంటివాడినైనా మా ఇంట్లో స్వర్గమున్నదని ఆమె భావిస్తోంది. అలాంటి ఇల్లు తనకు మెట్టినిల్లు కావాలని ఆమె కోరుకుంటోంది. ఆమె నాక్కూడా నచ్చింది.

తనేమీ అభంశుభం తెలియని అమాయకురాలుకాదు. ఏ ప్రశ్నవేసినా ఎంతో నిశితంగా ఆలోచించి జవాబు చెబుతోంది. ఆమె కనీసం నాకన్నా తెలివైనదని నేనంగీక రించితీరాలి. ఆమెను పెళ్ళిచేసుకుతీరాలని నేను తపించి

పోవడంలేదు. కానీ ఆమె నన్ను పెళ్ళిచేసుకోవాలను కుంటే మాత్రం కాదనలేను. ఆమె కోరికను తప్పక మన్నిస్తాను...."

"మోహనరావ్-నీకిదితగదు. కన్నతండ్రిగా నా కూతురి మీద నాకు చాలా ఆశలున్నాయి. అవన్నీ ఈ పెళ్ళితో భగ్నమైపోతాయి. నీకూ ఓ కూతురుంటే తప్ప ఈ బాధ అర్థంకాదు. దయుంచి వసంత జోలికి రాకు. తనేవచ్చి అడిగినా నీకి పెళ్ళి ఇష్టంలేదని చెప్పు. తర్వాతసంగతి నేను చూసుకుంటాను...." అన్నాడు బంగారయ్య దీనంగా.

"అలాంటివన్నీ ఎప్పుడో అయిపోయాయి బంగా రయ్యగారూ-నే నంగీకరించకపోతే వసంత తన ప్రాణాలు తీసుకుంటానంది. నేను కాదనడం ద్వారా ఆమె ప్రాణాలు తీసినవాడినవుతాను. మీకు తెలియదు కానీ—ఈ పెళ్ళి ఆపితే మీ వసంత మీకు దక్కదు. మీరు మాట్లాడదల్చు కున్నదిదే అయితే ఇంక నేను చెప్పవలసినదేమీలేదు. వస్తాను మరి. సెలవ్—" అంటూ మోహనరావక్కణ్ణించి చర చరా నడిచి వెళ్ళిపోయాడు.

వెళ్ళిపోతున్న మోహనరావుని చూస్తూ బంగారయ్య పళ్ళు పటపటా కొరికాడు-"ఈ పెళ్ళి ఆపితే నా కూతురు నాకు దక్కదంటావా? ముందు నీ ప్రాణాలసంగతి చూసుకో-ఆ విషయంలో నువ్వేమీ ఆలోచించినట్లులేదు ...." అనుకున్నాడు.

ఇంక ఈ విషయంలో ఉపేక్షించి లాభంలేదు. మోహనరావు అంతుతేల్చడానికి మస్తాన్ ఆశ్రయంకోరాలి.

తన జీవితంలో ఇటువంటి పరిస్థితి ఏర్పడుతుందని బంగారయ్య అనుకోలేదు. అతనికి ఒక్కగానొక్క గారాల కూతురు వసంత. చూస్తూ చూస్తూ వసంతను మోహనరావు పాలపడనివ్వలేదు.

బంగారయ్య తన లెటర్‌పాడ్‌తీసి మస్తాన్ కుత్తరం వ్రాయసాగాడు. తన కూతురి భవిష్యత్తు దృష్ట్యా ఒక హత్య చేయవలసివుందనీ-అదిజరిగితే కోరిన ప్రతిఫలమివ్వగలననీ క్లుప్తంగావ్రాసి, ఉత్తరంలో మోహనరావు పూర్తి వివరాలిచ్చాడతను. తర్వాత ఆ కాగితాన్ని కవర్లోపెట్టి కవరు అతికించాడు. కవరు జేబులోకితోసి వీధిలోకివచ్చి-కార్లో కూర్చున్నాడు. ఒక వీధిలోని ఇంటిముందు కారాపాడు.

బంగారయ్య కారుదిగి ఇంటిని సమీపించాడు. అయిదు నిముషాలు ఆలోచించాడు. తను ఒకమనిషిని హత్య చేయడానికి పురిగొల్పుతున్నాడు. జీవితంలో మొట్టమొదటి సారిగా తనకారణంగా హత్య జరగబోతోంది. కానీ తప్పదు. తన కూతురి భవిష్యత్తు దృష్ట్యా తనేమైనా చేయాలి!

బంగారయ్య ముందడుగువేసి ఇంటితలుపు తట్టాడు. ఎవరో ఒక యువకుడువచ్చి తలుపుతీసి బంగారయ్యను చూసి నమస్కారం చెప్పాడు. బంగారయ్య దాన్నందుకుని లోపలకు నడిచాడు. తనకు తెలిసినట్లుగానే ఒక గదిలోకి వెళ్ళాడు. తలుపులు వేసుకున్నాడు.

గదిలో గోడకు లక్ష్మీదేవి పఠం తగిలించి ఉన్నది ఆయనవెళ్ళి ఆ పటాన్నితీశాడు. వెనుక ఒక చిన్న గూడుంది. బంగారయ్య తన జేబులోని కవరు నా గూట్లో

పెట్టాడు. ఆయన చేతులు వణికాయి. పటాన్ని మళ్ళీ తగిలించబోయేముందు ఆయన శరీరమంతా అదోరకమైన భయమావహించింది. ఎక్కడలేని ధైర్యాన్నికూడ గట్టుకుని మళ్ళీ ఆ పటాన్ని తగిలించాడు-యధాప్రకారంగా.

వ్యవహారం తనచేయి జారిపోయినట్లే. ఉత్తరం మస్తాన్‌కి అందేసినట్లే—

"మోహన్‌రావ్! నీ పని అయిపోయింది. నిన్నిక దేవుడుకూడా కాపాడలేడు...." అనుకున్నాడు. క్రమంగా ఆయనలో ధైర్యం, సంతోషం పుంజుకోసాగాయి.

26

"మస్తాన్‌తో గొడవపెట్టుకోవడమంటే కోరి మృత్యువు నాహ్వానించడమే...." అన్నాడు రాఘవరావు.

ఆ రాత్రి విశ్వం పడుకున్నాక ఇంట్లోని అందరూ సమావేశమయ్యారు.

"మస్తాన్ ఎవరో మాకు తెలియదు నాన్నా" అన్నాడు మోహన్‌రావు విరాగ్గా.

"వాడెవడో తెలియకపోతే నిన్ను చంపాలని ఎందుకనుకుంటాడు?"

"నన్ను చంపాలని మస్తాన్ అనబడే వాడనుకుంటున్నాడా?"—ఆశ్చర్యంగా అడిగాడు మోహన్‌రావు.

"అవును...." అన్నాడు రాఘవరావు.

"అయితే ఈ సంగతి మీకెలా తెలుసు...." అడిగాడు జగన్నాధం.

"ఏనాడో మీ యీ ప్రశ్నకు జవాబు చెప్పాల్సివస్తుందని నాకు తెలుసు. తప్పించుకోవడంకూడా కష్టం. అంతా చెప్పేస్తాను...." అన్నాడు రాఘవరావు.

అందరూ రాఘవరావువంక కుతూహలంగా చూశారు.

"మస్తాన్ చాలా ప్రమాదకరమైన వ్యక్తి. అతను చేసిన ఘోరాలనంతం. వాటిలో ఏ ఒక్క ఘోరమైనా చూపికూడా మనం తట్టుకోలేము. అందుకే హేమాహేమీలు కూడా అతని గులాములైపోయారు. అయితే కొన్ని సంవత్సరాలుగా మస్తాన్ ఘోరాలాగిపోయాయి. పోలీసుల కంతు చిక్కకుండా అతను మాయమైపోయాడు. ప్రస్తుతం మస్తాన్ ఈ ఊళ్ళోనే వుంటున్నాడు. అతను నాకు తెలుసు. తెలిసికూడా చెప్పలేను—చెప్పి బ్రతకలేను...." అని ఆగాడు రాఘవరావు.

జగన్నాధం తండ్రివంక చూసి—"ఒక నేరస్థుడి ఉనికి తెలిసికూడా దాచడం అన్యాయం నాన్నా — అతనంత ప్రమాదకరమైన వ్యక్తయితే-మీరు తప్పక అతని ఆచూకీ అందజేయవలసిందే...." అన్నాడు.

"నా గురించయితే నాకు భయంలేదర్రా—కానీ నా కళ్ళ ముందు పెరిగిన ఈ కుటుంబ సభ్యులందర్నీ కాలరాచిపారేస్తాడు మస్తాన్. అందులోనూ మామూలుగా కాదు. దారుణ హింసలకు గురిచేసి! అతను చేసే దారుణ హింసాకాండ ఒకసారి కళ్ళారా చూసినవాడు — అతనికేనాడూ ఎదురు తిరగలేడు. అందువల్లనే మస్తాన్ విషయంలో నా నోరు మూతపడింది...." అన్నాడు రాఘవరావు.

అక్కడున్న అందరికళ్ళలోనూ భయం స్పష్టంగా కనబడింది. జగన్నాధం— "అయితే ఇప్పుడు మస్తాన్ మన మోహన్‌రావుని చంపాలనుకుంటున్నాడా — తమ్ముణ్ణి మనం రక్షించలేమా?"—అన్నాడు.

"తమ్ముణ్ణి రక్షించడానికి ఒకే ఒక మార్గముంది—"

"ఏమిటది?"

"వాడొక అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడుట. ఆ పెళ్ళి ఉద్దేశ్యం మానుకుంటే వాడు రక్షించబడతాడు"—అన్నాడు రాఘవరావు.

అందరి కళ్ళలోనూ ఆశ్చర్యం కనబడింది-"తమ్ముడికి పెళ్ళా? నమ్మదగ్గమాటే?"—అన్నాడు జగన్నాధం.

"నిజమే అన్నయ్యా—వధువుకూడా వేరే ఎవరోకాదు. మీ కందరకూ తెలిసిన అమ్మాయే—వసంత।"—అన్నాడు మోహన్‌రావు తల వంచుకుని.

వసంత ఇంట్లో అందరికీ తెలుసును. రాధ, యమున, వసంత—ముగ్గురిదీ ప్రాణ స్నేహమని చెప్పవచ్చు. సత్యవతి,నరసమ్మలకుకూడా ఆమె అంటే ప్రాణం. రాఘవరావు దగ్గరకూడా ఆమె మామయ్యా అని పిలుస్తూ ఎంతో చనువుగా వుంటుంది. ఇంట్లో అందరికీ వసంత అంటే ఇష్టమే.

"బాగానే వుందికానీ-వసంత కన్యాయంచేసినట్లవదూ?" అన్నాడు జగన్నాధం.

"చాల్లెండి—అవేం మాటలు?"—అంది సత్యవతి.

"అన్నయ్య మాటల్లో తప్పులేదు వదినా—బంగారయ్యగారు కూడా అలాగే అభిప్రాయపడ్డారు. నన్ను పిలిచి ఈ పెళ్ళి మానమని హెచ్చరించారు. నేనుకూడా వసంతకు నచ్చజెప్పి చూశాను. ఆమె వినడంలేదు. తనకు మన ఇల్లన్నా-ఈ వాతావరణమన్నా చాలా ఇష్టంట. నా ప్రవర్తనలో తనకేమీ ఇబ్బందిలేదంది. ఈ ఇంట్లో పడడమే తన ధ్యేయమట. అలా జరక్కపోతే తను చచ్చిపోతానంటోంది...."

రాఘవరావు ఆశ్చర్యంగా—"ఇంతకీ ఈ విషయంలో నీ అభిప్రాయమేమిటీ?" అన్నాడు.

మోహన్‌రావు క్షణం తటపటాయించి జవాబు చెప్పాడు—"నిజానికి నాకు పెళ్ళంటే సుముఖతలేదు. అదో రకమైన విచ్చలవిడి జీవితం నాది.కానీ ఎలా గడిపినా నాకూ ఈ ఇల్లన్నా — వాతావరణమన్నా—మీరందరూ అన్నా చాలా ఇష్టం. మీరంతా నాక్కావాలి. ఈ ఇంట్లో ఇలాంటి వాతావరణమే లేకపోతే ఏనాడో నేను పూర్తిగా చెడిపోయి వుండేవాణ్ని.

ఎక్కడ ఎప్పుడు ఎలాంటి పనుల్లో వున్నా—ఫలానా టైముకింట్లో ఉండాలన్న బాధ్యత నేనెప్పుడూ ఫీలవు తుంటాను. అలాంటప్పుడు ఇదే ఇంట్లో నన్ను మనసారా ప్రేమిస్తూ-నా తప్పులను మనసారా క్షమించగల అమ్మాయి ప్రతిరోజూ సాయంత్రం నాకోసం ఎదురుచూస్తూ వుంటుం దంటే-నా మనసులోనే ఏదో మార్పు వస్తోంది. వసంతను పెళ్ళి చేసుకుంటే నేను మారిపోతానేమోననిపిస్తోంది. మార తానని గ్యారంటీ లేదుకానీ అలా అనిపిస్తోంది నాకు. ఈ పెళ్ళి చేసుకోవాలనే ఉంది నాకు...."

"అలాగైతే అవశ్యం యీ వివాహం జరిపించవల సిందే...." అన్నాడు జగన్నాధం.

"మస్తాన్‌కీ-బంగారయ్యగారికీ సంబంధముండివుండాలి-లేదా బంగారయ్యే మస్తానయుండాలి. లేకపోతే బంగారయ్య కూతురితో పెళ్ళి ఆపడానికి మస్తానెందుకు కలగజేసు కుంటాడు?"—అన్నాడు మోహన్‌రావు మాటమారుస్తూ.

"అది నిజమేననుకో—కానీ మస్తాన్ చాలా ప్రమాద కరమైన మనిషివి మామయ్యంటున్నారు. అతన్నెదిరించడం

మృత్యువు నాహ్వానించడమే నంటున్నారు. అలాంటివాడితో గొడవపెట్టుకుని ఈ పెళ్ళి జరిపిస్తే-మోహన్‌రావు మారడం మాటటుంచి—అసలుకే మోసం రాగలదు...." అంది సత్యవతి.

"నాకూడా ఈ వివాహం జరగాలనే అనిపిస్తోంది. ఇది వీడి జీవితానికే బంగారు అవకాశం. బంగారయ్య కూతురి భవిష్యత్తు గురించి ఎంత బాధపడుతున్నాడో—నేనూ నా కొడుకు భవిష్యత్తు గురించి అంతగా బాధపడు తున్నాను. జీవితంలో ఎప్పుడూ నేను మస్తాన్ని ఏమీ కోరలేదు. నా కొడుకు ప్రాణాల్ని దక్కించమనీ—ఈ పెళ్ళి జరగనివ్వమనీ మస్తాన్ని కోరతాను. నా కోరిక నతను మన్నిస్తాడని నాకు బాగా నమ్మకముంది ...." అన్నాడు రాఘవరావు నమ్మకంగా.

"అంత దుర్మార్గుడు మీమాట వింటాడని ఎలాగనుకుంటున్నారు నాన్నా?"—అన్నాడు జగన్నాధం.

"ఎందుకంటే నేను ఒక పర్యాయం మస్తాన్‌కి ప్రాణదానం చేశాను కాబట్టి...." అన్నాడు రాఘవరావు.

"మస్తాన్‌కి మీరు ప్రాణదానం చేశారా? అతనెంతో దుర్మార్గుడంటున్నారే—అలాంటప్పుడు...." ఏదో తప్పు జరిగినట్లు బాధగా అన్నాడు జగన్నాధం.

"ప్రాణదానం చేసినపుడు అతను మస్తాన్ అని నాకు తెలియదు...." అన్నాడు రాఘవరావు. గడచిన సంఘటన లేవో గుర్తుచేసుకుంటున్నట్లాయన ముఖంలో రకరకాల భావాలు కదుల్తున్నాయి.

"అంటే, అతన్ని చూస్తే మీరు గుర్తుపట్టగలరన్న మాట!" అన్నాడు జగన్నాధం,

"లేదు. నేను చూసింది అతని మారువేషం కావచ్చు. అదీగాక అతని గురించి మీకు ఇంకేమి చెప్పినా నేవింక మిగలను...." అన్నాడు రాఘవరావు బాధగా తల వొత్తుకుంటూ.

27

"విశ్వం-నీకు మీ అసలమ్మని చూడాలని లేదా?"

"ఏమిటో మామయ్యా—నీ మాటలు చాలా విచిత్రంగా వుంటున్నాయి. మా ఇంట్లో వున్నమ్మే అసలమ్మని నాకు తోస్తోంది. నాకు కాస్త నొప్పిపుట్టినా అమ్మ సహించలేదు. నేనంటే అమ్మకు చాలా ఇష్టం...."

"అదంతా పెంచిన ప్రేమ...."

"అసలమ్మకు ప్రేముంటే తనే పెంచవచ్చుగా నన్ను" అన్నాడు విశ్వం.

"ఏ అమ్మకైనా—కొడుకును తనేస్వయంగా పెంచాలనుకుంటుంది. కానీ నువ్వు పెద్దవాడివి కాకుండానే నీ అసలమ్మ చచ్చిపోయింది...."

"అలా అనొద్దు. నాకేడుపొస్తుంది....మా అమ్మ బ్రతికే వుంది. మా ఇంట్లోనేవుంది. పేరు సత్యవతి...." అన్నాడు విశ్వం.

ప్రసాద్ పరీక్షగా విశ్వం ముఖంలోకి చూసి—"ఒకసారి నువ్వు మీ అమ్మను నీతో తీసుకుని రాగలవా? అప్పుడు నీకూ మీఅమ్మకూ కూడా సరస్వతిని చూపిస్తాను" అన్నాడు.

విశ్వం అనుమానంగా ప్రసాద్ వంక చూసి—"నువ్వు మోసం చేస్తావేమో?"—అన్నాడు.

"మోసమంటే ఏమిటి?—" ప్రసాద్ నవ్వుతూ అన్నాడు.

"నన్నూ మా అమ్మనీ చంపేస్తే...."

ప్రసాద్ నవ్వాపుకుని-"నేను మంచివాణ్ణా, చెడ్డవాణ్ణా-నువ్వేమనుకుంటున్నావో చెప్పు...." అన్నాడు.

మరో అయిదు నిముషాల అనంతరం విశ్వం, ప్రసాద్ మాటప్రకారం చేయడానికి సిద్ధపడ్డాడు. వెంటనే ఉత్సాహంగా ఇంటికి పరుగెత్తాడు. ఇల్లు చేరుతూనే తల్లిని రహస్యంగా పిలిచాడు — "నాన్న నిన్నొకచోటికి తీసుకు రమ్మని చెప్పమన్నారు. ఇంట్లో ఎవరికీ చెప్పవద్దన్నాడు. ఊరికే బజారుకి వెడుతున్నట్లు చెప్పమన్నారు...." అని చెప్పాడు.

"అసలేం జరిగింది?"

"సరస్వతిని చూపిస్తారుట...." అన్నాడు విశ్వం.

సత్యవతి గుండెలదిరాయి. జరిగిన ఎన్నో సంఘటనలామె స్మృతిపథంలో మెరిశాయి. ఆమె ఎంతో ఆలస్యం చేయలేదు.

"వీడికేవో కొనాలట. నన్నే కూడా రమ్మనమని మారాం చేస్తున్నాడు. ఇప్పుడే వచ్చేస్తామత్తయ్యా" అని చెప్పి బయల్దేరింది సత్యవతి. బయటకువచ్చేక ఇద్దరూ రిక్షా ఎక్కారు. రిక్షా ఎక్కడికి వెళ్ళాలో విశ్వం చెప్పాడు. రిక్షా ఒక ఇంటిముందాగింది.

ఇద్దరూ ఆ ఇంటిలోపల ప్రవేశించారు. లోపల ఎవరూ లేరు. అటూ ఇటూ చూస్తూండగా గదలోకింకెవరో ప్రవేశించి తలుపులు వేశారు. శబ్దంవిని ఉలిక్కిపడి వెనక్కి తిరిగింది. కనపడ్డ వ్యక్తినిచూసి ఉలిక్కిపడింది.

"నమస్కారం అక్కయ్యా...." అన్నాడు ప్రసాద్.

సత్యవతికి నోటమాటరాలేదు.

"నిన్నిక్కడికి రప్పించడానికి విశ్వంచేత అబద్ధంచెప్పించాల్సొచ్చింది. విశ్వాన్ని జగన్నాథం పంపలేదు. నేనే పంపాను...." అన్నాడు ప్రసాద్.

"ఏమిటి నీ ఉద్దేశ్యం?"—అంది సత్యవతి మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ.

"దురుద్దేశ్యమేమీలేదు. సరస్వతి మాతృహృదయం తన కొడుకుకోసం తపించిపోతోంది. విశ్వాన్ని ఆమె కప్పగించే విశాలహృదయం నీకుందా?"

"నువ్వనేదేమిటో నా కర్థం కావడంలేదు...."

"అన్నీ విశ్వంముందు వివరంగా చెప్పాలా?"—అన్నాడు ప్రసాద్ కటువుగా.

"బెదిరిస్తున్నావా?"—అంది సత్యవతి.

"లేదు. తెలుసుకోగోర్తున్నాను...."

"సరస్వతి ఇంకా బ్రతికేవుందా?....ఆశ్చర్యంగా అంది సత్యవతి.

"నువ్వేం కోరుకుంటున్నావ్-బ్రతికుండాలనా—ఉండకూడదనా?"

"ఆమె చావు బ్రతుకులతో నాకేం నిమిత్తం...."

"ఉంది. పూర్తిగావుంది. మీ జీవితపుబాటనే మార్చేసింది సరస్వతి చావు. ఆమె మళ్ళీ ఇప్పుడు బ్రతికివస్తే నీకేమైనా అభ్యంతరమా?"

"అభ్యంతరం నాకెందుకు?"

"కానీ బ్రతికున్న సరస్వతికి కొడుకుకావాలి...."

సత్యవతి నవ్వి"-కుంతికథ తెలుసా నీకు...." అంది.

ప్రసాద్ మాట్లాడలేదు.

"భూమ్మీద పడ్డనాటినుంచీ నేను విశ్వాన్ని సాకాను. ఆ అనుబంధం సామాన్యమైనదికాదు. విశ్వాన్ని వదిలి నేనుండలేను. బ్రతకలేను. ఆ సంగతి విశ్వాన్నే అడిగి తెలుసుకో. కనిపారేసి పదిహేనేళ్ళ తర్వాతవచ్చి - నా కొడుకును నా కిచ్చేయమంటే-నాకులా బిడ్డను పెంచిన ఆడదానికి వీలౌతుందా?"

ప్రసాద్ బాధగా నవ్వాడు—"నీ బాధ నే నర్థం చేసుకోగలను. కానీ సరస్వతి అసహాయస్థితిని నువ్వూ అర్థంచేసుకోవాలి...."

"ఏమిటా అసహాయస్థితి?"

"వింటావా సరస్వతి కథను...." అన్నాడు ప్రసాద్.

సత్యవతి ఒక్క-క్షణం ఆలోచించింది—"చెప్పు— వింటాను."

"అయితే ముందుగా సరస్వతిని పరిచయం చేస్తు న్నాను. నేను నీకు కథ చెబుతున్నంతసేపూ విశ్వం సర స్వతితో కాలక్షేపం చేస్తాడు. తపించిపోతున్న ఆ మాతృ హృదయం చల్లబడే సమయంలో ఎన్నో నీ ప్రశ్నలకు సమాధానాలు లభిస్తాయి...." అని—"సరస్వతీ—" అని పిలిచాడు ప్రసాద్.

సత్యవతి చుట్టూ చూసింది. ఆమె చూస్తూండగా బాత్రూం తలుపులు తెరుచుకున్నాయి. గుమ్మంలోంచి ఒక ఆకారం బయటకు వచ్చింది. ఆమె తెల్లని చీర, రవిక వేసుకునివుంది. జుట్టు విరబోసుకుని ఉంది. ముఖాన బొట్టు.

ప్రశాంతమైన అందమైన ముఖం. ఆ ముఖాన్ని చూస్తూనే సత్యవతి ఆలోచనలు అలా అలా వెనక్కి వెళ్ళి పోతున్నాయి. తనకు తెలిసిన ఒక రూపం ఆమె ముఖంలో కనబడుతోంది-"సరస్వతి!"—అందామె అప్రయత్నంగా.

ఈలోగా సరస్వతి ఆమెను సమీపించి—"చాలా బాగా గుర్తుపట్టావు—" అంది.

సత్యవతి అప్రయత్నంగా విశ్వాన్ని దగ్గరగ తీసుకుంది. ఆమె కళ్ళనుంచి నీళ్ళు కారుతున్నాయి. తను చని పోయిందనుకున్న సరస్వతి చనిపోలేదు. తన కళ్ళముందే కత్తిపోటుతిన్న సరస్వతి—తమ ఇంటిదొండ్లో పాతిపెట్ట బడిన సరస్వతి ఇప్పుడెలా బ్రతికివచ్చిందీ అన్న మిస్టరీ కంటె—విశ్వం ఆమె బిడ్డ అనీ—ఇప్పుడామె విశ్వాన్ని తననుంచి వేరుచేయడానికి వచ్చిందనీ అనే ఆలోచన ఆమెకు భయంకరంగా వుంది.

"వీడు-వీడు-నా బాబే కదూ—" అంది సరస్వతి. ఆమె కంఠం ఆర్ద్రంగా వుంది.

అతికష్టంమీద గొంతు పెగుల్చుకుని—"అవును...." అంది సత్యవతి.

"బాబూ—" అంది అప్రయత్నంగా చేతులు జాచి. తనకాస్తే తెలియని ఆ మనిషిని విచిత్రంగా చూస్తున్నాడు విశ్వం.

"సరస్వతీ-విశ్వాన్ని తీసుకువెళ్ళి ఆ మంచంమీద కూర్చుని కబుర్లు చెప్పుకో. ఏం మాట్లాడాలనుకుంటున్నావో మాట్లాడుకో. ఈలోగా నేను ఈమెకు నీ కథంతా చెబుతూంటాను...." అన్నాడు ప్రసాద్.

28

సరస్వతికి తల్లిలేదు. చిన్నతనం నుంచీ ఆమెను సుందర్రావు తల్లికన్న ఎక్కువగా సాకాడు. సరస్వతి సుందర్రావు కన్నకూతురు కాదు, కానీ అంతకన్న ఎక్కువైనదే వారిద్దరి అనుబంధం.

సుందర్రావు వివాహం చేసుకోకపోయినా మరీ అంత నీతిగా ఉండేరకం కాదు. అతను చేసే వ్యాపారం కూడా సక్రమమైనది కాదు. అయితే తన జీవనవిధానపు నీడలు కూడా సరస్వతిమీద పడకుండా పెంచుకుంటూ వచ్చాడతను.

ఫలితంగా సరస్వతికి ఇల్లుదాటితే తనతండ్రి ఏవిధంగా జీవిస్తున్నాడో తెలియదు. ఎటొచ్చీ ఆయన పెద్దవ్యాపారం చేస్తున్నాడనీ—తమది గొప్ప ఐశ్వర్యమనీ ప్రత్యక్షంగా కనబడే వివరాలనుబట్టి అనుకునేది. ఇంట్లోమాత్రం ఆమె ఖచ్చితమైన నిబంధనలనుసరించేది. ఆ కారణంగా ఆ ఇల్లొక పవిత్ర దేవాలయంలా ఉండేది.

తనకు పన్నెండేళ్ళ వయసప్పుడు సరస్వతి తండ్రి సహకారంతో గుజరాత్ వెళ్ళి అక్కడ వజ్రాల పరీక్షకూ, కటింగ్‌కూ సంబంధించిన ఎన్నో ప్రత్యేక విశేషాలు తెలుసుకుని ఆ విషయంలో ఆరితేరింది. ఆ తర్వాతనుంచీ ఆమె సుందర్రావుకు చాలా బాగా ఉపయోగపడేది.

సరస్వతి పధ్నాలుగేళ్ళున్నప్పుడు పద్దెనిమిదేళ్ళ కన్యలా ఏపుగా ఉండేది. ఆ సమయంలోనే ఆమెకు దూరపు వరసలో బావ అయ్యే వెంకన్నదొరను తనకు సహాయంగా వుండటానికి సుందర్రావింటికి తీసుకువచ్చాడు.

దొరది విలాసదృష్టి. అతను అందంలోనూ లావణ్యం లోనూ తిరుగులేని యువతిగా ఎదుట నిలబడి నోరూరించే సరస్వతి నెలాగో వశపర్చుకోవాలని ప్రయత్నించసాగాడు. కానీ సరస్వతి అతని ప్రయత్నాలను కొనసాగనివ్వలేదు. ఆ సందర్భంలో సరస్వతి బలహీనతలు కొన్ని పట్టు కున్నాడు దొర. ఏ కారణంవల్లనైనా ఆమె ఒక మగ వాడికి ఒకసారి లొంగిపోయిందంటే జీవితాంతం వాడి తోనే పడివుంటుందని ఆలోచించాడు. సరస్వతిని పెళ్ళి చేసుకుని ఆమె ఆస్తికంతకూ వారసుడుకావాలని అతని తాపత్రయం.

దొరకు మస్తాన్ తెలుసును. ఆ రోజుల్లో మస్తాన్ పేరుచెబితే ప్రజలు గడగడ వణికిపోయేవారు. అతనెలా గుంటాడో ఎవరికీ తెలియదు. కానీ అతనితో విరోధం తెచ్చుకుంటే ఏమవుతుందో అందరికీ తెలుసు. అతని చేష్టలు చాలా దారుణంగా ఉండేవి.

మస్తాన్‌కి కావలసినది డబ్బు. ఆడపిల్లలు. ఎవరిని అడిగితే వాళ్ళు. ఎప్పుడడిగితే అప్పుడు-ఈ రెండింటినీ సరఫరాచేయాలి! ఒకోసారి రాజాలా అడిగి సంపాదించ డమూ-ఒకోసారి దొంగతనంచేయడమూ-ఆడపిల్లల్నెత్తుకు పోవడమూ కూడా చేస్తూండేవాడు.

అతను కాలేజీగేట్సువద్దకాపి ఆడపిల్లలను చూసేవాడు. చూపి తనకు నచ్చినవాళ్ళను సెలక్టు చేసుకుని ఫలానా చోటికి తనను కలుసుకునేందుకు రమ్మనమని ఉత్తరం రాసేవాడు. తన ఉత్తరాన్ని మన్నించి చెప్పిన చోటుకు వచ్చినవారిని—తనక్కావలసిన చోటుకు రహస్యంగా

తీసుకువెళ్ళి అనుభవించి—ఒక నగ బహుమానంగా ఇచ్చి పంపేవాడు. లేనివాళ్లు కుక్కచావు చచ్చేవారు.

దొర, మస్తాన్‌కు తన సమస్య చెప్పాడు. అతను దొరకు గొప్ప సలహా ఇచ్చాడు. ఆ ప్రకారం మారు వేషంలో మస్తాన్, దొర ఇంట ప్రవేశించాడు.

మస్తాన్ వేసుకున్న మారువేషం ఎవరికీ ఏ మాత్రమూ అనుమానం కలిగించనిది. అది ఒక సన్యాసి వేషం. అతను దొరకు గురువు. నిజంకూడా అంతేగదా మరి.

సుందర్రావు ఇల్లూ అక్కడి వైభోగమూ చూసేక మస్తాన్ కళ్ళు చెదరిపోయాయి. ఇంత ఆస్తి ఉంటే అన్ని ఘోరాలూ మానివేసి సామాన్య జీవితం గడపవచ్చునని అతనికి తోచింది.

ఎందువల్లనో కానీ ఈ సన్యాసిమీద సుందర్రావుకూ గురి కుదిరింది. దాన్నాసరాగా చేసుకుని మస్తాన్ సుందర్రావు ఇంటి అనుపానులు తెలుసుకునేటందుకు ప్రయత్నించసాగాడు.

ఒకరోజు సుందర్రావు ఇంట్లో లేని సమయం చూసి-పూజ పేరుతో సరస్వతి నిల్లు కదిపాడు మస్తాన్. అయితే వాళ్ళే ఆలయానికీ వెళ్ళలేదు. ఊరి చివర తోటలో సుందర్రావు కొక ప్రత్యేక బంగళా ఉంది. అక్కడ ఏదో ప్రకృతి పూజ చేయాలని మస్తాన్ చెప్పాడు.

ప్రకృతి పూజంటే ఏమిటని సరస్వతి అడిగింది.

అన్నీ వివరంగా తోటలోని బంగళాలో చెబుతాననీ—ప్రకృతిపూజ చేయడంవల్ల అభీష్టసిద్ధి కలుగుతుందనీ మస్తాన్ చెప్పాడు. తన ఇంట్లో అత్యంత పవిత్రుడిగా భావించబడు

తున్న ఆ సన్యాసిని అనుమానించాలని ఆమె ఊహలోకి కూడా రాలేదు.

ఇద్దరూ తోటలోకి వెళ్ళారు. సరస్వతి తనే బంగళా తాళంతీసింది. ఇద్దరూ లోపల ప్రవేశించారు.

"ప్రకృతి పూజకుముందు-నీ మనసులో నీకు నచ్చిన మగవాడిని తల్చుకోవాలి. ఆ పేరు నాకు చెప్పాలి...." అన్నాడు మస్తాన్.

"నచ్చిన మగాడంటే....'' అనడిగింది సరస్వతి.

''నిన్ను పెళ్ళాడబోయే వాడు....''

సరస్వతి సిగ్గుపడింది...."అలాంటి వాడెవరూ నా మనసులో లేరు...."

"పోనీ నేను వెంకన్నదొర పేరు చెబితే నీకేమైనా అభ్యంతరమా?"

ఆశ్చర్యంగా చూపింది సరస్వతి—"స్వామీ-అతను నాకు తగినవాడేనని మీరనుకుంటున్నారా?"—అంది.

"నీకు తగిన వరుడెవరా అన్నది నేనాలోచించలేదు. కానీ ఇప్పుడే చెప్పగలను. నేను కళ్ళు మూసుకుని ధ్యాన నిమగ్నుడినై నిలబడతాను, నువ్వు నా కాళ్ళకు సాష్టాంగ నమస్కారంచేసి అయిదు నిముషాలసేపు నారాయణ నామం జపించాలి. అప్పుడు నీకు కాబోయే పతి ఎక్కడున్నా క్షణాలమీద ఇక్కడకు వస్తాడు...." అన్నాడు మస్తాన్.

సరస్వతి ఉత్సాహంగా—"సరే-తమాషా చూస్తాను" అంది.

"తమాషాకాదు. నిజంగానే నీ కాటోయేపతి వస్తాడు. కానీ సాష్టాంగ నమస్కారంచేసే అయిదునిముషాలూ...." క్షణం ఆగాడు మస్తాన్.

"ఊఁ-ఆ అయిదునిముషాలూ...." అంది సరస్వతి.

"నీ ఒంటిమీద ఏ బట్టలూ ఉండకూడదు...." అన్నాడు మస్తాన్ గంభీరంగా.

సరస్వతి వులిక్కిపడినా—"ఛీ-అలాగైతే వద్దు...." అంది.

"సర్వసంగ పరిత్యాగిని నన్నే అనుమానిస్తున్నావా?"-అన్నాడు మస్తాన్ కోపంగా.

"అనుమానంకాదు స్వామీ-నాకలా ఇష్టముండదు!"—అంది సరస్వతి.

"ఒక్కసారి ఒప్పుకున్నాక నా మాట విని తీరాల్సిందే-లేకపోతే నువ్వు నన్నవమానించినట్లు భావిస్తాను...." అన్నాడు మస్తాన్.

"సర్వసంగ పరిత్యాగులు మీ కవమాన మేమిటి స్వామీ"—అంది సరస్వతి అమాయకంగా.

"సర్వసంగ పరిత్యాగినైన నాకేకాదు నిరాకారుడూ—నిర్గుణుడూ అయిన ఆ పరమాత్మకి కూడా అవమాన ముంటుందని తెలియదా నీకు...."

సరస్వతి మాట్లాడలేదు.

మస్తాన్ తన భుజానికి తగిలించిన సంచీలోంచి ఒక కాగితం తీసి నేలమీద పరిచాడు. అది శ్రీకృష్ణుడి బొమ్మ ఉన్న కాగితం—"భగవంతుడి కవమానం లేదనుకుంటే నువ్వు ఈ పటంమీద నిలబడవచ్చు...." అన్నాడు.

"అపచారం...." అంది సరస్వతి అప్రయత్నంగా.

"చూశావా మరి!" అన్నాడు మస్తాన్.

"కానీ నా కిష్టంలేని పూజ చేయమని మీరు బలవంత పెట్టవచ్చునా?"

"ఇష్టంలేదని నువ్వు ముందుగా చెప్పలేదు...."

"మీరు నాకు పూజా విధానాన్ని తెలియబర్చలేదు ముందుగా...." అంది సరస్వతి.

"పూజా విధానం తెలిసేక పూజ ఇష్టంలేదంటున్నావు. అది నా కవమానంకాదా! ఇన్నాళ్ళ నా విష్టను నువ్వవమానించడంలేదా....?"

మస్తాన్ ముందు తార్కికంగా సరస్వతి ఆగలేక పోయింది. పదిహేనేళ్ళు మాత్రం దాటిన ఆమెకు అంత కంచె ఏం చేతనౌతుంది?

"నీ జీవితం స్వర్గధామం కావడానికి గొప్ప అవకాశం. సాధారణంగా నా కిటువంటి అనుగ్రహం రాదు. ఈ విధంగా నేనింతవరకూ ఎనమండుగురు స్త్రీలను మాత్రమే అనుగ్రహించాను. అందులో ఏడుగురు అష్టయిశ్వర్యాలతో-అనుకూల దాంపత్యంతో—చాలా హాయిగా వున్నారు. ఒకామెకివన్నీకాక అధికారంకూడా లభించింది. ఎందుకో నిన్ను చూడగానే అనుగ్రహింఛాలనిపించింది"

సరస్వతి ఆలోచనలో పడింది—"నేను సాష్టాంగ పడ్డాక ఏం జరుగుతుంది."

"నేను నిన్ను తాకనైనా తాకను. కనీసం కన్నెత్తి చూడను. కనులు మూసుకుని నిష్టలో వుంటాను. నీవు నీ ఒంటిమీద బట్టలన్నీ తీసేసి నా భుజానికి తగిలించి వున్న సంచీలో పెట్టేసి నా కాళ్ళముందు సాష్టాంగపడాలి. అయిదు నిమిషాల్లో నీక్కాబోయే పతి వస్తాడు...." అన్నాడు మస్తాన్.

"మీ కవమానమన్నారని అంగీకరిస్తున్నాను. నాకు మీరే రక్షగా వుండాలి...." అంది సరస్వతి — "మిమ్మల్ని భగసత్స్వరూపులుగా ఎంచి మీ ముందు సిగ్గు వదిలిపెట్టేస్తున్నాను...."

మస్తాన్ ఊపిరి బిగబట్టాడు. సరస్వతి నతను నగ్నంగా చూడదల్చుకోలేదు. చూస్తే మనసు చలించవచ్చు. అతను దొరకు మాటిచ్చాడు. మాట నిలబెట్టుకోవడమన్నది అతనికి చాలా ముఖ్యం. అతను వెళ్ళి ముఖద్వారం గడియ తీసేసి "నీ కాబోయే భర్త నా మంత్రప్రభావంతో తలుపులు తోసుకుని రావడానికి వీలుగా అన్నమాట...." అన్నాడు.

సరస్వతి అసంతృప్తిగా తలూపింది.

"చూశావుగదా—ఇందులో మోసం ఏమీ లేదు. వీధి తలుపులు తీసే వున్నాయి. నేను ధ్యానంలోకి వెళ్ళిపోయేక నాకీ లోకం తెలియదు. నువ్వు నన్ను గౌరవించి పూజకుపక్రమిస్తావో — తలుపులు తీసుకుని బయటకు వెళ్ళిపోతావో నీ యిష్టం. చేస్తానని మాటిచ్చి తప్పితేమాత్రం నీకు అరిష్టం. అది అదుపుచేసే శక్తి నాక్కూడాలేదు...." అన్నాడు మస్తాన్.

"మాట తప్పనుస్వామీ—" అంది సరస్వతి. మనసులో మాత్రం ఆమెకు బాధగానే ఉంది.

"నేను నిన్ను తాకనైనా తాకను. ఆ విషయం గుర్తుంచుకో..." అంటూ మస్తాన్ కనులు మూసుకుని నిలబడ్డాడు.

సరస్వతి క్షణం మాత్రమే తటపటాయించి "భగవంతుడా—నే నెప్పుడూ ఎవడికీ ఏ అన్యాయమూ చేసినదాన్ని కాను. నాకే కష్టమూ, నష్టమూ వాటిల్లకుండా నువ్వే

కాపాడాలి..." అనుకుని బట్టలు విప్పడం మొదలు పెట్టింది.

ఒంటిమీద బట్టలన్నీ తీసేశాక ఒక్క-క్షణం ఆమె ఒళ్ళు సిగ్గుతో చచ్చిపోయినట్లనిపించింది. ఆమె పరీక్షగా మస్తాన్‌ని చూసింది. అతని కనులు మూతబడి ఉన్నాయి. ఏదో మంత్రోచ్చారణ చేస్తున్నట్లుగా అతని పెదవులు కదుల్తున్నాయి.

ఆ క్షణంలో అతని ముఖం చూస్తూంటే ఆమెకు అన్ని భయాలూ తొలగిపోయాయి. అడుగులు ముందుకు వేసి తన బట్టలు అతని సంచీలో పెట్టింది. తర్వాత అతని పాదాలముందు సాష్టాంగపడి నారాయణ జపం మొదలు పెట్టింది.

ఆమె నోటివెంట నారాయణ శబ్దం వెలువడగానే మస్తాన్ అప్రయత్నంగా రెండడుగులు వెనక్కు వేశాడు. తిన్నగా ముఖద్వారం వద్దకు నడిచాడు. బయట ఏదైనా అలికిడి అవుతుందేమోనని చెవులు రిక్కించాడు.

కొద్ది నిముషాలలో అతనికి అడుగుల చప్పుడు వినపడింది. తలుపులు సగం తెరిచి తలుపువారనే నిలబడ్డాడు మస్తాన్. ఒక యువకుడు చరచరా లోపల ప్రవేశించాడు. అతను లోపల అడుగుపెట్టగానే—ఒక్క అంగలో తను గదిలోంచి బయటపడి—తలుపు బయట గడియవేశాడు. ఆ తర్వాత తనను తానే అభినందించుకుని అక్కణ్నించి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు—"దారా-నేను చేయగలిగింది చేశాను....ఆపైన నీ అదృష్టం...." అనుకున్నాడు మనసులో.

సరస్వతి ఉన్న గదిలో ప్రవేశించిన యువకుడు తలుపులు గడియపడగానే కంగారుపడి వెనక్కు తిరిగాడు. తలుపు లాగి చూశాడు. ఏదో మోసం జరిగిందని గ్రహించి భయపడ్డాడు. అప్పుడటూ ఇటూ పరిశీలించడంలో సరస్వతి అతని కళ్ళబడింది. అతనులిక్కిపడ్డాడు.

తను సాష్టాంగ పడిందన్న విషయం తెలియడంకోసం సరస్వతి నారాయణ నామాన్ని పైకి ఉచ్చరించింది. తర్వాత నామజపం లోపలే చేసుకోసాగింది. కానీ ఆమెకు ఏకాగ్రత కుదరడంలేదు. ఏం జరుగుతుందో, ఏం జరుగుతుందో నన్న భయం ఆమెను కలవరపరుస్తూంటే—ఒక మూల మొండి ధైర్యం చోటుచేసుకోసాగింది. కాలంగడిచిపోతున్నా ఎవరూ తాకకపోయేసరికి ఆమెకు మస్తాన్‌మీద గురి కుదిరింది. అలా కదలకుండా పడుకుని వుంది. క్రమంగా ఆమెకు ఏకాగ్రతకూడా కుదిరింది.

ఆ యువకుడు చూసే సమయానికి సరస్వతి బోర్లా పడుకుని వుంది. కదలడంలేదు—మెదలడంలేదు. అది ఆడదాని శరీరమనీ—కదలడంలేదనీ గ్రహించడంతో ఆ యువకుడి భయం మరీ ఎక్కువైంది. ఏ ఆడదీ ఇంతలా బరి తెగించిపోదు. ఆమె సజీవురాలై వుండదు. అంటే తననేదో హత్య కేసులో ఇరికించడానికి ఏర్పాటు జరిగిందన్న మాట. అతనామెను సమీపించడానికి భయపడ్డాడు.

అయితే గత్యంతరం లేని పరిస్థితిలో అతను ధైర్యం చేసి-కాసేపటికామెను సమీపించడమే కాక-ఆమె ముందు కూర్చుని-పరిస్థితి తెలుసుకునేటందుకు ఆమెను వెల్లకితలా తిప్పాడు. అంతే—అతని కళ్ళు చెదిరిపోయాయి.

అది సామాన్యమైన సౌందర్యం కాదు. అంతవరకూ ఎవరికంటాపడని అతిలోక సౌందర్యం. ఆమె నిర్జీవురాలు కాదు. శిలలకుకూడా చలనం కలిగించేటంత జీవకళ ఆమెలో వుంది. ఉచ్ఛ్వాస నిశ్వాసాల కదిరిపడుతున్న ఆమె గుండెల మీదనుంచి ఒకసారి చూస్తే దృష్టి మరల్చుకోవడం కష్టం.

సరస్వతి ఏకాగ్రత దెబ్బతింది. కళ్లు తెరిచే ముందు ఆమెకు కాస్త సంకోచం కలిగించింది. అన్నింటినీ విడనాడ దానికామెకు కొంత వ్యవధి కావాల్సొచ్చింది. తీరా ఆమె కళ్ళు తెరిచేసరికి—ఎదురుగా కనపడ్డ వ్యక్తిని చూసి ముడుచుకుపోయింది.

"క్షమించాలి—అనుకోకుండా ఇలా వచ్చాను. నాకేం తెలియదు...." అన్నాడతను కాస్త పక్కగా తిరిగి. కానీ అతని మనసు ఆమెను పదేపదే చూడమని వేధిస్తోంది. అయినా అతను నిగ్రహించుకున్నాడు.

మస్తాన్ చెప్పింది జరిగిందని సరస్వతి గ్రహించింది. అతనెవరో మంత్ర ప్రభావంతో లోపలకు ప్రవేశించి వుండాలి. కానీ ఇప్పుడెలా? తన బట్టలు........

తను సాష్టాంగపడి వుండగా కాబోయే భర్త గదిలో ప్రవేశిస్తాడని సన్యాసి చెప్పినపుడామె తను తనకాబోయే భర్త నీ పరిస్థితిలో చూస్తానని ఊహించలేదు. ఇప్పుడు గదిలో సన్యాసి లేడు. ఇతనెవరో తనను గురించి ఏమను కుంటున్నాడో ఏమో?

"మీరు నన్నుగురించి ఏమనుకుంటున్నారో తెలియదు. మీరిటు తిరక్కుండా ఉంటే—నా కథ వివరిస్తాను...." అంది సరస్వతి.

"చెప్పండి...." అన్నాడతను.

ఆమె చెప్పింది.

ఆమె చెప్పడం పూర్తి కాగానే అతను తన ప్యాంటు, షర్టూ విప్పి ఆమెవైపు చూడకుండానే ఆమెమీదకు విసిరేశాడు—"ముందవి కట్టుకోండి—"

ఆమె కృతజ్ఞతతో అతనివంక చూసింది. చారల డ్రాయరు, బనియన్‌తో వున్నాడతనిప్పుడు. ఆమె త్వరగా ఆ బట్టలు తొడుక్కుంది—"ఇంక ఫర్వాలేదు—ఇటు చూడండి...."

అతనామెవైపు చూశాడు. ఆమె ఇప్పుడు స్వచ్ఛంగా నవ్వుతోంది. కానీ ఆ నవ్వువెనుక—సిగ్గుఛాయలు లేక పోలేదు.

"ఇప్పుడు చెప్పండి—మీరిక్కడికెలా వచ్చారు?"

అతను వివరించాడు—"అతని పేరు దొర—రోడ్డుమీద సైకిల్‌గుద్దేసి పడిపోయాడు. దగ్గర్లో వున్న హాస్పిటల్‌కి నేనే అతన్ని జేర్చాను. కాలుకు గట్టిగా దెబ్బతగిలింది. ఎముక విరిగినా విరిగుండవచ్చునని డాక్టర్ అన్నాడు. అతను నన్నుచూసి యీతోట వివరాలుచెప్పి- ఆ యింట్లో ఒక సన్యాసివుంటాడనీ, అతనికి తన పరిస్థితిచెప్పవలసిందనీ- ఇది చాలా అర్జంటునీ అన్నాడు.... నేను కనుక్కుంటూ ఇక్కడకు వచ్చాను. బంగళా కనపడగానే—సగం వేసి వున్న తలుపులు కనపడ్డాయి. తోసుకుని లోపలకు వచ్చాను. అంతే. ఎవరో తలుపులు బయట గడియపెట్టారు. చాలా భయపడ్డాను. బోర్లా పడుకుని వున్న మిమ్మల్ని చూసి నన్నేదో హత్యలో ఇరికించడానికి ప్రయత్నం జరిగిందను కున్నాను...."

సరస్వతి మాట్లాడలేదు. ఆమెలో మళ్ళీ సిగ్గుపుట్టింది.

"నా అభిప్రాయంలో ఇదంతా మోసం. ఆ సన్యాసి దొంగసన్యాసి. ఎవరో మిమ్మల్ని మోసంచేసి—అన్యాయం చేయడానికి నిర్ణయించుకున్నారు ..." అన్నాడా యువకుడు.

"ఎవరో ఏమిటి—ఆ దొరే అయుంటాడు. అతనికి ఆ సన్యాసి ఇక్కడుంటాడని తెలుసునని చెప్పారుకదా—ముందుగా అన్నీ అనుకోకపోతే ఎలా తెలుస్తుంది? అయితే ఏ అభిప్రాయంతో ఆ సన్యాసి ప్రకృతిపూజ సంగతి చెప్పాడో కానీ ఆ పూజ నిజంగానే ఫలించి మీరొచ్చారు. అందుకే భగవంతుడిమీద నాకు అంతులేని నమ్మకం...." అంది సరస్వతి.

ఆ యువకుడు నిట్టూర్చి—"మీరు నన్ను వివాహం చేసుకోవాలనుకుంటున్నారా?"—అన్నాడు.

ఒక్కక్షణం సంకోచంగా ఆగి-"అవును. చేసుకుంటే మిమ్మల్నే పెళ్ళి చేసుకుంటాను. మీరు కాదంటే—నా జీవితాంతం బ్రహ్మచారిణిగా వుండిపోతాను...." అంది సరస్వతి.

"ఎందువల్ల?"

"నా భర్తకు తప్ప కనబడకూడని విధంగా మీ కంట పడ్డాను. అదే నా నిర్ణయానికి కారణం...." అంది సరస్వతి అమాయకంగా.

ఆ యువకుడు నవ్వాడు—"మరి ఆ సన్యాసి...."

"ఆ సన్యాసి చూశాడని నే ననుకోను. నన్ను చూడననీ తాకననీ మాటిచ్చాడు. లేకపోయినా ఆయన్ని దేవుడిగా భావించి వదిలేశాను...." అంది సరస్వతి.

"ఆ సన్యాసి మిమ్మల్ని చూసి ఉండదని నేనూ అనుకుంటున్నాను. చూసి ఉంటే నిగ్రహాన్ని కోల్పోయి ఉండేవాడు...."

సరస్వతి సిగ్గుపడింది.

"కానీ నాకు పెళ్ళయింది...." అన్నాడతను.

సరస్వతి ఉలిక్కిపడింది—"నిజంగా?" - అన్నప్పుడామె గొంతు పెగలలేదు.

"అవును. కానీ నాకు మిమ్మల్నికూడా పెళ్ళాడాలని ఉంది...." అన్నాడతను. ఈ పర్యాయం అతనామె దగ్గరగా జరిగి—"మిమ్మల్నిలా చూసినప్పట్నించీ నిగ్రహించుకోలేకపోతున్నాను. అయినా నిజం చెప్పేశాను మీ కన్యాయం చేయడ మిష్టంలేక. ఎవరినీ దేనికీ బలవంతం చేయడం నా కిష్టముండదు. నా కథ చెబుతాను. సానుభూతితో నన్నర్థం చేసుకోగలరా?" అన్నా డాయువకుడు.

"చెప్పండి...." అంది సరస్వతి. అప్పటికే అతని మంచితన మామెకు అర్థమయింది. తన కతను వస్త్రదానం చేశాడు. తాత్కాలికంగా అబద్ధమాడి తన్ను మోసం చేయకుండా తనకు పెళ్ళయిందన్న నిజాన్ని ప్రకటించాడు. అతని కథను వినాలనే నిర్ణయించుకుందామె.

"నా పేరు జగన్నాథం—!" అన్నాడా యువకుడు.

29

ఉలిక్కిపడింది సత్యవతి. "ఏమిటి ప్రసాద్ నీ వంటున్నది?"

"నా పేరు జగన్నాథం అన్నాడా యువకుడు—అన్నాను" అన్నాడు ప్రసాద్.

"ఇది అబద్ధం...." బాధగా అంది సత్యవతి. ఆమె దృష్టి అటు మంచంమీదకు మరలింది. అక్కడ సరస్వతి విశ్వానికి ఏమిటేమిటో చెబుతోంది. విశ్వం చాలా కుతూహలంగా వింటున్నాడు. వాళ్ళిద్దరకూ తమ ధ్యాస ఉన్నట్లే లేదు.

"నువ్వెంత బాధపడినా నిజా లబద్ధం కావు. నేను చెప్పే కథ పూర్తిగా వింటావా?...." అన్నాడు ప్రసాద్.

సత్యవతికి గతం తనకళ్ళముందు మెదుల్తోంది.

తనకు తండ్రిలేడు కానీ అంతులేని ఆస్తికి వారసురాలు తను. తండ్రి ఆస్తికి బాబాయిని ట్రస్టీగా వేశాడు. ఆయన రాసిన విల్లు ప్రకారం బాబాయికి ఆస్తిలో భాగంలేదు. ఒక లక్ష రూపాయలు మాత్రం ఆయన బాబాయి పేరిట ఫిక్సెడ్ డిపాజిట్లో వేశాడు.

తనకు వివాహమై సంతానం కలిగేంతవరకూ ఆస్తికి బాబాయి ట్రస్టీగా ఉంటాడు. ఆ తర్వాత ఆస్తి పూర్తిగా తనకు చెందుతుంది. తనూ తన భర్తా తన సంతానం తరపున ఆస్తికి ట్రస్టీలుగా ఉంటారు. ఒకవేళ ఏమైనా ప్రమాదం వాటిల్లి తను మరణించడం జరిగితే—ఆస్తి ధర్మసంస్థలకు ఇచ్చేయాలి.

తనకు పదిహేను సంవత్సరాలప్పుడు కాబోలు యేదో జబ్బుచేస్తే ఆపరేషన్ అవసరమన్నారు. ఆపరేషన్ అనంతరం తను చచ్చి బ్రతికినట్లయింది. తన ప్రాణాలు కాపాడ్డానికి బాబాయి చాలా శ్రమపడ్డాడు. రాత్రింబవళ్ళు సేవలు చేశాడు.

పదహారో ఏట తనకు వివాహమైంది. రెండుసంవత్సరాల వైవాహిక జీవితం అనంతరంకూడా తన కడుపు

పండలేదు. ఏదో సందర్భంలో తను వైద్య పరీక్ష చేయించుకోగా పెళ్ళికి ముందే తనకు జరిగిన ఆపరేషన్ కారణంగా—తనకు మరి సంతానం కలగదన్న కఠోర సత్యం బయటపడింది. చలించిపోయింది తను. పెళ్ళి బాబాయిని నిలదీసింది.

"తెలిస్తే బాధపడతావని చెప్పలేదు. నీ ప్రాణాలు రక్షించడంకోసం ఆ విధంగా ఆపరేషన్ చేయాల్సొచ్చింది. నీకు సంతాన యోగ్యత లేదు...." అన్నాడు బాబాయి.

ఇది బాబాయి మోసమే నంటాడు భర్త. తనకు సంతానం కలిగేంతవరకూ బాబాయే ఆస్తికి ట్రస్టీగా ఉంటాడు. తనకు సంతానం కలగదు. దాబాయికి ఆస్తి పోదు. తను పోతే ఆస్తి ధర్మసంస్థల కిచ్చేయాల్సొంటుంది. బాబాయి తెలివిగా పథకం వేసి ఇటు తన ప్రాణాలకు ముప్పులేకుండా, అటు ఆస్తి తననుండి పోకుండా ఈ పథకం వేశాడు. ఇంత ఆస్తీ బాబాయి కొట్టేస్తున్నాడు.

భర్త ఆలోచనల్లో సబబున్నదని తనకూ తోచింది. అయితే తనూ భర్తా ఇప్పుడు బాధపడుతున్నది ఆస్తికోసం కాదు. ఏ విధంగా తమ వంశం నిలుపుకోవాలా అని ఆలోచిస్తున్నారు.

ఆ ఆలోచనల్లోకి రెండోపెళ్ళి కూడా రాకపోలేదు— "ఛా—ఆ ప్రసక్తి ఎందుకూ?" అని జగన్నాధం అన్నప్పటికీ—అతని ముఖంలో విముఖత అంతగా కనబడలేదు.

"ఏదో ఆలోచిస్తున్నావ్—కథ వింటావా?" అన్నాడు ప్రసాద్.

"చెప్పు...." అంది సత్యవతి.

30

"నా పేరు జగన్నాధం. నా భార్య సత్యవతి. ఆమె వయస్సు పద్దెనిమిది. నా వయసు ఇరవై దాటింది. మా ఇద్దరికీ పెళ్ళి రెండు సంవత్సరాలయింది. నా భార్య. చాలా పెద్ద ఆస్తికి వారసురాలు. అయితే ఆ ఆస్తికి వాళ్ళ బాబాయి ట్రస్టీ. ఆమెకు సంతానం కలిగేవరకూ ఆయనే ఆ ఆస్తికి ట్రస్టీగా ఉంటాడు.

అందుగురించి ఆయన కుతంత్రం పన్ని—పదిహేనో ఏటే నా భార్యకు పిల్లలు కలగకుండా ఆపరేషన్ చేయించాడు. నా భార్యపోతే ఆస్తి ధర్మసంస్థల కిచ్చెయాలి. ఆయన తెలివితేటలవల్ల నాభార్య బ్రతికీ ఉంటుంది, పిల్లల్ని కనదు.

ఈ పరిస్థితుల్లో నా కన్యాయం జరిగిపోయింది. నా తర్వాత నా వంశం నిలబడదు. ఏం చేయాలో తోచని పరిస్థితుల్లో రెండో పెళ్ళి కూడా ఒక ఆలోచనగా వచ్చింది. సత్యవతి చాలా మంచిది. ఆమె అంగీకరించింది. కానీ నాకే మనసొప్పడంలేదు. అయితే ఈ పరిస్థితుల్లో అనుకోకుండా మీతో ఈ విధంగా పరిచయం లభించింది...." అన్నాడు జగన్నాధం.

సరస్వతి క్షణం ఆలోచించింది. అతన్నింకా ఏవేవో ప్రశ్నలు వేసింది. అన్నింటికీ అతను జవాబులు చెప్పాడు. అన్నీ విని—"మిమ్మల్ని నేను పెళ్ళి చేసుకుంటాను...." అంది.

చటుక్కున జగన్నాధం ఆమెను కౌగలించుకుని ముద్దు పెట్టుకున్నాడు. అప్పుడున్న పరిస్థితు లలాంటివి. అంత టితో వారిద్దరూ ఆగలేదు.

ఫారము - 4

1. ప్రచురణ స్థలము : హైద్రాబాదు_29.
2. ప్రచురణ కాలము : మాసపత్రిక.
3. ముద్రాపకుని పేరు : శ్యామదామోదర రెడ్డి.
జాతీయత : భారతీయుడు.
చిరునామా : హైద్రాబాదు_29.
4. ప్రచురణ కర్త పేరు : _డిటో_
జాతీయత :
చిరునామా :
5. సంపాదకుని పేరు : _డిటో_
జాతీయత :
చిరునామా :
6. వార్తాపత్రికపై యాజమాన్యముగల వ్యక్తులు, భాగస్థులు పేర్లు, చిరునామాలు: శ్యామదామోదర రెడ్డి 3_4_554 నారాయణగూడ హైద్రాబాదు_29 (సోల్ ప్రొప్రయిటరు.)

శ్యామదామోదర రెడ్డి అయిన నేను, పైన తెలిపిన వివరములు నాకు తెలిసినంతవరకు, నేను విశ్వసించినంత మేరకు సత్యమైనవని, ఇందు మూలముగా ప్రకటించుచున్నాను.

శ్యామ దామోదర్ రెడ్డి

తేది : 20-2-78 ప్రచురణకర్త సంతకం.

"పెళ్ళంటే పదిమందిలో మూడుముళ్ళు వేయడంకాదు. మన పెళ్ళయిపోయింది. ఈ క్షణంనుంచీ నువ్వు నా భార్యవు...." అన్నాడు జగన్నాథం.

సరస్వతి భావాలింకా పూర్తిగా వికసించలేదు. ఆమె కప్పుడు జగన్నాథం చెప్పినదే వేదవాక్కు. ఆ తర్వాత కూడా-ఆమె జగన్నాథాన్ని వారంరోజులపాటు రహస్యంగా కలుసుకునేది. ఆ ఊళ్ళో జగన్నాథం వారంరోజులు మాత్రమే వున్నాడు. తర్వాత అతను తన ఊరు వెళ్ళిపోతూ పదిరోజుల్లో ఇంటిదగ్గర అన్ని వ్యవహారాలూ చక్క-పెట్టుకుని వచ్చి ఆమెను తీసుకువెడతానన్నాడు.

ఈ వారంరోజులూ సన్యాసి జాడలేదు. అతను మోస గాడని ఆమెకు అర్థమైపోయింది.

దొరకు ఎముక విరగలేదు కానీ హాస్పిటల్లో పదిరోజు లున్నాడు. అతను హాస్పిటల్నించి తిరిగివచ్చిన రోజున— సరస్వతి అతన్ని చెడామడా తిట్టేసింది. జరిగినదంతా వివ రించింది-తన పథకంతో తనే దెబ్బతిన్నాడనీ తను జగన్నాథాన్ని వివాహం చేసుకుంటాననీ చెప్పింది. అయితే జగన్నాథం పేరుకానీ, అడ్రసుకానీ మాత్రం ఇవ్వలేదు.

సరస్వతి చెప్పినవన్నీ విని దొర దెబ్బతిన్నాడు. అతను అర్జంటుగా మస్తాన్ని కలుసుకున్నాడు. జరిగినదంతా విని మస్తాన్ మండిపడ్డాడు. దొర దురదృష్టాన్ని నిందించాడు. ఆ రోజు గదిలోకి వెళ్ళినది దొరేనని అనుకుని మస్తాన్ అక్కణ్ణించి బయటపడి-తక్షణం ఊరువదిలిపెట్టాడు. పరిస్థితులన్నీ వాటంతటవే చక్కబడగలవని అతనను కుంటే-జరిగినది వేరు.

అపరాధ పరిశోధన పోటీ-116

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 30-3-'78 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు మే '78 నెల సంచికలో ప్రకటిస్తాము.*

1. గత నెలలో మన రాష్ట్రంలో ఇవి జరిగాయి—? (ఎన్నికల కొట్లాటలు, రైలు ప్రమాదాలు)

2. నేడు అన్నిటికంటే పెద్ద వ్యాపారం—? (స్మగ్లింగ్, రాజకీయాలు)

3. మనదేశంలో వీటి నివారణ ఆవశ్యకం—? (దోమల నివారణ, ఎలుకల నివారణ)

4. ఢిల్లీలో బలహీనవర్గాలు నివసించే ఒక కాలనీని అతి అమానుషంగా నేలమట్టం గావించిన వీరికి, ఇప్పుడు ఆ బలహీనవర్గాలపై చాలా ప్రేమ పుట్టుకొచ్చింది—? (ఇందిరాగాంధీ, సంజయ్ గాంధీ.)

5. ఇకమీదట మన సినిమాలలో వీటికి కొదవ వుండదు—? (ముద్దులు, కాబరేలు)

"లాభంలేదు-సరస్వతిని నువ్వు బలవంతంగా పెళ్ళి చేసుకోవాలి...." అన్నాడు మస్తాన్.

"కానీ మామయ్యకు తెలిసిందంటే...."

"మామయ్యకు తెలియకుండా ఎలా-అన్నీ తెలిసే లాగునే జరుగుతాయి...." అన్నాడు మస్తాన్ ఆలోచిస్తూ.

సరిగ్గా రెండ్రోజుల అనంతరం సుందర్రావు తన పనులు పూర్తిచేసుకుని ఊర్నించి తిరిగివచ్చాడు. తండ్రికి అన్నీ వివరంగా ఆ రోజునే చెప్పాలని అనుకుంది సరస్వతి. కానీ తొందరేముందిలే జగన్నాధం వచ్చేకనే చెప్పవచ్చునసుకుంది.

ఆ రోజు సాయంత్రం సుందర్రావింటిముందు ఒక జీపు ఆగింది. జీపులోంచి ఒక పోలీసాఫీసర్ దిగాడు. సుందర్రావుని పలకరించి—"మీరూ మీ అమ్మాయీ నాతో రావాల్సివుంది. ఎవరో యువకుడు ప్రాణావసానదశలో ఉన్నాడు. మీ పేరూ మీ అమ్మాయిపేరూ చెప్పి పలవరిస్తున్నాడు...." అన్నాడు.

సుందర్రావు సందేహించలేదు. సరస్వతికి అనుమానం రాలేదు. ప్రాణావసాన దశలో ఉన్న ఆ యువకుడు జగన్నాధం కాకూడదని ఆమె కోరుకుంటోంది.

జీపులో ఎక్కిన అయిదు నిముషాలకు తండ్రీ కూతుళ్ళిద్దరూ స్పృహ కోల్పోయారు. జీపు తిన్నగా ఎక్కడికో వెళ్ళింది.

స్పృహ వచ్చేసరికి ఇద్దరూ ఒక గదిలోవున్నారు. గదిలో ఇంకెవ్వరూ లేరు. గదికి రెండువైపులా తలుపు లున్నాయి. అవి వేసివున్నాయి.

చెప్తా వినండి?

1. శివుడికీ_కొబ్బరికాయకు ఒక చిన్న కనెక్షన్! శివుడికీ మూడుకళ్ళే. కొబ్బరికాయకు మూడుకళ్ళే.

2. ఎలక్ట్రిక్ ఫాన్ ఏ స్పీడులో తిరిగినా కరెంటు ఒకే రకంగా కాలుతుంది.

3. మనం పాలు త్రాగితే మన శరీరానికి యెటువంటి ప్రయోజనం కలుగుతుందో - ఆకుకూరలు తిన్నా అదే ప్రయోజనం కలుగుతుంది.

4. ఒకసారి తయారుచేసిన కూరల్ని - మళ్ళా వేడి చేయకూడదు. అలా చేసినందువల్ల అందులోవున్న విట మినులు చనిపోతాయి.

5. ఆదిత్, శాంత్, అస్కార్, బుత్, ప్రాహస్ పట్, నూక్ సెలర్, ఇది మంత్రమా? మంత్రంకాదు; విదేశాలలోవున్న బాబాల-స్వాముల పేర్లు ఇవి.

6. కొండ-చిలువలు సంవత్సరంన్నర కాలం ఏమీ ఆహారం తీసుకోకపోయినా బ్రతకగలుగుతాయి.

7. విమానంలో ప్రయాణం చేస్తున్నవారితో టెలి ఫోన్‌లో మాట్లాడే ఏర్పాటును బ్రిటిషు విజ్ఞానులు కనిపెట్టబోతున్నారు.

—యస్. సుధారాణి, మద్రాసు-35.

వాళ్ళకు స్పృహవచ్చిన అరగంటలో గది తలుపులు తెరుచుకున్నాయి. గదిలోకి ఒక మనిషి ప్రవేశించాడు.

అతని వయస్సు ముప్ఫై ఏళ్ళలా కనబడుతోంది కాని ఇంకా ఎక్కువవున్నా ఆశ్చర్యపడనవసరంలేదు. చాలా కర్కశంగా వుందతని ముఖం. కళ్ళు క్రూరంగా చూస్తున్నాయి.

"ఎవర్నువ్వు?"—అన్నాడు సుందర్రావు.

"నన్ను మస్తాన్ అంటారు...." అన్నాడతను.

సుందర్రావు గుండె లదిరాయి.

మస్తాన్ చిన్నప్యాకెట్ సుందర్రావు కందించి—"ఇందులో ఇడ్లీలున్నాయి? నువ్వూ నీ కూతురూ తినండి. ఆ మూల కూజాలో నీళ్ళున్నాయి. పక్కన గ్లాసుంది. మంచినీళ్ళు త్రాగండి. నేను వెడుతున్నాను. మళ్ళీ గంట పోయాక వస్తాను. ఈలోగా నువ్వు నీ కూతురికి మస్తానంటే ఎవరో-అతను కెదురుతిరిగిన వాళ్ళేమైపోతారో వివరంగా చెప్పు...." అన్నాడు.

సుందర్రావుకు పరిస్థితి అర్థంకాలేదు. మస్తాన్ వెళ్ళి పోగానే కూతురితో—"మస్తాన్ పేరు విన్నాను. చాలా భయంకరమైన వ్యక్తి అతను. మనలనెందుకు తీసుకు వచ్చాడో తెలియదు...." అన్నాడు.

ఇద్దరూ ఇడ్లీలుతిని మంచినీళ్ళు తాగారు.

అన్నప్రకారం ఒక గంటలో మస్తాన్ గదిలో ప్రవేశించాడు. అతని చేతిలో రివాల్వరుంది. అతని పక్కన చిన్న సైజు పర్వతంలా కనపడే ఒక మనిషివున్నాడు. ఆ మనిషి సుందర్రావుకీ,సరస్వతికీ చేతులూకాళ్ళూ కట్టేశాడు.

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెలనెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 లకే మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు రు. 5/- లు పంపవలసి వుంటుంది. పైకం మనియార్డరు ద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. సభ్యులకు పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి రు. 5-25 (అన్నిఖర్చులతో)లకే ప్రతినెలా వి.పి. ద్వారాగాని, మా ఏజెంట్ ద్వారాగాని పంపుతాము. మీ ఇంటిదగ్గరే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చు.

4. కాపీలు మీకు నెలనెలా రెగ్యులర్‌గా పంపబడతాయి. ఏ నెలలోనైనా మీరు కాపీలు తీసుకోకపోతే, వి. పి. తిరిగొస్తే మీ సభ్యత్వము రద్దవుతుంది.

5. మీ చిరునామా మారితే వెంటనే తెలియజేయాలి.

6. సభ్యులకు ఏవైనా పాతకాపీలు కావలిస్తే వాటిని అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకుంటే కొంత కన్సెషన్ కూడా లభిస్తుంది.

7. నెలనెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునే వారు, ఏడాది పైకము రు. 60/-లు ముందుగా పంపితే వారికి కాపీలు 'రికార్డెడ్ డెలివరీ'లో పంపగలము. కాపీలు మీకు గ్యారంటీగా చేరుతాయి. ఖర్చులుకూడా కొంత తగ్గుతాయి.

నేడే మీరు సభ్యులుగా చేరండి!

"దాన్ని ప్రవేశపెట్టు...." అన్నాడు మస్తాన్.

పర్వతం గదిలోంచి బయటకు వెళ్ళి రెండు నిముషాల్లో ఒక యువతితో లోపలకు వచ్చాడు. ఆ యువతి ఒంటి మీద నూలుపోగు కూడా లేదు. నోరుమాత్రం కట్టివేయ బడివుంది. ఆమె కళ్ళలో విపరీతమైన భయం కనబడు తోంది. మస్తాన్ ఆమెను సుందర్రావుకీ, సరస్వతికీ చూపించి "ఇది నన్నెదిరించింది. దీని బ్రతుకు చూడండి" అన్నాడు.

సరస్వతి, సుందర్రావు కూడా అప్పుడు అక్కడ జరిగిన దారుణహింసాకాండను చూశారు. ఆ హింసలో అనాగరికత్వం, దానవత్వం, అసభ్యత్వం వగైరాలన్నీ వున్నాయి. కాల్చినచాకు, బ్లేడు, సూదీదారం, కారం— వగైరాలుపయోగించాడు మస్తాన్. మనిషి మనిషిని అంత క్రూరంగా హింసించగలదని మొదటిసారిగా తెలుసుకుంది సరస్వతి. అంతా అయ్యేక—"దీన్ని తీసుకువెళ్ళి చచ్చేదాకా అందరూ అనుభవించండి...." అంటూ ఆమెను భయంకర పర్వతానికి అప్పగించాడు మస్తాన్.

"ఇప్పుడు మీకు ఇంటర్వెల్ ...." అన్నాడు మస్తాన్ చాలా తేలికగా.

అర్ధగంట అనంతరం ఇంటర్వెల్ ముగిసింది. ఈసారి గదిలోకి సుమారు నలభై యేళ్ళ పురుషుడు తీసుకురాబడ్డాడు. అతను కూడా పూర్తినగ్నంగా ఉన్నాడు. మనిషి కళ్ళలో భయం స్పష్టంగా కనబడుతోంది.

ఆ పురుషుణ్ణి గదిలో తలక్రిందులుగా వేళ్ళాడదీశారు. అతన్ని వేళ్ళాడదీసిన తాటిని ఒకపక్కగా అయిదునిమిషాల సేపు మెలితిప్పడం-అప్పుడు వదిలిపెట్టడం....అతను

అపరాధ పరిశోధన పోటీ-114 [ఫలితాలు]

జనవరి '78 నెల 'అపరాధ పరిశోధన పోటీ-114'కి సరియైన సమాధానాలు :

1. ఆంధ్ర.
2. పాము.
3. అనుకరణ.
4. విచారణసంఘాలు.
5. దినపత్రిక.

పై జవాబుల ప్రకారం యీ క్రింది పాఠకులు ఆల్ కరెక్టుగా పంపారు. వీరిలో శ్రీ డి. పోచయ్యాగారికి పోటీనిబంధనలు పాటించని కారణంగా బహుమతి నిరాకరించబడినది. మిగతా ఇద్దరు పాఠకులకు ఏప్రెల్ '78 నెల నుండి ఒక ఏడాదిపాటు సప్లిమెంట్ బహుమతి పంపగలము.

(1) శ్రీమతి జి. శోభ,
164, జగలక్ష్మి భవన్,
వెస్టు మారేడ్ పల్లి,
సికింద్రాబాదు.

(2) శ్రీ ఎన్. బాలరాజు,
మాతాహోటల్ కిళ్ళీషాపు,
స్టేషన్ రోడ్,
గుంటూరు-1.

(3) శ్రీ డి. పోచయ్యా,
టూ టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర,
కొత్త చెరువుకట్ట,
కరీంనగర్.

గిరగిరా తిరిగిపోయేవాడు. అలా నాలుగైదుసార్లాడుకున్నాడు మస్తాన్. ఆ తర్వాత కొరడాతీశాడు.

ఆ హింసను వర్ణించాలంటే మామూలునాలిక తిప్పు కోలేదు. ఆ ఆడమనిషికంటె ఎక్కువ అనాగరికంగా, అసభ్యంగా ఆ మగమనిషి హింసించబడ్డాడు. అంతా అయి పోయేక—"వీడిపని నువ్వు పూర్తిచేసేయ్ ..." అంటూ పర్వతానికి అప్పగించాడు. పర్వతం ఆ మనిషిని భుజం మీద వేసుకుపోయాడు.

"చూశారుగదా నా పద్ధతి. మరిప్పుడు మీరు నేను చెప్పిన మాట వినాలి...." అన్నాడు మస్తాన్.

"ఏమిటి నువ్వు చెప్పబోయే మాట?"—అన్నాడు సుందర్రావు.

"వినకపోతే ముందు నీకా మగవాడికి పట్టినగతి పడు తుంది. ఆ తర్వాత నీ కూతురికా ఆడమనిషికి పట్టినగతి పడుతుంది...." అన్నాడు మస్తాన్.

"అర్థమయింది. కానీ నీక్కావలిసిందేమిటో చెప్పు...."

"నేను చెప్పిన పని చేయడం...."

"ఏమిటా పని?"

"నీ కూతురు నేను చెప్పినవాణ్ణి పెళ్ళి చేసుకోవాలి!"

సుందర్రావు కంగారుగా — "ఎవరా వరుడు—" అన్నాడు.

"నీ మేనల్లుడు-వెంకన్నదొర!"—అన్నాడు మస్తాన్.

ఉన్నట్లుండి సుందర్రావు విరగబడి నవ్వడం ప్రారం భించాడు. మస్తాన్ ఆయనవంక చిరాగ్గాచూసి—"ఏం నేనంటే వేళాకోళంగా వుందా?"—అన్నాడు.

పాఠకుల అభిప్రాయాలు :

ఈనెల అపనలో సాగరసమరం, నల్లత్రాచు పిల్ల, రిక్షావాలీ — కథలు ఎక్సలెంట్‌గా ఉన్నాయి. సప్లిమెంట్‌లో 'జగత్ కిలాడీలు' నన్నెంతో ఆకర్షించింది.

—పి. వి. ఆనందరావు, చిలకలూరిపేట.

రావు చీప్‌లవ్ కథ, నల్లత్రాచుపిల్ల కథలు వెరైటీగా వున్నాయి. నవలల్లో నాకు బాగా నచ్చిన నవల 'మర్డర్ కాల్.'

—డాక్టర్. జి. అమరేందర్, వరంగల్-2.

ఈనెల సప్లిమెంట్‌లో మర్డర్‌కాల్, మృత్యుశిఖరం, నవలలు మంచి సస్పెన్స్‌గా వున్నాయి. కథలలో 'రంగు వెలిసిన చీరె' అద్భుతం.

— యస్. జయప్రద, విజయనగరం.

ముఖచిత్రాలు అందంగా వుంటున్నాయి. ఈనెల నవల్సులో వసుంధరగారి 'చట్టం-ధర్మం' చాలబాగుంది.

—ఆర్. శారద, పెంటాకలాన్.

రంగు వెలసిన చీరె, విష ఘడియలు, దెయ్యాలు ఎక్కడోలేవు — కథలు మళ్ళీ మళ్ళీ చదివించేలా వున్నాయి.ఉత్తమ రచనల సెలక్షన్ బావుండటం లేదు.

—అనూరాధా వినాయకబాబు, తిరుపతి.

నరాంతకులు, శానోర్యారా సీరియల్స్ అపన పత్రికలకే హైలైట్. వసుంధరగారి 'చట్టం-ధర్మం' నవల చాలా బావుంది.

—కె. అజిత్‌కుమార్, బి, సావరం.

ఉషారాణి, వసుంధర, సుజనశ్రీ గారల కథలు అద్భుతంగా ఉన్నాయి. జోక్స్ 'విట్టీగా' వున్నాయి.

—పక్కిరు బిక్షమయ్య, గుంటూరు-4.

"అంతేమరి-నా మేనల్లుణ్ణి నా అల్లుడిగా చేసుకోమని చెప్పడానికి నీవింత తతంగం చేయాలా? అసలు వాడ్ని నా ఇంట్లో ఎందుకు పెట్టుకున్నాను?"—అని మళ్ళీ చెప్ప సాగాడు సుందర్రావు.

మస్తాన్ తెల్లబోయినట్లు అతనిముఖమే చెబుతోంది. అయినా తమాయించుకుని—"అందుకు నీ కూతురొప్పు కోకపోతే...." అన్నాడు.

"అదెప్పుడూ నా మాట కాదనదు...." అని-"ఏమమ్మా—?" అంటూ కూతురివంక ప్రశ్నార్థకంగా చూశాడు సుందర్రావు.

అప్పటివరకూ చూపిన హింసాకాండతో సరస్వతి మతిపోయినట్లయింది. తన జవాబుమీద తండ్రిదీ, తన్న కూడా భవిష్యత్తాధారపడి వుందని తెలియడంవల్ల చటుక్కున "ఊఁ"—అన్నదామె.

ఆ రాత్రికి వాళ్ళిద్దరూ ఆ గదిలోనే నిద్రపోయారు. తెల్లవారేసరికి లేచిచూస్తే తమ ఇంట్లో వున్నారు. జరిగినది కల కాదనడానికి సూచనగా-తను చెప్పినది మరిచిపోవద్దని హెచ్చరిస్తూ సంతకంలేకుండా వ్రాసిన మస్తాన్ వుత్తరం సుందర్రావు జేబులోవుంది.

కాలకృత్యాలు తీర్చుకుని కాస్త స్థిమితపడ్డాక తండ్రీ కూతుళ్ళిద్దరూ విషయాన్ని చర్చించారు.

"విన్నిచ్చి పెళ్ళిచేద్దామనే దొర నిక్కడికి తీసుకు వచ్చాను. కానీ వాడి బుద్ధులు మంచివికావని తెలిపి పోయింది. విన్నటి సంఘటనతో వాడు చాలా ప్రమాద

చెప్పుకోండి చూద్దాం?

1. హంతకుడు హత్యకు ఉపయోగించిన కత్తిని తీసుకుని, హత్యా ప్రదేశంలో వేరేకత్తిని వదిలివెళ్ళాడు. పోలీసులు ఆ కత్తిని కోర్టులో 'ఎగ్జిబిట్' చేస్తారా?

2. సమన్లు పంపినాకూడా కోర్టుకు హాజరుకాని వ్యక్తిని నేరుగావెళ్ళి అరెస్టు చేయవచ్చునా?

3. ఒకవ్యక్తిని హత్యచేసి, శవాన్ని పూడ్చిపెట్టిన హంతకునిపై, శిక్ష ఏ రకంగా ఉంటుంది?

4. జైలునుండి పారిపోతున్న నేరస్తుడ్ని అధికారులు పిస్తోలుతో కాల్చి చంపితే, నేరం అవుతుందా?

5. 'మరణ వాఙ్మూలాన్ని' ఏ భాషలోనయినా వ్రాయవచ్చా?

—కె. చందర్‌రావ్.

—):o:(—

జవాబులు :

1. చేస్తారు.
2. చేయవచ్చును.
3. హత్యకన్నా రెండురెట్లు ఎక్కువగా శిక్ష వుంటుంది.
4. కాదు.
5. వ్రాయవచ్చును.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోసుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి ఈ నెల 10వ తేదీలోపల మాకు చేరేట్లు పంపండి.

ఇదే విధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. పా.సం. సభ్యులు తమ నెంబరును స్పష్టంగా వ్రాయాలి. ఇతరులు తమవ్యాఖ్యలతో 30 పైసల స్టాంపులు జతపర్చి పంపాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 20/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. ★

గత నెల పోటీ ఫలితాలు

(1) ఫిబ్రవరి '78 నెల "అపరాధ పరిశోధన" మాసపత్రిక ముఖచిత్రాలకు బహుమతి పొందినవ్యాఖ్య:

ఆదిమానవుని అవతారం!

పిశాచాల ఆర్భాటం !!

పంపినవారు: శ్రీమతి గరిమెళ్ళ వనజ (టీచరు), ఖైరతాబాదు, హైద్రాబాదు-4.

(2) సప్లిమెంటుకు బహుమతి పొందిన వ్యాఖ్య:

గురిపెట్టిన గూఢచారి!

గుండెలు తీసే యువజోడీ !!

పంపినవారు: శ్రీ కె. నాగభూషణ, టెలిఫోన్ ఎక్ఛేంజ్, దేవనహళ్ళి, (బెంగుళూరు జిల్లా.)